ప్రభాతనవ

SINGIDI | తెలుగు దినపత్రిక

# సింగిడి

ప్రతి రంగూ ఓ నిజం

singidinews.com

సోమవారం 7 సెప్టెంబర్ 2026 | సంపుటి: 1 | సంచిక: 82 | పేజీలు 12 | వెల: 6.50

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nizamabad,Mahabubnagar

ఇండోనేషియాలో బద్దలైన

## అగ్నిపర్వతం

209 విమాన సర్వీసులకు అంతరాయం

ఇండోనేషియాలోని అనక్ క్రాకటౌ అగ్నిపర్వతం ఆదివారం తెల్లవారుజామున బద్దలైంది . దాని నుంచి దాదాపు 50,000 అడుగుల ఎత్తుకు మందపాటి బూడిద ఎగసిపడి సమీప గ్రామాలను కప్పివేసింది

–న్యూఢిల్లీ (సింగిడి)



2



## హర్మూజ్‌లో ఆగని ఉద్రిక్తతలు

అమెరికా యుద్ధనౌకలపై ఇరాన్ ఎటాక్

2


# రగులుతున్న రాజకీయాలు

## అధికారంలో మారుతున్న లెక్కలు

- వ్యవస్థ పేరుతో వ్యక్తి ఎజెండా
- ఇంట్లో అసంతృప్తి... బయట అధికారం
- గొంతులోనే ఆగిపోతున్న అభిప్రాయం
- నేతల మదిలో అంతర్మథనం
- ఒక్క నిర్ణయం.. ఎన్నో సందేహాలు
- గత తీర్పు చెప్పిన గట్టి గుణపాఠం

*ఇంట గెలిచి రచ్చ గెలవాలి అంటారు. ఇది పాత సామెతే అయినా నేటి రాజకీయాలకు సరిగ్గా సరిపోతుంది. ఇంట్లోనే అసంతృప్తి మొదలైతే.. బయట కనిపించే బలం ఎంతోకాలం నిలవదు. ప్రజా తీర్పుతో దక్కిన అధికారం.. వ్యక్తిగత ఆధిపత్యానికి కాదు.. సంస్థాగత పాలనకు పరీక్ష. ఒకప్పుడు ఓ నాయకుడి చుట్టూనే తెలంగాణ రాజకీయాలు కేంద్రీకృతమయ్యాయి. కాలం మారింది. తీర్పు మారింది. పగ్గాలు చేతులు మారాయి. మరి ఇప్పుడు అదే చరిత్ర మరో రూపంలో కనిపిస్తోందా? అనే చర్చ మొదలైంది.*

- హైదరాబాద్ బ్యూరో (సింగిడి)



### అధికారం మారినా తీరు మారదా..

పగ్గాలు ఎవరి చేతిలో ఉన్నా.. సంస్థాగత గౌరవం తగ్గకూడదు. పార్టీలో నిర్ణయాలకు పద్ధతి ఉండాలి. మంత్రివర్గంలో భిన్నాభిప్రాయాలకు చోటుండాలి. ఎమ్మెల్యేలకు తమ గళం వినిపించే అవకాశం దక్కాలి. ఏకపక్ష ధోరణి తొలినాళ్లలో బలంగా కనిపించినా.. క్రమంగా దూరాలు పెంచొచ్చు. తాజాగా ఓ మంత్రి పరిణామం ఈ అంశాన్ని మరోసారి తెరపైకి తెచ్చింది. చర్య అవసరమైందా? కాదా? కంటే.. నిర్ణయం ఏ విధానంలో వెలువడింది? అన్నదే ఇప్పుడు చర్చ.

### ఒకరితో మొదలైన చర్చ..

రాజకీయాల్లో ఓ పరిణామం అక్కడితో ఆగదు. ఒక్క చిచ్చు అడవంతా కాలుస్తుంది అన్నట్టుగా.. ఒక నిర్ణయం మిగతా నేతల ఆలోచనలనూ ప్రభావితం చేయొచ్చు. ఈ రోజు ఒకరు.. రేపు మరొకరు.. అనే ఊహాగానాలు మొదలైతే.. అది వ్యక్తిగత అంశాన్ని దాటి సమష్టి విశ్వాసానికి చేరుతుంది. సహచరుల్లో నిజంగానే అలాంటి భయం ఉందా? అనేది తేలాల్సిందే. అయితే "తర్వాత ఎవరి వంతు?" అనే మాట వినిపిస్తే.. దాన్ని అంత ఈజీగా విస్మరించలేం.

### గత గుణపాఠం ఏంటి?

పదేళ్ల ఆధిపత్యం చూపిన రాజకీయ శక్తి.. చివరకు ప్రజా తీర్పు ముందు వెనక్కి తగ్గింది. దానికి ఒక్క కారణం కాదు. ఎమ్మెల్యేల వ్యవహారశైలి.. ఫిరాయింపులు.. పాలనపై అసంతృప్తి.. అంతర్గత పరిణామాలు.. ఇలా ఎన్నో అంశాలు ఫలితాన్ని మార్చాయి. చెట్టు ఎంత పెద్దదైనా.. గొడ్డలి దెబ్బకు కూలాల్సిందే. పీఠం ఎంత బలంగా కనిపించినా.. ప్రజల నమ్మకం సడలితే పరిస్థితులు మారిపోతాయి. గతాన్ని ప్రశ్నించినవారు.. ఆ అనుభవాల నుంచి పాఠాలు తీసుకోవాలి.

### వ్యవస్థల పేరుతో..

ఇక్కడే అసలు ప్రశ్న మొదలవుతుంది. పార్టీ ఉంది. కమిటీలు ఉన్నాయి. మంత్రివర్గం ఉంది. అధికార యంత్రాంగం ఉంది. రాజ్యాంగపరమైన విధానాలున్నాయి. మరి వీటి వెనుక నిజంగా సంస్థలు పనిచేస్తున్నాయా? లేక వాటి పేరుతో వ్యక్తుల ఆలోచనలే అమలవుతున్నాయా? అన్న సందేహం తలెత్తితే.. అది చిన్న విషయం కాదు. బలమైన నాయకత్వం అంటే ఏ అంశమైనా ఒకరి చుట్టూ తిరగడం కాదు. సహచరులను కలుపుకోవడం.. భిన్న స్వరాలకు విలువ ఇవ్వడం.. పొరపాట్లకు బాధ్యత నిర్ణయించడం. ఇదే ప్రజాస్వామ్య పాలనకు కొలమానం.

### ప్రజలు గమనించేది ఇదే

*ఎవరు మంత్రి? ఎవరు పదవిలో ఉన్నారు? ఎవరు బయటకు వెళ్లారు? అన్నదానికంటే.. పాలన ఎలా సాగుతోందన్నదే ప్రజలకు ముఖ్యం. పార్టీలో అంతరత ప్రజాస్వామ్యం ఉందా? ఎమ్మెల్యేలకు స్వేచ్ఛ ఉందా? మంత్రులకు భాగస్వామ్యం దక్కుతోందా? సంసలు వ్యక్తుల కంటే బలంగా ఉన్నాయా? అన్నదే వారు గమనిస్తారు.*

*వ్యక్తుల చుట్టూ అధికారం కేంద్రీకృతమైతే.. వ్యవసలు బలహీనపడతాయి. వ్యవసలే బలపడితే.. వ్యక్తులు మారినా పాలన కొనసాగుతుంది. గత తీర్పు ఇదే గుణపాఠాన్ని అందించింది. ఇప్పుడు ఆ పాఠాన్ని పాలకులు ఎంతవరకు ఆచరిస్తారన్నదే అసలు ప్రశ్న.*



2

కఠిన చర్యలు తీసుకోకపోతే

## పరువు తీస్తా

- డీజీపీని ఉద్దేశిస్తూ ఘాటు వ్యాఖ్యలు చేసిన కవిత
- కవితపై సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేసిన కానిస్టేబుల్
- సస్పెండ్ చేసి సరిపెట్టారని మండిపాటు

తనపై సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేసిన కానిస్టేబుల్‌ను కేవలం సస్పెండ్ చేసి సరిపెట్టారంటూ తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కల్వకుంట్ల కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలను దూషిస్తే మూడేళ్ల జైలు శిక్ష పడే చట్టాలు ఉన్నప్పటికీ పోలీసు యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని, సదరు కానిస్టేబుల్‌పై కఠిన చర్యలు తీసుకోకపోతే అంతర్జాతీయ స్థాయిలో ఈ ప్రభుత్వ పరువు తీస్తానని హెచ్చరించారు.

హైదరాబాద్, సెప్టెంబర్ 6 (సింగిడి)




## ఇస్రో ప్రైవేటీకరణ

వార్తలను ఖండించిన భారత అంతరిక్ష సంస్థ

- మా పాత్ర తగ్గదు, మరింత కీలకమవుతుందని స్పష్టీకరణ
- అధునాతన పరిశోధనలపై దృష్టి పెడతామన్న ఇస్రో
- ప్రైవేట్ రంగ భాగస్వామ్యం సామర్థ్యాన్ని పెంచడానికేనని వెల్లడి
- 2035 నాటికి భారతీయ అంతరిక్ష్ స్టేషన్ ఏర్పాటు లక్ష్యం

2

## ఎస్‌బీఐ భారీ విస్తరణ

12,000 కొత్త ఉద్యోగాలు, 250 కొత్త బ్రాంచ్‌లు




2

- ఈ ఆర్థిక సంవత్సరంలో కొత్త ఉద్యోగుల నియామకానికి ఎస్‌బీఐ ప్లాన్
- క్లరికల్, ఆఫీసర్ కేడర్లలో ఉద్యోగాల భర్తీ
- దేశవ్యాప్తంగా భారీ సంఖ్యలో కొత్త బ్రాంచ్‌ల ఏర్పాటుకు నిర్ణయం
- వివరాలను వెల్లడించిన ఎస్‌బీఐ ఛైర్మన్ సి.ఎస్. శెట్టి

## నగరవాసులకు శుభవార్త

ఆర్టీసీ, మెట్రో రైలుకు ఇక ఒకే పాస్

**ప్రజా రవాణా వ్యవస్థ విషయంలో ప్రభుత్వం మరో విప్లవాత్మక నిర్ణయం**

హైదరాబాద్ నగర ప్రయాణికులకు ఆర్టీసీ, మెట్రో రైలు సేవలను మరింత సులువుగా, ఒకే టికెట్ విధానంలో అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి పాస్ విధానాన్ని త్వరలో అందుబాటులోకి తీసుకురానుంది. ఈ ఉమ్మడి పాస్‌ల జారీ ప్రక్రియపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.

హైదరాబాద్, సెప్టెంబర్ 6 (సింగిడి)

2




## కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలన

# అట్టర్ ఫ్లాప్

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

- ఎర్రవల్లిలో మాజీ సీఎం కేసీఆర్ అధ్యక్షతన
- బీఆర్ఎస్ శాసనసభాపక్ష సమావేశం
- హాజరైన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు
- బీఆర్ఎస్ కార్యాచరణపై ఎమ్మెల్యేలకు కేసీఆర్ దిశానిర్దేశం

కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలన డిజాస్టర్, అట్టర్ ఫ్లాప్ అని మాజీ సీఎం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ విమర్శించారు. కేసీఆర్ అధ్యక్షతన సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలో ఆ పార్టీ శాసనసభాపక్ష (బీఆర్ఎస్ఎల్పీ) సమావేశం జరిగింది. ఈ సమావేశానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరయ్యారు. అసెంబ్లీ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై బీఆర్ఎస్ నేతలతో ఆయన చర్చించారు. బీఆర్ఎస్ కార్యాచరణపై ఎమ్మెల్యేలకు కేసీఆర్ దిశానిర్దేశం చేశారు. తమ ప్రభుత్వం పోవడం ఖాయమని కాంగ్రెస్ నేతలకు అర్థమైందన్న కేసీఆర్, అందువల్లనే అడ్డగోలు దోపిడీ చేస్తున్నారని విమర్శించారు.

- హైదరాబాద్, సెప్టెంబర్ 6 (సింగిడి)

2



నీళ్ల కోసం త్వరలో

## పాదయాత్ర చేస్తా

బీఆర్ఎస్ఎల్పీ భేటీలో కేసీఆర్ సంచలన ప్రకటన





అది గౌరవ సభ కాదు..

## కౌరవ సభ

*బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు నిప్పులు చెరిగారు. గౌరవం లేని సభలో కేసీఆర్ చర్చల్లో పాల్గొనాల్సిన అవసరం లేదని మా పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అభిప్రాయపడ్డారని, ఇది గౌరవ సభ కాదు.. కౌరవ సభ అని హరీశ్‌రావు పేర్కొన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తో శాసనసభాపక్ష సమావేశం ముగిసిన అనంతరం హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు.*

- హైదరాబాద్, సెప్టెంబర్ 6 (సింగిడి)

2

కేసీఆర్ రాజీనామా చెయ్యాలని

## కాంగ్రెస్ మహాధర్నా

మంత్రి శ్రీధర్ బాబు తీవ్ర హెచ్చరిక



తెలంగాణా రాష్ట్రంలో ఆసక్తికర పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. అసెంబ్లీ సమావేశాల వేళ అధికార కాంగ్రెస్ మహా ధర్నా చేయటం ఆసక్తిగా మారింది. ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తన ఎమ్మెల్యే పదవికి వెంటనే రాజీనామా చేయాలంటూ కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు.

2

- హైదరాబాద్, సెప్టెంబర్ 6 (సింగిడి)

## 2040 వరకు మాదే అధికారం



కాంగ్రెస్, బీఆర్ఎస్ పాలన మధ్య తేడాపై చర్చకు సిద్ధమన్న మహేశ్ గౌడ్

2

- కేటీఆర్ సోషల్ మీడియాలో క్షణికానందం పొందుతున్నారని ఎద్దేవా
- తెలంగాణ మట్టిలో బీఆర్ఎస్ అనే మొక్క వాడిపోయిందని వ్యాఖ్య

## ఇండోనేషియాలో బద్దలైన
# అగ్నిపర్వతం

ఇండోనేషియాలోని అనక్ క్రాకటౌ అగ్నిపర్వతం ఆదివారం తెల్లవారుజామున బద్దలైంది . దాని నుంచి దాదాపు 50,000 అడుగుల ఎత్తుకు మందపాటి బూడిద ఎగసిపడి సమీప గ్రామాలను కప్పివేసిందని వోల్కనాలజీ అండ్ జియోలాజికల్ హజార్డ్ మిటిగేషన్ అధికారులు పేర్కొన్నారు. ఇది శుక్రవారం నుంచి క్రియాశీలంగా ఉన్నట్లు తెలిపారు. దీంతో వెంటనే స్థానిక గ్రామాలను ఖాళీ చేయించామని.. పర్వతారోహకులకు, సందర్శకులకు అనుమతి నిలిపివేశామని వెల్లడించారు. ఈ ఘటనలో ఎటువంటి ప్రాణ నష్టం చోటుచేసుకోలేదు. పర్వతం నుంచి బూడిద భారీగా ఎగసిపడుతుండడంతో సుకర్నో-హట్టా అంతర్జాతీయ విమానాశ్రయంలో అన్ని సర్వీసులను రద్దు చేసినట్లు ఇండోనేషియా పౌర విమానయాన డైరెక్టరేట్ జనరల్ వెల్లడించారు. దీనివల్ల 209 విమాన రాకపోకలు, సుమారు 22,800 మంది ప్రయాణికులపై ప్రభావం పడిందన్నారు

# హర్మూజ్‌లో ఆగని ఉద్రిక్తతలు

## అమెరికా యుద్ధనౌకలపై ఇరాన్ ఎటాక్

**న్యూఢిల్లీ (సింగిడి)**

ఇరాన్– అమెరికా దేశాల మధ్య పరస్పర దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. ఈ ఘర్షణలను తీవ్రం చేస్తూ.. ఐఆర్‌జీసీ దళాలు అగ్రరాజ్యానికి చెందిన విమాన వాహక నౌక, డెస్ట్రాయర్‌పై బాలిస్టిక్ క్షిపణులతో విరుచుకుపడ్డాయి. అమెరికా యుద్ధ నౌకలు హర్మూజ్‌లో ఇరాన్ ట్యాంకర్లను అడ్డుకుంటుండడంతో.. వాటిని లక్ష్యంగా చేసుకున్నట్లు టెహ్రాన్ ప్రకటించింది.

ఈ దాడుల్లో అమెరికా యుద్ధ నౌకలు తీవ్రంగా దెబ్బతిన్నాయని, ఆ తర్వాత అవి హర్మూజ్‌ను విడిచి వెళ్లిపోయాయని తెలిపింది. శనివారం హర్మూజ్‌లోని ఇరాన్ చమురు ట్యాంకర్లపై అమెరికా దాడుల అనంతరం ఐఆర్‌జీసీ ఈ దాడులకు పాల్పడింది. హర్మూజ్‌లో అనధికారిక మార్గాల్లో ప్రయాణిస్తున్న మూడు ట్యాంకర్లను, అమెరికాకు అనుబంధంగా ఉన్న మరో మూడు నౌకలను కూడా లక్ష్యంగా చేసుకున్నట్లు ఇరాన్ తెలిపింది.

ఇరాన్ నౌకల విషయంలో అమెరికా దూకుడుగా వ్యవహరిస్తూ దాడులు కొనసాగిస్తే తమ నుంచి గట్టి ప్రతిస్పందనను ఎదుర్కోవాల్సి ఉంటుందని, ఆ దేశ సైనిక నౌకలపై దాడులను మరింత తీవ్రతరం చేస్తామని ఐఆర్‌జీసీ హెచ్చరించింది. గతంలో కంటే తాము ఇప్పుడు మరింత బలంగా ఉన్నామని పేర్కొన్నది. కాగా మరోవైపు ఇరాన్ దాడుల నుంచి తమ నౌకలు సురక్షితంగా తప్పించుకున్నాయని అమెరికా ప్రకటించింది.

ఇరాన్ దాడుల్లో తమ సిబ్బందికి ఎటువంటి గాయాలు కాలేదని, అందరూ సురక్షితంగా ఉన్నారని పేర్కొన్నది. తమ నౌకాదళాన్ని లక్ష్యంగా చేసుకుంటే ఇరాన్ నౌకలపై దాడులు మరింత తీవ్రం చేస్తామని హెచ్చరించింది.

# కఠిన చర్యలు తీసుకోకపోతే పరువు తీస్తా

బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన కవిత, "డీజీపీ గారికి ఇద్దరు కోడళ్లు ఉన్నారు. వారిపై ఇలాగే కామెంట్లు చేస్తే ఊరుకుంటారా? నాలాంటి ప్రజాప్రతినిధికే రక్షణ లేకపోతే సాధారణ మహిళల పరిస్థితి ఏమిటి?" అని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఈ డీజీపీ బాధ్యతలు స్వీకరించాకే క్రైమ్ రేటు పెరిగిందని, గంజాయి విక్రయాలపై సిగ్గుచేటు వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. ఎన్నికలకు ముందు తెలంగాణ ఉద్యమకారుల కాళ్లు పట్టుకున్న రేవంత్ రెడ్డి, అధికారంలోకి వచ్చాక మూడేళ్ల పాలనలో వారిని పూర్తిగా విస్మరించారని కవిత ధ్వజమెత్తారు. ఉద్యమకారుల్లో ఉన్న నమ్మకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం వమ్ము చేసిందని, ఇక మిగిలింది ఆమరణ దీక్ష మాత్రమేనని స్పష్టం చేశారు. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లోనే ఉద్యమకారుల సంక్షేమంపై స్పష్టమైన గడువుతో కూడిన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని తప్పుడు లెక్కలు చూపిన కాంగ్రెస్, ఇప్పుడు బీసీల కోసం ధర్నాలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

# ఇస్రో ప్రైవేటీకరణ

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 6 (సింగిడి)**

భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో)ను ప్రైవేటీకరిస్తున్నారంటూ గత కొద్ది రోజులుగా మీడియాలో వస్తున్న ఊహాగానాలకు సంస్థ ఆదివారం పూర్తిస్థాయిలో తెరదించింది. ఇస్రోను ప్రైవేటీకరించే ఆలోచన లేదని, దేశ అంతరిక్ష ప్రయోగాలలో దాని ప్రాధాన్యం ఎప్పటికీ తగ్గదని స్పష్టం చేసింది. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా ఒక సుదీర్ఘ ప్రకటన విడుదల చేసింది.

ఇస్రో భవిష్యత్ పాత్రపై కొన్ని మీడియా సంస్థలు అసత్యాలు, తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేస్తున్నాయని, ఈ కథనాలు పూర్తిగా నిరాధారమైనవని ఇస్రో పేర్కొంది. "ఇస్రోను ప్రైవేటీకరించరు, దాని ప్రాముఖ్యాన్ని తగ్గించరు. అత్యాధునిక అంతరిక్ష పరిశోధనలు, సాంకేతిక అభివృద్ధి, వ్యూహాత్మక ప్రయోగాలు, అంతరిక్ష విజ్ఞానం, అన్వేషణ వంటి కీలక రంగాలలో ఇస్రో దేశానికి ప్రధాన సంస్థగా కొనసాగుతుంది" అని ఆ ప్రకటనలో తేల్చిచెప్పింది.అంతరిక్ష రంగంలో ప్రైవేట్ భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం వెనుక ఉద్దేశం ఇస్రో పాత్రను తగ్గించడం కాదని, మరింత ఉన్నతమైన లక్ష్యాలపై దృష్టి సారించేలా చేయడమేనని వివరించింది. 2020లో ప్రారంభమైన సంస్కరణలు, 2023 భారత అంతరిక్ష విధానం ద్వారా దేశంలో బలమైన, ప్రపంచంతో పోటీపడగల అంతరిక్ష పర్యావరణ వ్యవస్థను నిర్మించడమే లక్ష్యమని తెలిపింది. దీనివల్ల ఇస్రో ప్రాధాన్యం తగ్గదని, భారత అంతరిక్ష పర్యావరణ వ్యవస్థ స్వరూపం, సామర్థ్యం విస్తరిస్తాయని పేర్కొంది.సాంకేతికంగా అభివృద్ధి చెందిన, పునరావృతమయ్యే పనులను పరిశ్రమలకు అప్పగించడం ద్వారా ఇస్రో శాస్త్రవేత్తలు, సిబ్బంది తమ సమయాన్ని అధునాతన పరిశోధనలు (ఆర్ అండ్ డీ), కొత్త తరం టెక్నాలజీలు, సంక్లిష్టమైన జాతీయ ప్రాజెక్టులపై కేంద్రీకరించగలరని ఇస్రో తెలిపింది. ఇది "ఇస్రో నేతృత్వంలోని జాతీయ అంతరిక్ష పర్యావరణ వ్యవస్థ"కు నాంది పలుకుతుందని వివరించింది.

**భవిష్యత్ లక్ష్యాలు ఇవే..**

భవిష్యత్తులో ఇస్రో పాత్ర మరింత బలోపేతం కానుంది. ముఖ్యంగా, మానవసహిత అంతరిక్ష యాత్రలు (గగన్‌యాన్), కొత్త తరం ప్రయోగ వాహనాలు, చంద్రుడు, ఇతర గ్రహాలపై పరిశోధనలు, 2035 నాటికి 'భారతీయ అంతరిక్ష్ స్టేషన్' ఏర్పాటు, 2040 నాటికి చంద్రుడిపైకి భారతీయుడిని పంపడం వంటి భారీ లక్ష్యాలపై ఇస్రో దృష్టి పెడుతుంది.

ప్రస్తుతం 8.4 బిలియన్ డాలర్లుగా ఉన్న భారత అంతరిక్ష ఆర్థిక వ్యవస్థను 2033 నాటికి 44 బిలియన్ డాలర్లకు పెంచడమే లక్ష్యం. ఈ స్థాయి వృద్ధిని కేవలం ప్రభుత్వ వనరులతో సాధించడం అసాధ్యమని, దీనికి ప్రైవేట్ పెట్టుబడులు, పారిశ్రామిక సామర్థ్యం, ప్రపంచ మార్కెట్ అవసరమని ఇస్రో స్పష్టం చేసింది. 2020లో కొన్ని మాత్రమే ఉన్న స్పేస్ స్టార్టప్‌లు, నేడు 450కి పైగా పెరగడమే ఈ సంస్కరణల విజయానికి నిదర్శనమని పేర్కొంది.

## 2040 వరకు
# మాదే అధికారం

కేసీఆర్ రాజీనామా చేయాలంటూ హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ ధర్నాచౌక్ వద్ద కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన మహాధర్నాలో మాట్లాడిన ఆయన, వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనకు, పదేళ్ల బీఆర్‌ఎస్ దుర్మార్గానికి మధ్య తేడాపై ఎక్కడైనా బహిరంగ చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని, బీఆర్‌ఎస్ నాయకులకు ఆ సవాల్‌ను స్వీకరించే ధైర్యం ఉందా? అని నిలదీశారు. గతంలో కేసీఆర్ చేసిన కొండంత అప్పులను మోస్తూనే తమ ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని, దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా నిరుపేదలకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని గుర్తుచేశారు. కేటీఆర్ కేవలం సోషల్ మీడియాకే పరిమితమై క్షణికానందం పొందుతున్నారని, ఆయన చదువుకున్నప్పటికీ సంస్కారం లేని రీతిలో ప్రవర్తిస్తున్నారని మహేశ్ గౌడ్ దుయ్యబట్టారు. తెలంగాణ సంస్కృతిని కాపాడుతూ గద్దర్, అందెశ్రీ, పూలే, సర్దార్ సర్వాయి పాపన్న వంటి మహనీయులను గౌరవించిన ఘనత కాంగ్రెస్‌దేనని తెలిపారు. కేసీఆర్ తన కొడుకు, అల్లుడి రాజకీయ ప్రయోజనాల కోసం ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యారని, అసెంబ్లీకి వచ్చి ప్రజా సమస్యలపై మాట్లాడటంలో ఘోరంగా విఫలమయ్యారని విమర్శించారు. కేసీఆర్ చేతకాకపోతే రాజీనామా చేసి తప్పుకోవాలని హితవు పలికారు. రాష్ట్రాన్ని దశాబ్దాల పాటు ఏలే శక్తి కాంగ్రెస్‌కు ఉందని, తెలంగాణలో 2040 వరకు తమ ప్రభుత్వమే అధికారంలో ఉంటుందని తేల్చిచెప్పారు.

# కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలన అట్టర్ ఫ్లాప్




పాలన చేతకాకే సీఎం రేవంత్ రెడ్డి అభ్యంతరకరంగా బూతుపురాణం చేస్తున్నారని, అలాంటి వారితో చర్చలకు అసెంబ్లీకి రావాలా? అని నిలదీశారు. తన చావు కోరుతూ పదేపదే స్పీచ్‌లు ఇస్తున్నారని, అసెంబ్లీకి రావాలని ధర్నాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రభుత్వంపై గట్టిగా పోరాడాలి : కృష్ణా, గోదావరి నదీ జలాల అంశంపై ఉధృతమైన పోరాటం చేయాలని బీఆర్‌ఎస్ సభ్యులకు కేసీఆర్ తెలిపారు. ఉద్దేశపూర్వకంగా రైతులకు సాగునీరు ఇవ్వకుండా ప్రభుత్వం గోస పెడుతోందని, రాజకీయాల కోసం అద్భుతమైన కాళేశ్వరం ప్రాజెక్టును పడావు పెట్టారని విమర్శించారు. ప్రాజెక్టుల పంపులు ఎందుకు ఆన్ చేయడం లేదని ప్రశ్నించారు. కాళేశ్వరం, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుల దగ్గరకు వెళ్దామని, నియోజకవర్గాల పునర్విభజన కచ్చితంగా జరుగుతుందని అన్నారు. అసెంబ్లీ, కౌన్సిల్ సమావేశాల్లో ప్రభుత్వంపై గట్టిగా పోరాడాలని ఆదేశించారు. సమావేశంలో తన గురించే ఎక్కువ మాట్లాడే ప్రయత్నం చేస్తారని, పట్టించుకోకూడదని పేర్కొన్నారు.

ఉభయసభల్లో ఎండగట్టాలి : అసెంబ్లీ సమావేశాలకు అందరూ తప్పకుండా హాజరుకావాలని, శాసనసభ, మండలిలో జరిగే ప్రతి చర్చలో పాల్గొనాలని బీఆర్‌ఎస్ సభ్యులకు కేసీఆర్ తెలిపారు. అసెంబ్లీ సమావేశాలను ఎవరూ తేలిగ్గా తీసుకోవద్దని సూచించారు. కాంగ్రెస్, బీజేపీ విధానాలను ఉభయసభల్లో ఎండగట్టాలని, స్పీకర్ పక్షపాత ధోరణి, అప్రజాస్వామిక విధానాలు ఎండగట్టాలని, ఉభయ సభల్లో ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయాలని ఆదేశించారు. అసెంబ్లీలో ప్రజల అజెండానే బీఆర్‌ఎస్ అజెండాగా ఉండాలని వెల్లడించారు.

## నీళ్ల కోసం త్వరలో పాదయాత్ర చేస్తా

సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలోని ఫామ్‌హౌస్‌లో బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ అధ్యక్షతన ఇవాళ జరిగిన బీఆర్‌ఎస్‌ఎల్పీ సమావేశం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ సమావేశంలో కేసీఆర్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల పరిస్థితి, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజల్లోకి వెళ్లానంటూ ప్రకటించారు. త్వరలోనే తాను స్వయంగా కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాలను సందర్శించనున్నట్లుగా బీఆర్ఎల్పీలో ప్రకటించారు. కేవలం కొద్ది మంది నేతలతో కాకుండా, ఏకంగా లక్ష మందితో కలిసి ఆ రెండు ప్రాజెక్టులను సందర్శిస్తానని వెల్లడించారు. అంతేకాకుండా, రాష్ట్రంలో సాగునీటి సంక్షోభం, ప్రాజెక్టుల నిర్లక్ష్యంపై ప్రజలను చైతన్యపరిచేందుకు నీళ్ల కోసం త్వరలోనే భారీ పాదయాత్ర కూడా చేపడతానని ప్రకటించారు. ఇక రేపటి నుంచి ప్రారంభం రాబోయే అసెంబ్లీ సమావేశాలను సమర్థవంతంగా ఎదుర్కొంటూనే, మరోవైపు ప్రజాక్షేత్రంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమ కార్యాచరణను తీవ్రతరం చేయాలని కేసీఆర్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు దిశానిర్దేశం చేశారు.

# అది గౌరవ సభ కాదు.. కౌరవ సభ

నేటి నుంచి అసెంబ్లీలో అనుసరించాల్సిన వ్యూహంపై కేసీఆర్ అధ్యక్షతన చర్చించడం జరిగింది. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొని బీఆర్‌ఎస్ అనుసరించాల్సిన వ్యూహాన్ని ఖరారు చేశారు. కాంగ్రెస్ పాలన వెయ్యి రోజుల సందర్భంగా ప్రజలందరూ ఇబ్బందుల్లో ఉన్నారు. అన్ని వర్గాలను ఈ ప్రభుత్వం మోసం చేసింది. విద్యార్థులకు, ఉద్యోగులకు, నిరుద్యోగులకు, రైతులకు, మహిళలకు, దళితులకు, గిరిజనులకు, బలహీనవర్గాలకు రేవంత్ సర్కార్ తీరని ద్రోహం తలపెట్టింది. నెల రోజులు సభను నడపాలని బీఏసీ సమావేశంలో డిమాండ్ చేయాలని నిర్ణయించడం జరిగిందని హరీశ్‌రావు తెలిపారు.




**22ఏపై గట్టిగా నిలదీయాలని నిర్ణయించాం.**

ముఖ్యంగా కాళేశ్వరం జలాల ఎత్తిపోతల విషయంలో అవకాశం ఉన్నా కూడా కాళేశ్వరం జలాలు ఎత్తకుండా రైతాంగానికి చేస్తున్న ద్రోహంపై నిలదీయాలని కేసీఆర్ చెప్పారు. పాలమూరు ఎత్తిపోతల పనులను కేసీఆర్ 80 శాతం పూర్తి చేశారు. థర్డ్ ప్యాకేజీలో చిన్న పని పూర్తి చేసి ఉంటే 60 టీఎంసీల వరకు రిజర్వాయర్లను నింపుకునే అవకాశం ఉండేది. కానీ ఆ పనులు చేయలేదు. ఈ నిర్లక్ష్యంపై నిలదీస్తాం. నిషేధితా జాబితాలో రైతుల భూములను, ప్రజల ఆస్తులను పెట్టి ఇబ్బంది పెడుతుంది. 22ఏపై గట్టిగా నిలదీయాలని నిర్ణయించాం. కరెంట్ కోతలు, రుణమాఫీ, రైతుబంధు, జీవో 97, సింగరేణి కుంభకోణాలు, ఉద్యోగులకు ఇచ్చే పీఆర్సీ, డీఏలతో పాటు ఈహెచ్‌ఎస్ ఫెయిల్యూర్‌పై ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీస్తాం. 30 లక్షల మంది విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకపోవడంతో వారి చదువులు ఆగిపోతున్నాయి.. భవిష్యత్ దెబ్బతింటుంది.. ఈ అంశంపై కూడా ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీయాలని నిర్ణయించామని హరీశ్‌రావు స్పష్టం చేశారు.

**చర్చల్లో పాల్గొనాల్సిన అవసరం కేసీఆర్‌కు లేదు**

రేవంత్ రెడ్డి.. బద్వె, పైల్వాన్.. బట్టలిప్పి కొడతాడు, తిర్రేసి కొడతాడు అని అసెంబ్లీలో మాట్లాడటం చూసి సభ్యసమాజం తలదించుకుంటోంది. అలాంటి గౌరవం లేని సభకు కేసీఆర్ వెళ్లాల్సిన అవసరం లేదు. ఈ చిల్లర ముఖ్యమంత్రితో చర్చల్లో పాల్గొనాల్సిన అవసరం కేసీఆర్‌కు లేదు అని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలం అందరం ఏకగ్రీవంగా నిర్ణయించాం. కేసీఆర్ తయారు చేసిన సైనికులం మేమున్నాం, మేమడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పే సత్తా రేవంత్ రెడ్డికి లేదు అని హరీశ్‌రావు అన్నారు.

# కేసీఆర్ రాజీనామా చెయ్యాలని కాంగ్రెస్ మహాధర్నా

ఎమ్మెల్యేగా నెలకు భారీగా జీతభత్యాలు పొందుతూ, ప్రజాధనాన్ని తీసుకుంటున్న కేసీఆర్ అసెంబ్లీ సమావేశాలకు రాకపోవడంపై కాంగ్రెస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటివరకు కేసీఆర్ జీతంగా, ఆయన భద్రతకు కోట్లాది రూపాయలు ఖర్చు చేసినట్టు లెక్క చెప్పారు. మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, జగ్గారెడ్డితో పాటు పలువురు ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలు ఈ మహాధర్నాలో పాల్గొన్నారు.



**విపక్షాల విష ప్రచారాలను తిప్పి కొట్టాలన్న మంత్రి శ్రీధర్ బాబు**

ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ, బీఆర్‌ఎస్ నాయకులు రోడ్లపైనే కాకుండా అసెంబ్లీకి వచ్చి సమాధానం చెప్పాలని సవాలు విసిరారు. పదేళ్లు సీఎంగా పనిచేసిన కేసీఆర్ తన అనుభవాన్ని సభలో పంచుకోవాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం జవాబుదారీతనంతో పని చేస్తోందని, విపక్షాలు సోషల్ మీడియాలో చేస్తున్న విష ప్రచారాలను తిప్పి కొట్టాలని పేర్కొన్నారు.

**అప్పుల రాష్ట్రాన్ని అప్పగించినా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామన్న మంత్రి**

వెయ్యి రోజుల పాలనలో తాము ఏం చేశామో అసెంబ్లీకి వస్తే వివరిస్తామన్నారు. పేదలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, రెండున్నరేళ్లలోనే రైతుల ఖాతాల్లోకి రూ.1.60 లక్షల కోట్లు జమ చేశామని గుర్తు చేశారు. రూ.8 లక్షల కోట్ల అప్పుతో కూడిన రాష్ట్రాన్ని స్వీకరించి కూడా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని చెప్పారు.ఆర్టీసీ బస్సుల్లో కాంగ్రెస్ కార్యకర్తలు మాత్రమే ప్రయాణం చేస్తున్నారా? చెప్పాలన్నారు.

**మరో పదేళ్లు రోడ్ల మీదనే ఉంటారన్న మంత్రి**

బీఆర్‌ఎస్ పాలనలో గ్రేడ్-1 నియామకాలు జరగలేదని విమర్శించారు.

బీఆర్‌ఎస్ నాయకుల వైఖరి మారకపోతే మరో పదేళ్లు కూడా రోడ్ల మీదనే ఉంటారు" అని శ్రీధర్ బాబు స్పష్టం చేశారు.

# సార్వభౌమత్వమే మా ప్రాధాన్యత

## కొత్త వరల్డ్ మ్యాప్ తీర్మానంపై భారత్ కీలక ప్రకటన

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 6 (సింగిడి)**

వివిధ దేశాలు, ఖండాల విస్తీర్ణాన్ని మరింత కచ్చితంగా తెలిపేలా ఐక్యరాజ్యసమితి ఆమోదించిన ప్రపంచ పటానికి సంబంధించి భారత్ కీలక స్పష్టీకరణ ఇచ్చింది. సరికొత్త ప్రపంచ పటంలో కేంద్రపాలిత ప్రాంతాలైన జమ్మూకశ్మీర్, లద్దాఖ్‌లను భారత అధికారిక మ్యాప్ ప్రకారమే చూపించాలని స్పష్టం చేసింది. దేశ భూభాగాన్ని తప్పుగా లేదా తప్పుదోవ పట్టించేలా చిత్రీకరిస్తే దాన్ని అంగీకరించబోమని విదేశాంగ శాఖ తేల్చిచెప్పింది. విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

'జమ్మూకశ్మీర్, లద్దాఖ్ సహా భారత సార్వభౌమ భూభాగాన్ని దేశ అధికార పటం ప్రకారమే చూపాల్సి ఉంటుంది. భారత భూభాగాన్ని తప్పుగా లేదా ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా చిత్రీకరించడం తమకు ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదు. భారత సార్వభౌమత్వం, ప్రాదేశిక సమగ్రతపై దేశ వైఖరి స్పష్టమైనది, స్థిరమైనది. ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడేది కాదు. ఖండాల భూభాగాలను వాటి సాపేక్ష పరిమాణాలకు అనుగుణంగా చూపించే ఈక్వల్-ఏరియా మ్యాప్ ప్రొజెక్షన్లను ప్రోత్సహించాలన్న ప్రాథమిక సూత్రానికే మద్దతు ఇచ్చాం. అంతేకానీ ఏదైనా ఒక నిర్దిష్ట ప్రపంచ పటం, ప్రొజెక్షన్ లేదా దేశాల సరిహద్దుల చిత్రణను ఆమోదించినట్లు కాదు. ఈ తీర్మానం ఏదైనా నిర్దిష్ట ప్రపంచ పటాన్ని అధికారికంగా స్వీకరించడం లేదా దానికి ధ్రువీకరణ ఇవ్వడం లేదు. అంతర్జాతీయ సరిహద్దులు, వివాదాస్పద ప్రాంతాలు, ప్రాంతాల పేర్లు వంటి రాజకీయ కార్టోగ్రఫీ అంశాలను కూడా ఇది పరిష్కరించదు' అని రణధీర్ జైస్వాల్ తెలిపారు.



**పటాల రూపకల్పనపై ప్రపంచవ్యాప్తంగా చర్చ**

ప్రపంచ పటాల్లో ఖండాల పరిమాణాలు, ఆకృతులను ఎలా చూపించాలన్న అంశంపై కొంతకాలంగా చర్చ జరుగుతోంది. సంప్రదాయ మర్కేటర్ ప్రొజెక్షన్‌లో భూమధ్యరేఖకు దూరంగా ఉన్న ప్రాంతాలు వాస్తవ పరిమాణం కంటే పెద్దవిగా కనిపిస్తాయన్న విమర్శలు ఉన్నాయి. దీనికి ప్రత్యామ్నాయంగా ఖండాల విస్తీర్ణాలను సాపేక్షంగా ఖచ్చితంగా చూపించే ఈక్వల్-ఏరియా ప్రొజెక్షన్లను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో తాజా యూఎన్ తీర్మానం తీసుకొచ్చారు. ఇది సెప్టెంబర్ 4న ఆమోదం పొందింది. కరెక్ట్ ది మ్యాప్ అనే నినాదంతో ఐరాస సర్వసభ్య సమావేశంలో ఆఫ్రికాలోని టోగో దేశం ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టింది. ఈ తీర్మానానికి భారత్‌తో సహా 164 దేశాలు మద్దతు తెలిపాయి. అమెరికా ఒక్కటే మాత్రం వ్యతిరేకంగా ఓటు వేసింది. ఎస్టోనియా, జార్జియా, లిథువేనియా, మోల్డోవా, సెర్బియా, ఉక్రెయిన్ ఓటింగ్‌కు దూరంగా ఉన్నాయి. అయితే ఈ కొత్త ప్రపంచ పటంలో భారత్, ఆఫ్రికాలు ప్రస్తుతానికి కంటే పెద్దగా కనిపించనున్నాయి. అమెరికా కొంత చిన్నదిగా కనిపించనుంది. అయితే దేశాల వాస్తవ సరిహద్దుల్లో ఎటువంటి మార్పులు ఉండవు. 16వ శతాబ్దంలో నౌకాయానం కోసం రూపొందించిన మర్కేట పటాన్ని ఐరాస తీర్మానం కాలం చెల్లినదిగా ప్రకటించింది. ప్రపంచ పటాన్ని మరింత కచ్చితంగా చూపే కొత్త పటాన్ని ప్రామాణికంగా ప్రకటిస్తూ ఐరాస ప్రవేశపెట్టిన తీర్మానం ఉద్దేశాన్ని మేం స్వాగతిస్తున్నాం అని ఐరాసలో భారత ప్రతినిధి రఘు పురీ పేర్కొన్నారు. తీర్మానంపై ఓటింగ్ సందర్భంగా భారత్ తన వైఖరిని స్పష్టం చేసింది. మరింత కచ్చితమైన, సమతుల్యమైన కార్టోగ్రఫీ విధానాలను ప్రోత్సహించాలన్న తీర్మానం ఉద్దేశాన్ని భారత్ స్వాగతిస్తోందని ఐరాసలోని భారత శాశ్వత మిషన్ ఫస్ట్ సెక్రటరీ రఘు పురీ తెలిపారు. ప్రపంచ భౌగోళిక స్వరూపాన్ని, వివిధ ప్రాంతాల పరిమాణాలను సమాజాలు ఎలా అర్థం చేసుకుంటాయన్న విషయంలో పటాలకు కీలక పాత్ర ఉందని పేర్కొన్నారు. అందువల్ల ప్రపంచ పటాల్లో భూభాగాల వాస్తవ విస్తీర్ణానికి తగిన ప్రాతినిధ్యం ఉండటం అవసరమని అభిప్రాయపడ్డారు. ఈ తీర్మానికి మద్దతు ఇవ్వడానికి ఈక్వల్ ఎర్త్ ప్రొజెక్షన్‌ను సమర్థించినట్లుగా భావించకూడదని తెలిపారు. తీర్మానాన్ని విస్తృతంగా ఈక్వల్ ఏరియా మ్యాప్ ప్రొజెక్షన్స్ వినియోగించడం, వాటిని పరిగణనలోకి తీసుకోవడాన్ని ప్రోత్సహించేదిగా మాత్రమే అర్థం చేసుకోవాలని పేర్కొన్నారు. నిర్దిష్టంగా ఈక్వల్ ఎర్త్ లేదా మరేదైనా ఒకే పట విధానాన్ని ఆమోదిస్తున్నట్లు భావించరాదని స్పష్టం చేశారు.




## ఎస్‌బీఐ
# భారీ విస్తరణ

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 6 (సింగిడి)**

దేశంలోనే అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకు అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (SBI) నిరుద్యోగులకు, బ్యాంకింగ్ ఉద్యోగార్థులకు తీపి కబురు అందించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో (FY27) సుమారు 12,000 మంది కొత్త ఉద్యోగులను నియమించుకోవడంతో పాటు, దేశవ్యాప్తంగా 250 కొత్త బ్రాంచ్‌లను ఏర్పాటు చేయనున్నట్లు ఎస్‌బీఐ ఛైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి వెల్లడించారు. ఈ నియామక ప్రక్రియలో భాగంగా క్లరికల్ (జూనియర్ అసోసియేట్), ఆఫీసర్ (ప్రొబేషనరీ ఆఫీసర్) కేడర్లలో దాదాపు 11,000 నుంచి 12,000 మందిని తీసుకోనున్నట్లు ఛైర్మన్ తెలిపారు. ఉద్యోగుల పదవీ విరమణలు, బ్యాంకు భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ భర్తీ ప్రక్రియ ఉంటుందని ఆయన వివరించారు. గతేడాది (2025-26) బ్యాంకు సుమారు 1,500 మంది ఐటీ స్పెషలిస్ట్ ఆఫీసర్లతో సహా మొత్తం 25,633 మందిని నియమించుకుంది. అయితే, ఈసారి ఐటీ రంగంలో అంత పెద్ద సంఖ్యలో నియామకాలు ఉండవని, జనరల్ బ్యాంకింగ్ సిబ్బందికే ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఒకవైపు డిజిటల్ బ్యాంకింగ్ సేవలు విస్తరిస్తున్నప్పటికీ, భౌతిక బ్రాంచ్‌ల ప్రాధాన్యాన్ని కూడా బ్యాంకు గుర్తిస్తోందని ఛైర్మన్ అన్నారు. ఇందులో భాగంగా, కొత్తగా అభివృద్ధి చెందుతున్న నివాస, వాణిజ్య ప్రాంతాల్లో ఏటా నికరంగా 200 నుంచి 250 కొత్త శాఖలను ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. సీఎన్‌బీసీ టీవీ18 కథనం ప్రకారం, కొన్ని పాత బ్రాంచ్‌లను హేతుబద్ధీకరించే ప్రక్రియ కూడా కొనసాగుతుందని తెలుస్తోంది. 2026 మార్చి నాటికి ఎస్‌బీఐలో మొత్తం ఉద్యోగుల సంఖ్య 2.45 లక్షలకు పైగా ఉంది. తాజా నియామకాలతో బ్యాంకు తన సేవలను మరింత విస్తృతం చేయాలని భావిస్తోంది.



## నగరవాసులకు
# శుభవార్త

ప్రజా రవాణాను సులభతరం చేసేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అంతకు ముందు ఆయన మెట్రో రైల్ ఎండీ సర్ఫరాజ్ అహ్మద్‌తో కలిసి ప్యారడైజ్ ఎలివేటెడ్ కారిడార్లను పరిశీలించారు. మెట్రో రైళ్లు, ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే ప్రయాణికుల సౌకర్యార్థం ఉమ్మడి పాస్‌లను జారీ చేయనున్నారు. ప్రయాణికుల అవసరాలకు తగినట్లుగా నెలవారీ, రోజువారీ పాస్‌ల జారీకి అధికారులు ఏర్పాట్లు చేయనున్నారు.

అయితే, రెండు ప్రజా రవాణా వ్యవస్థల మధ్య సమన్వయం కుదిర్చి, ప్రయాణ చార్జీలను ఎలాంటి గందరగోళం లేకుండా వీలైనంత త్వరగా ఖరారు చేయాలని సీఎస్ సంజయ్ జాజు స్పష్టం చేశారు. ఈ విధానం అమల్లోకి వస్తే ప్రయాణికులు వేర్వేరు టికెట్లు, పాస్‌లు తీసుకోవాల్సిన శ్రమ తప్పనుంది. దీనివల్ల సమయంతో పాటు ప్రయాణ ఖర్చులు కూడా ఆదా అవుతాయి. ఈ కంబైన్డ్ పాస్ విధానం అందుబాటులోకి వస్తే గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో రోజూ లక్షలాది మంది ప్రయాణించే ఉద్యోగులు, విద్యార్థులు, సాధారణ ప్రజలకు గొప్ప ఉపశమనం లభించనుంది. ఉమ్మడి చార్జీల ఖరారు ప్రక్రియ పూర్తయిన వెంటనే అధికారులు అధికారికంగా విధివిధానాలను వెల్లడించనున్నారు.

సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
సోమవారం
07-9-2026

## లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు అందజేత



**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 6 (సింగిడి):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో పలువురు పేద ప్రజలు గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతూ, చికిత్స ఖర్చులను సరిపడా ఆర్థిక స్తోమత లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో వారు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి ని సంప్రదించగా, ఆయన వెంటనే స్పందించి రాష్ట్ర మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు సహకారంతో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా శస్త్ర చికిత్స నిమిత్తం ఆర్థిక సహాయం మంజూరు చేయించారు. శనివారం బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ మంజూరి పత్రాలు (చెక్కులు) అందజేశారు. ముఖ్యమంత్రి సహాయనిధి పథకంలో లబ్ది పొందిన వారిలో అమ్ముల తాదూరి కి 29,500/-,పవన్ కుమార్ తాటిపాములకు 20వేలు, వంగ మల్లారెడ్డి కి 45వేలు,మొహమ్మద్ అమర్ ఖాన్ కు 60వేలు, శ్రీరాములు నిమ్మనగొంటి కి 60 వేల చెప్పురా మంజూరైన పత్రాలను కొలను హనుమంత రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా పేద ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందని, అనారోగ్యం బారిన పడిన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం పనిచేస్తుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట్ సర్కిల్ అధ్యక్షుడు కొలన్ రాజశేఖర్ రెడ్డి, మహాదేవపురం అధ్యక్షులు సిద్దన్గోళ్ల సంజీవ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు బాల్ రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సాధ్యం కాని హామీలతో కాంగ్రెస్ ప్రభుత్వం మోసం


- ఎమ్మెల్యే వివేకానంద్





**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 6 (సింగిడి):** కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల దగా పాలనను నిరసిస్తూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు వారం రోజులపాటు నిర్వహించనున్న నిరసన కార్యక్రమంలో భాగంగా 4వ రోజు బీఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ ఆధ్వర్యంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ యువత, విద్యార్థి విభాగం నాయకులు, విద్యార్థులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణలో అధికారమే లక్ష్యంగా అడ్డగోలు హామీలతో యూత్ డిక్లరేషన్ పేరిట తెలంగాణ యువతను మోసం చేస్తూ అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరంలోనే 2 లక్షల ఉద్యోగాలు అంటివి, జాబ్ క్యాలెండర్ అంటివి ఏమైంది...? 4000/- నిరుద్యోగ భృతి ఏమైందని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీశారు. కేసీఆర్ కు పదవులు ముఖ్యం కాదు, రాజీనామాలు కొత్తకాదు! తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం ఎన్నో సార్లు పదవులను తృణప్రాయంగా వదిలేసి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన తెలంగాణ జాతిపిత కేసీఆర్ అని పేర్కొన్నారు. 420 హామీలు, ఆరు గ్యారంటీలపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే, రాష్ట్ర రాజకీయాల్లో ఎన్నడూ లేని విధంగా ప్రతిపక్ష నేతను రాజీనామా చేయించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చిన వ్యక్తి రేవంత్ రెడ్డి మాత్రమే అని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పాటై మూడేళ్లు కావస్తున్నా ఉద్యోగ ప్రకటనలు విడుదల చేయకుండా నిరుద్యోగ యువతను మోసం చేస్తున్నారు. ఇప్పటి వరకు చెడ్డీ గ్యాంగులనే చూశాం, కానీ నేడు కుత్బుల్లాపూర్ లో కొబ్బరి కాయల దొంగలు తయారయ్యాయి. అర్హత లేకున్నా కొబ్బరి కాయలు కొడుతూ చిల్లర చేష్టలు చేస్తున్నారు. కాలంతో పోటీ పడుతూ నేటితరం యువత ఉందని, కాంగ్రెస్ కల్లబొల్లి మాటలను నమ్మి 2023 ఎన్నికల్లో ఒకసారి మోసపోయారని, మరోమారు మోసపోయే స్థితిలో లేరని, ఎన్నికలు ఎప్పుడు వచ్చినా కాంగ్రెస్ పార్టీకి కర్రుకాచి వాత పెట్టడం ఖాయమన్నారు. ఉద్యోగ ప్రకటనలకై నిరుద్యోగ యువత రోడ్లపైకి వచ్చి ధర్నాలు చేస్తుంటే ప్రభుత్వం వారి గోసను అర్థం చేసుకోకుండా పోలీసులను అడ్డం పెట్టుకొని నిరుద్యోగులను అరెస్టులు చేస్తూ దమనకాండను కొనసాగిస్తుండడం అమానుష చర్యగా అభివర్ణించారు. జెన్ – జీ"లను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి రాష్ట్ర యువత పుట్టగతులు లేకుండా వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెబుతారని వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజా ప్రతినిధులు, పార్టీ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, విద్యార్థి విభాగం నాయకులు, యువకులు, మహిళా నాయకురాలు, తదితరులు పాల్గొన్నారు.

## హోలియదాసరి సంఘ నూతన లెటర్ హెడ్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే



**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 6 (సింగిడి):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 132 – జీడిమెట్ల డివిజన్ భద్ర సాయి నగర్‌లో హోలియదాసరి వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నూతన మండల కమిటీ ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమానికి బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరై నూతనంగా రూపొందించిన లెటర్ ప్యాడ్ ను ఆవిష్కరించడంతో పాటు నూతనంగా ఎన్నుకోబడిన మండల కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు ఘనసాల నరసింహ, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బొల్లు రఘు, నూతన మండల కమిటీ నూతన అధ్యక్షులు తమటం యాకయ్య, ఉపాధ్యక్షులు ఆనగొంది శ్రీనివాస్ , ప్రధాన కార్యదర్శి తమటం యాకూబ్, సహాయ కార్యదర్శులు తమటం యేసు, ఆనగొంది బాలజి, తమటం శ్రీను, బిట్ర ఆంజనేయులు, కోశాధికారి రావుల గోపీ, సహాయ కోశాధికారులు తౌటం సమ్మయ్య, ఆకుల శ్రీను, ప్రచార కార్యదర్శులు ఆకుల నరసింహ, ఉప్పు అప్పారావు, కమిటీ సభ్యులు ఆకుల శ్రీను, దేవనమైన గణపతి, రావుల వెంకటేష్ (కారేపల్లి),ఆకుల బాలాజీ , ఆనగొంది శివ, బిట్ర గణపతి, రావుల వంశీ, తమటం విజయ్, మల్లెమైన రాజు, ఆనగొంది తిరుపతి, రావుల అంజి, సంఘ రాష్ట్ర నాయకత్వం, జిల్లా నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత

**ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**

**ఘనంగా శివాలయ శంకుస్థాపన మహోత్సవం**



**రామచంద్రపురం, సెప్టెంబర్ 6 (సింగిడి):** సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గం పరిధిలోని రామచంద్రపురం మండల్ పరిధిలోని భారతీనగర్ డివిజన్ పరిధిలోని మ్యాక్ సొసైటీ కాలనీలో శ్రీ కనకదుర్గ, శ్రీ పంచముఖి ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో శివాలయ నిర్మాణ శంకుస్థాపన మహోత్సవం భక్తిశ్రద్ధలతో వైభవంగా జరిగింది. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పటాన్‌చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి శివాలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలని, భక్తిభావంతోనే సమాజంలో శాంతి, సౌభాగ్యాలు వెల్లివిరుస్తాయని పేర్కొన్నారు. నియోజకవర్గంలో అన్ని ప్రాంతాల అభివృద్ధికి ఎంతటి ప్రాధాన్యతనిస్తున్నామో, ఆలయాల పునర్నిర్మాణానికి, ఆధ్యాత్మిక కేంద్రాల విస్తరణకు కూడా అంతే ప్రాధాన్యతనిస్తున్నామని తెలిపారు. మ్యాక్ సొసైటీ కాలనీవాసులు ఏకతాటిపైకి వచ్చి శివాలయాన్ని నిర్మించడం ఎంతో అభినందనీయమని, నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తికావాలని ఆకాంక్షించారు. అనంతరం పటాన్‌చెరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ వెన్నవరం ఆదర్శ్ రెడ్డి మాట్లాడుతూ, ఆలయాలు కేవలం పూజా స్థలాలు మాత్రమే కాకుండా సమాజంలో ఐక్యతకు, ధర్మ పరిరక్షణకు కేంద్రాలుగా నిలుస్తాయని అన్నారు. మ్యాక్ సొసైటీ కాలనీలో శివాలయ నిర్మాణం త్వరితగతిన పూర్తయి భక్తులకు అందుబాటులోకి రావాలని ఆకాంక్షిస్తూ, నిర్మాణ పనులకు తమ వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని హామీ ఇచ్చారు. ఈ పూజా కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి కూడా పాల్గొని స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో రామచంద్రాపురం మాజీ కార్పొరేటర్ తొంట అంజయ్య, సీనియర్ నాయకులు కుమార్ గౌడ్, జగన్నాథ్ రెడ్డి, పరమేష్ యాదవ్, భాస్కర్ ముదిరాజ్, పాటి సత్యనారాయణ, ఐలేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఆలయ కమిటీ అధ్యక్షుడు వెంకట్ రెడ్డి, ప్రతినిధులు నందగోపాల్, సత్యనారాయణ, యాదగిరి, సుధాకర్, సంతోష్, విజయ్, నరసింహ, శ్రీధర్, సాయి, భాను తదితరులు కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. మ్యాక్ సొసైటీ కాలనీ వాసులు, మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పూజా కార్యక్రమాల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.



## అప్పాజీపల్లిలో ఘనంగా అన్నదాన కార్యక్రమం



**కొల్చారం, సెప్టెంబర్ 6 (సింగిడి):** మెదక్ జిల్లా కొల్చారం మండలం అప్పాజీపల్లి గ్రామంలో ప్రతి ఏటా నిర్వహించే శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారి అన్నదాన కార్యక్రమం ఈ ఏడాది కూడా భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగింది. శ్రావణమాసం చివరి సందర్భంగా శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారి సన్నిధిలో నిర్వహించిన ఈ అన్నదాన కార్యక్రమానికి గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు గ్రామంలోని దాతలు తమకు తోచిన విధంగా విరాళాలు అందించారు. ఒకరు బియ్యం, మరొకరు పూజా సామగ్రి, ఇంకొకరు కూరగాయలు, మరొకరు ప్లేట్లు, ఇలా ప్రతి ఇంటి నుంచి తమవంతు సహకారం అందిస్తూ అన్నదాన కార్యక్రమానికి అండగా నిలిచారు. ఒక్కరి కోసం అందరూ.. అందరి కోసం ఒక్కరు' అనే స్ఫూర్తితో గ్రామ ప్రజలంతా ఐక్యంగా ముందుకు వచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారి ఆశీస్సులు గ్రామ ప్రజలందరిపై ఉండాలని, ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని భక్తులు స్వామివారిని ప్రార్థించారు. గ్రామ ప్రజల ఐక్యతకు, భక్తి భావానికి ప్రతీకగా నిలిచిన ఈ అన్నదాన కార్యక్రమం భక్తులకు ఆధ్యాత్మిక ఆనందంతో పాటు, గ్రామంలోని ఐక్యతను చాటిచెప్పింది. ఈ కార్యక్రమంలో నాయిని వెంకట్ గౌడ్( గజిని )సర్పంచ్, ఉప సర్పంచ్ చలం నర్సింలు, ముదిరాజ్ సంఘం అధ్యక్షులు చింతల భాగయ్య, సదాల తిరుపతి, వార్డ్ మెంబర్లు నర్సింలు, రామానుజం, మానేపల్లి సావిత్రి, కదూరి సుశీల, పితిరి రవి, శ్రీహరి, చింతల కిషన్, భజన భక్తులు నేరాల శాఖలు, పీతిరి నర్సింలు అప్పాజీపల్లి గ్రామ యువకులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## పోతిరెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అవగాహన సదస్సు



**సంగారెడ్డి బ్యూరో , సెప్టెంబర్ 6 (సింగిడి):** ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని సంగారెడ్డి జిల్లా పోతిరెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో న్యాయ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సంగారెడ్డి జూనియర్ సివిల్ జడ్జి కమ్ స్పెషల్ మొబైల్ కోర్టు న్యాయమూర్తి శ్రీమతి టి. కలిందిండి దుర్గారాణి గారు హాజరై విద్యార్థులు, ఉపాధ్యాయులకు న్యాయపరమైన అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసి, విద్యార్థుల జీవితాల్లో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. విద్యార్థులు తమ హక్కులు, బాధ్యతలు, రాజ్యాంగ విలువలు మరియు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ముఖ్యంగా బాలల హక్కులు, బాల్య వివాహాల నిషేధం, బాలలపై లైంగిక నేరాల నుంచి రక్షణ చట్టం, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, మహిళలు మరియు బాలికల రక్షణకు సంబంధించిన చట్టాలపై వివరించారు. ప్రస్తుత కాలంలో పెరుగుతున్న సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, సోషల్ మీడియా దుర్వినియోగం, వ్యక్తిగత సమాచార భద్రత వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. తెలియని వ్యక్తులతో ఆన్‌లైన్‌లో వ్యక్తిగత వివరాలు పంచుకోకూడదని, అనుమానాస్పద లింకులను క్లిక్ చేయకూడదని, సైబర్ నేరాలకు గురైనప్పుడు వెంటనే సంబంధిత అధికారులను సంప్రదించాలని సూచించారు. అదేవిధంగా విద్యార్థులు తమకు ఎదురయ్యే సమస్యలను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని, ఎటువంటి భయాందోళనలకు గురికావద్దని తెలిపారు. చట్టం ప్రతి ఒక్కరికీ సమాన రక్షణ కల్పిస్తుందని, అవసరమైన వారికి ఉచిత న్యాయ సేవలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. జాతీయ న్యాయ సేవల సంస్థ, తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవల సంస్థ , జిల్లా న్యాయ సేవల సంస్థ ద్వారా అందించే ఉచిత న్యాయ సహాయం, సలహాలు మరియు ఇతర న్యాయ సేవలను ప్రజలు, ముఖ్యంగా అర్హులైన విద్యార్థులు మరియు వారి కుటుంబ సభ్యులు వినియోగించుకోవాలని సూచించారు. విద్యార్థులు క్రమశిక్షణ, నైతిక విలువలు, సామాజిక బాధ్యతతో ముందుకు సాగాలని, చదువుతో పాటు సమాజం పట్ల బాధ్యతను కూడా పెంపొందించుకోవాలని న్యాయమూర్తి సూచించారు. ప్రతి విద్యార్థి చట్టాలను తెలుసుకొని, ఇతరుల హక్కులను గౌరవిస్తూ మంచి పౌరుడిగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయుల సేవలను అభినందిస్తూ, విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల కృషి ప్రశంసనీయమని పేర్కొన్నారు. విద్యార్థులకు న్యాయ అవగాహన కల్పించడంలో పాఠశాలలు, ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషించాలని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. న్యాయ అవగాహన కార్యక్రమం ద్వారా విద్యార్థులకు చట్టపరమైన అంశాలపై విలువైన సమాచారం అందిందని పాఠశాల సిబ్బంది తెలిపారు.

# 30 ఏళ్ల బైపాస్ చరిత్రకు నేనే సాక్షి... అభివృద్ధికి నేనే పునాది

- 1995లో రూ.80 లక్షలతో బీటీ రోడ్డు...
- నేడు రూ.18 కోట్లతో విస్తరణ పనులు
- సంగారెడ్డి ఊరి బిడ్డగా అభివృద్ధి బాధ్యత నాపై ఉంది
- రోడ్డు పనులపై అనవసర రాజకీయాలు వద్దు
- మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి



**సంగారెడ్డి ప్రతినిధి సెప్టెంబర్ 6 (సింగిడి):** సంగారెడ్డి పట్టణ అభివృద్ధి, బైపాస్ రోడ్డు నిర్మాణం వెనుక తన సుదీర్ఘకృషి ఉందని మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి పేర్కొన్నారు. 1995లో సంగారెడ్డి ప్రజలు తనను నేరుగా మున్సిపల్ చైర్మన్‌గా ఎన్నుకున్న సమయంలో, అప్పటి పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని రూ. 80 లక్షలతో బైపాస్ బీటీ రోడ్డును నిర్మించామని తెలిపారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో రూ. 18 కోట్ల నిధులు తీసుకువచ్చి బైపాస్ రహదారి విస్తరణ పనులు చేపడుతున్నట్లు చెప్పారు.

**జీతాలు ఇవ్వలేని స్థితిలో మున్సిపాలిటీ**

1995లో తాను మున్సిపల్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన సమయంలో సంగారెడ్డి మున్సిపాలిటీ ఆర్థికంగా తీవ్ర ఇబ్బందుల్లో ఉండేదని జగ్గారెడ్డి గుర్తు చేసుకున్నారు. ఉద్యోగుల జీతాలకు కూడా నిధులు లేక ఆరు నుంచి ఏడు నెలలకు ఒకసారి మాత్రమే జీతాలు అందే పరిస్థితి ఉండేదన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాల కింద వచ్చే నిధులతోనే అభివృద్ధి పనులు చేపట్టాల్సి వచ్చేదని తెలిపారు. అలాంటి పరిస్థితుల్లోనూ పట్టణ భవిష్యత్ అవసరాలను ముందుగానే గుర్తించి బైపాస్ రహదారి అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చామని చెప్పారు. కోటి రూపాయల గ్రాంటు... రూ. 80 లక్షలు బైపాస్‌కు ఆ సమయంలో మున్సిపాలిటీకి కోటి రూపాయల గ్రాంటు రావడంతో రూ. 20 లక్షలను కౌన్సిలర్ల అభివృద్ధి పనులకు కేటాయించి, మిగిలిన రూ. 80 లక్షలను బైపాస్ రోడ్డుకు ఖర్చు చేయాలని నిర్ణయించామని తెలిపారు. ఐబీ గెస్ట్ హౌస్ నుంచి బసవేశ్వర విగ్రహం వరకు ఉన్న మార్గం ఆ రోజుల్లో పూర్తిగా అభివృద్ధి చెందలేదని చెప్పారు. వర్షాకాలంలో వాహనదారులు జారి ప్రమాదాలకు గురయ్యేవారని, రహదారి సౌకర్యం లేక స్థానికులు ఇబ్బందులు పడేవారని తెలిపారు. అధికారులతో చర్చించి, కౌన్సిలర్లందరినీ ఒప్పించి బైపాస్‌కు బీటీ రోడ్డు, అవసరమైన ఫార్మేషన్ పనులు పూర్తి చేశామని పేర్కొన్నారు.

**రోడ్డు వల్లే కొత్త కాలనీల అభివృద్ధి**

తాను వేయించిన బైపాస్ రహదారి కారణంగానే ఆ ప్రాంతంలో కొత్త కాలనీలు వేగంగా అభివృద్ధి చెందాయని జగ్గారెడ్డి తెలిపారు. రహదారి సౌకర్యం రావడంతో నివాస ప్రాంతాలు పెరిగాయని, భూముల విలువలు కూడా పెరిగాయని పేర్కొన్నారు. "30 సంవత్సరాల క్రితం నేను వేసిన రహదారి నేటికీ సంగారెడ్డి అభివృద్ధి చరిత్రలో ఒక భాగం. ఆ రోడ్డు వల్లే బైపాస్ ప్రాంతం విస్తరించింది" అని అన్నారు.

**సదాశివపేటలోనూ అభివృద్ధి పనులు**

సంగారెడ్డి మాత్రమే కాకుండా ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో సదాశివపేట పట్టణంలో కూడా అభివృద్ధి పనులు చేపట్టానని జగ్గారెడ్డి తెలిపారు. అప్పట్లో కందకం ప్రాంతాన్ని సరైన రహదారి సౌకర్యంతో అభివృద్ధి చేశామని చెప్పారు. సదాశివపేటకు చెందిన వ్యక్తిని కాకపోయినా అక్కడి పేదల సంక్షేమం కోసం పనిచేశానని, సిద్ధాపూర్ ప్రాంతంలో సుమారు ఐదు వేల మంది పేదలకు ఇళ్ల స్థలాలు ఇప్పించేందుకు కృషి చేశామని పేర్కొన్నారు. అనంతరం రాజకీయ పరిస్థితుల కారణంగా ఆ ప్రాంత ప్రజలకు ఇబ్బందులు ఎదురయ్యాయని ఆరోపించారు.

**సీఎం రేవంత్ రెడ్డి అనుమతితో రూ. 18 కోట్ల నిధులు**

బైపాస్ రోడ్డు విస్తరణ అవసరాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన వెంటనే సానుకూలంగా స్పందించారని జగ్గారెడ్డి తెలిపారు. రూ. 18 కోట్ల నిధులతో బైపాస్ రహదారి విస్తరణ, అభివృద్ధి పనులు చేపట్టామని చెప్పారు. పనులు ప్రారంభమైన తర్వాత కొందరు అనవసరంగా విమర్శలు చేస్తున్నారని అన్నారు. "రోడ్డు వేయడం అంటే కేవలం మట్టి పోసి బ్లాక్‌టాప్ వేయడం కాదు. చెట్లు, విద్యుత్ లైన్లు, వ్యాపార సంస్థలు, ప్రజల రాకపోకలు అన్నింటినీ సమన్వయం చేసుకుంటూ పనులు చేయాలి" అని తెలిపారు.

**కొంత జాప్యం సహజం**

రోడ్డు వెడల్పు, సాంకేతిక అంశాలు, విద్యుత్ లైన్ల మార్పు, చెట్ల సంరక్షణ వంటి కారణాలతో కొంత జాప్యం జరిగే అవకాశం ఉందన్నారు. పనులు ఆలస్యం అవుతున్నాయంటూ కొందరు గుంతల వద్ద ఫోటోలు దిగుతూ ప్రతికూల ప్రచారం చేయడం సరికాదన్నారు. రోడ్డు పనుల నాణ్యతపై కొందరు విజిలెన్స్‌కు ఫిర్యాదు చేశారని, దీనిపై జిల్లా కలెక్టర్‌తో కూడా చర్చించినట్లు తెలిపారు.

**అభివృద్ధిపై రాజకీయాలు తగవు**

సంగారెడ్డి అభివృద్ధి పనులను రాజకీయ కోణంలో చూడవద్దని జగ్గారెడ్డి కోరారు. ప్రజల సౌకర్యం కోసం జరుగుతున్న పనులకు సహకరించాలన్నారు. "జగ్గారెడ్డి వేసిన రోడ్లపైనే అన్ని పార్టీల వారు ప్రయాణిస్తున్నారు. అదే రోడ్లపై నడుస్తూ మమ్మల్ని విమర్శించడం విడ్డూరంగా ఉంది" అని వ్యాఖ్యానించారు.

**ఎన్నికల కోసం కాదు... సంగారెడ్డి కోసం**

రూ. 18 కోట్లతో చేపడుతున్న బైపాస్ రోడ్డు అభివృద్ధి పనులు ఎన్నికల కోసం కాదని, సంగారెడ్డి పట్టణ భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని చేస్తున్నామని జగ్గారెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనుల కోసం నిధులు తీసుకురావడం తన బాధ్యతగా భావిస్తున్నానన్నారు. "నేను ఎమ్మెల్యేగా ఉన్నా లేకపోయినా సంగారెడ్డి నా ఊరు. ఈ ఊరి అభివృద్ధి నా బాధ్యత. సంగారెడ్డి ఎలా అభివృద్ధి చెందాలో నాకు తెలుసు. ప్రజల కోసం పనిచేయడం ఆపను" అని జగ్గారెడ్డి స్పష్టం చేశారు. పనిచేసేవారిపై విమర్శలు రావడం సహజమేనని, కానీ విమర్శలతో అభివృద్ధి పనులను అడ్డుకోవద్దని ఆయన సూచించారు. సంగారెడ్డి అభివృద్ధి కోసం అందరూ సానుకూల దృక్పథంతో ముందుకు రావాలని కోరారు.

## సర్ ప్రక్రియపై స్పెషల్ క్యాంపియన్

**తహసీల్దార్ బుచ్చయ్య**



**వికారాబాద్ ప్రతినిధి, సెప్టెంబర్ 6 (సింగిడి):** సర్ ప్రక్రియ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 5,6 తేదీల్లో నిర్దేశించిన గ్రామాల్లో నోటీసులు పొందిన వారికోసం స్పెషల్ క్యాంపిఎన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నవాబు పేట తహసీల్దార్ బుచ్చయ్య తెలిపారు. నోటీసులు పొందిన వారు నిర్దేశించిన గడువులో స్పందించని వారు స్పెషల్ క్యాంపిఎన్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఓటరు వివరాల్లో మార్పులు, మృతి చెందిన వారి ఓట్లను తొలగించడం లాంటి చర్యలు స్పెషల్ క్యాంపియన్ కార్యక్రమంలో నిర్వహించాలని ఆయన అన్నారు. అదేవిధంగా కొత్తగా ఓటర్లుగా నమోదు చేసుకోవాలనుకున్న అర్హులైన వారు కూడా ఓటరుగా నమోదు చేసుకోవచ్చని ఆయన తెలిపారు. అదేవిధంగా 12,13 తేదీల్లో కూడా స్పెషల్ క్యాంపియఎన్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. మండల ప్రజలు ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## గురువుల స్థానం దైవంతో సమానం

**బూరుగుపల్లి సర్పంచ్ వరప్రసాద్ రెడ్డి**



**వికారాబాద్ ప్రతినిధి, సెప్టెంబర్ 6 (సింగిడి):** జిల్లా వ్యాప్తంగా సర్వేపల్లి రాధకృష్ణన్ పుట్టినరోజు సందర్భంగా ప్రతి ఏటా నిర్వహించే గురుపుజోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా పలువురు గురువు స్థానాన్ని కొనియాడారు. రాధకృష్ణన్ చిత్రపటానికి పూలమాలు వేసి నివాళ్ళు అర్పించారు. మోమిన్ పేట మండలం బూర్గుపల్లిలో సర్పంచ్ పట్లోళ్ల వరప్రసాద్ రెడ్డి ఉపాధ్యాయులను సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని, ఆయన అన్నారు. మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలు మేకవనం పల్లి ప్రైవేటు విద్యాలయాల్లో ఉపాధ్యాయ దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గౌరీ శంకర్ పంచాయతీ కార్యదర్శి స్వప్న, వీరేశం, మహేందర్ రమేష్, ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దాలి

**శాసన మండలి సభ్యులు అంజి రెడ్డి**

**జ్ఞానంతో పాటు విలువలు, విజ్ఞానం, సామజిక బాధ్యత నేర్పాలి**

**మత్తు పదార్థాలు, సెల్‌ఫోన్ వ్యసనాలకు దూరంగా ఉండేలా అవగాహన**




**సంగారెడ్డి బ్యూరో, సెప్టెంబర్ 6 (సింగిడి):** జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లాలో విద్యారంగానికి విశిష్ట సేవలందించిన 100 మంది ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమాన్ని కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించారు . ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అంజి రెడ్డి ఏంఎల్‌సి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉత్తమ ఉపాధ్యాయులను, ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలతో సత్కరించారు. ఈ సందర్భముగా అంజిరెడ్డి శాసన మండలి సభ్యులు మాట్లాడుతూ.. ఉపాధ్యాయులను సన్మానించడం ద్వారా వారి సేవలను గౌరవించడమే కాకుండా, ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులు , సమాజంలోని ప్రతి ఒక్కరికీ అది మార్గదర్శకంగా నిలుస్తుందని అన్నారు. ఉపాధ్యాయులు అంకితభావంతో అందిస్తున్న సేవలను గుర్తించి సత్కరించడం వారిలో మరింత స్ఫూర్తిని నింపుతుందని పేర్కొన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణన్, అబ్దుల్ కలాం, మహాత్మా జ్యోతి రావు పూలే దంపతుల బోధనలు స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని, విద్యార్థులకు పాఠ్యాంశాలతో పాటు సమాజంలో ఎదురయ్యే సవాళ్లపై అవగాహన కల్పిస్తూ వారిని మంచి పౌరులుగా తీర్చిదిద్దాలని అంజిరెడ్డి అన్నారు. తల్లిదండ్రుల తరువాత విద్యార్థులపై ప్రభావం చూపేది ఉపాధ్యాయులేనని స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న టీచర్లు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, ప్రతి విద్యార్థి మనో వికాసం, సమాజ విలువలు, కట్టుబాట్లు, క్రమశిక్షణ అంశాలపై బోధించాలని సూచించారు. విద్యార్థుల్లో పోటీతత్వం పెంచాలని, అన్ని రంగాల్లో తీర్చిదిద్దాలని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివి ఎందరో ఉన్నత స్థానాలకు ఎదిగారని తెలిపారు. ప్రస్తుత కాలంలో విద్యార్థులు మత్తు పదార్థాల బారిన పడకుండా పాఠశాల స్థాయి నుంచే నిరంతరం అవగాహన కల్పించాలి . మత్తు పదార్థాలు ఆరోగ్యం, చదువు, కుటుంబం, భవిష్యత్తుపై చూపే ప్రతికూల ప్రభావాలను వారికి అర్థమయ్యేలా వివరించాలి. విద్యార్థుల ప్రవర్తనలో వచ్చే మార్పులను ఉపాధ్యాయులు గుర్తించి తల్లిదండ్రులతో సమన్వయం చేసుకోవాలని అన్నారు. సెల్‌ఫోన్ వినియోగంపై అధిక వినియోగం విద్యార్థుల ఏకాగ్రతను, చదువును దెబ్బతీయకుండా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలి. సెల్‌ఫోన్‌ను విద్యా ప్రయోజనాలకు, జ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు మాత్రమే సమర్థవంతంగా ఉపయోగించుకునేలా విద్యార్థులకు అవగాహన కల్పించాలని అన్నారు . విద్యార్థులు తమ విలువైన సమయాన్ని సెల్‌ఫోన్, సామాజిక మాధ్యమాల్లో వృథా చేయకుండా చదువు, క్రీడలు, పుస్తక పఠనం పై దృష్టికేంద్రీకరించాలని. సెల్‌ఫోన్‌కు బానిస కాకూడదనే విషయాన్ని విద్యార్థులకు ఉపాధ్యాయులు బోధించాలి. విద్యార్థులను అన్ని రంగాల్లో తీర్చిదిద్దాలని పిలుపు నిచ్చారు. ప్రపంచం వేగంగా మారుతున్న నేపథ్యంలో విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ , డిజిటల్ టెక్నాలజీ, రోబోటిక్స్, శాస్త్ర సాంకేతిక రంగాల్లో వస్తున్న మార్పులపై అవగాహన కల్పించాలి. భవిష్యత్తులో అందుబాటులోకి వచ్చే అవకాశాలను అందిపుచ్చుకునేందుకు అవసరమైన నైపుణ్యాలను విద్యార్థులు ఇప్పటి నుంచే అభివృద్ధి చేసుకునేలా ఉపాధ్యాయులు మార్గనిర్దేశం చేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ ) సంగీత, నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమా హారతి , జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ జి. అంజయ్య, సంగారెడ్డి మున్సిపల్ చైర్ పర్సన్ కూన వనిత, జిల్లా విద్యాధికారి రోహిణి , ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభాతనవ
సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
సోమవారం
7-9-2026

# ఎడిటోరియల్

Editorial

## స్వచ్ఛమైన గాలి కోసం అంతర్జాతీయ సమన్వయం

మనం ఈ గ్రహం మీద నివసిస్తున్నాము, భూమాత అందించిన గాలిని పీలుస్తున్నాము, నీటిని తాగుతున్నాము, నేలపై నడుస్తున్నాం. నూతన సాంకేతికతల ఆవిర్భావం, అనాలోచిత పారిశ్రామిక అభివృద్ధి, కృత్రిమ మేధస్సు గల మానవుల నూతన జీవనశైలి కలిసి పర్యావరణంలోని ఈ మూడు అంశాలైన నేల, గాలి, నీటి నాణ్యతపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతున్నాయి. దీని ఫలితంగా ప్రపంచ జనాభాలో మరణాలు, వ్యాధులు గణనీయంగా పెరుగుతున్నాయి. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని, ఈ సమస్యలను పరిష్కరించడానికి ఐక్యరాజ్యసమితి సర్వశక్తులు ఒడ్డుతోంది. అన్ని స్థాయిలలో ప్రజలలో అవగాహన పెంచడం యొక్క ప్రాముఖ్యతను, తక్షణ అవసరాన్ని నొక్కి చెప్పడానికి, అలాగే గాలి నాణ్యతను మెరుగుపరిచే చర్యలను ప్రోత్సహిస్తూ సులభతరం చేయడానికి, ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ 2019లో తీర్మానం ప్రకారం, ప్రతి ఏటా సెప్టెంబర్ 7వ తేదీని "నీలి ఆకాశం కోసం స్వచ్ఛమైన గాలి అంతర్జాతీయ దినోత్సవం (ఇంటర్నేషనల్ డే ఆఫ్ క్లీన్ ఏయిర్ ఫర్ బ్లూ స్కైస్)"గా ప్రకటించి 2020 నుంచి పాటిస్తున్నారు. వాయు కాలుష్యం, వాతావరణ మార్పులు ప్రజలకు, ఆర్థిక వ్యవస్థలకు, భూ గ్రహానికి ముప్పుగా కొనసాగుతున్నందున, ఈ సంవత్సరం స్వచ్ఛమైన గాలి దినోత్సవం వేదికగా స్వచ్ఛమైన గాలిని, ఆరోగ్యకరమైన జీవితాలను, ఉమ్మడి శ్రేయస్సును అందించే చర్యలకు పిలుపునిస్తోంది. సమన్వయంతో కూడిన ప్రయత్నాలు ప్రజారోగ్యాన్ని మెరుగుపరచగలవని, ఆర్థిక వ్యవస్థలను బలోపేతం చేయగలవని, సుస్థిర పురోగతిని వేగవంతం చేయగలవని వివిధ నివేదికలు సూచిస్తున్నాయి. ఈ వార్షిక కార్యక్రమం ద్వారా ప్రపంచవ్యాప్తంగా అవగాహన కల్పించడం, పర్యావరణ పరిరక్షణ అవగాహన పెంచడం, అలాగే ప్రభుత్వాలు, నగరాలు, వ్యాపారాలు, శాస్త్రవేత్తలు, పౌర సమాజం కలిసి ఉత్తమ పద్ధతుల అభివృద్ధి, మార్పిడికి ప్రాధాన్యతనిస్తూ గాలి నాణ్యతలో సానుకూల మార్పులను తీసుకురావడమే లక్ష్యంగా పెట్టుకుంది.


స్వచ్ఛమైన గాలి కోసం ఆరోగ్యకరమైన ఎంపికలు : ప్రజలతో పాటు భూగ్రహం కోసం కలిసికట్టుగా పనిచేయడం:


2026 అంతర్జాతీయ నీలాకాశం కోసం స్వచ్ఛమైన గాలి దినోత్సవం యొక్క ఇతివృత్తం " స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన ఎంపికలు: ప్రజలతో పాటు భూగ్రహం కోసం కలిసికట్టుగా పనిచేయడం" అనే ఇతివృత్తంతో బహుళ ప్రచారం నిర్వహిస్తూ నగర ప్రణాళిక, సుస్థిర రవాణాలో పెట్టుబడి, స్వచ్ఛమైన పారిశ్రామిక ప్రక్రియలు, కుటుంబాల్లో ఇంధన ఎంపికలు వంటి వ్యక్తిగత – సామూహిక చర్యలు గాలి నాణ్యత ఫలితాన్ని సానుకూలంగా ప్రభావితం చేస్తాయనేది దీని ముఖ్య ఉద్దేశం. ప్రస్తుత తరాలతో పాటు భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలిని, నీలాకాశాన్ని అందించడానికి శాస్త్ర – ఆధారిత విధానాలను స్థాపించడానికి, వివిధ రంగాలు సరిహద్దులకు అతీతంగా కలిసి పనిచేయాలనే సందేశాన్ని ఈ ఇతివృత్తం ఇస్తుంది. వ్యక్తులు పాఠశాల స్థాయి నుండి పెద్ద సామూహిక స్థాయిల వరకు, సోషల్ మీడియా అవగాహన ద్వారా యువతతో సంభాషించడం ద్వారా స్వచ్ఛమైన గాలి కోసం ప్రచారం చేయవచ్చు. స్వచ్ఛమైన గాలి ప్రతిజ్ఞలు, సోషల్ మీడియా హ్యాష్‌ట్యాగ్‌లు, వాహన రహిత దినాలు పాటించడం, మొక్కల పెంపకం కార్యక్రమాలు, స్వచ్ఛమైన సుస్థిర సాంకేతికతలు, ప్రయాణ పరిష్కారాలు, విధాన కట్టుబాట్లను ప్రోత్సహించడానికి సమాజం, పరిశ్రమ, వ్యాపారాలు వంటి భాగస్వాములందరినీ ఏకతాటిపైకి తీసుకురావడానికి సమన్వయ ప్రయత్నాలు అవసరం.

**డాక్టర్ మధుసూదన్ రెడ్డి బుర్ర**
**9949700037**

# తెలంగాణ రైతుల జీవన రేఖ... శ్రీరామ్ సాగర్ ప్రాజెక్ట్.

నీటిపారుదల వ్యవసాయ రంగానికి వెన్నెముక. నీటి పారుదల వల్ల రైతులకు ఉత్పత్తి ఆదాయపరమైన హామీ లభిస్తుంది .నీటిపారుదల అంటే కాలువల ద్వారా గాని బావుల ద్వారా గాని ప్రవాహాల ద్వారా గాని నీటిని చిమ్మే యంత్రాల ద్వారా గాని వ్యవసాయ పంటల పెరుగుదల సక్రమంగా ఉండే విధంగా పంట నేలలకు నీటిని అందించడం. ఇది వివిధ దశలలో పంట





మొక్కల పెరుగుదలకు తగు మోతాదులో నీటిని అందించి వ్యవసాయ ఉత్పాదకతను పెంచడంలో ఉపయోగించే ముఖ్యమైన ఉత్పాదక విధాన సాధనం. అంతేకాకుండా వ్యవసాయ రంగానికి అమూల్యమైన సేవలు అందించడమే గాక సంబంధిత ప్రాంతంలో సామాజిక ఆర్థిక అభివృద్ధికి కూడా ఎంతగానో తోడ్పడుతుంది.

తెలంగాణలో నీటిపారుదల: తెలంగాణ రాష్ట్రం నీటిపారుదల అవసరాలను నైరుతి రుతుపవనాల వర్షపాతంతో రాష్ట్రంలో ప్రవహిస్తున్న శాశ్వత నదులు అయిన గోదావరి కృష్ణా నదులు నీటి అవసరాలను తీరుస్తున్నాయి. నీటిపారుదల విషయంలో తెలంగాణలో సాగునీటి అభివృద్ధి ఎక్కువగా గోదావరి కృష్ణ నదుల మీద ఆధారపడి ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వం రెండు నదుల జలాలను వ్యవసాయం తాగునీటి పారిశ్రామిక అభివృద్ధికి వినియోగించుకుంటుంది. రాష్ట్రంలోని 125 లక్షల ఎకరాలకు నీటిపారుదల సౌకర్యం కల్పించే ఉద్దేశంతో ప్రభుత్వం సమగ్ర నీటిపారుదల వ్యూహాన్ని అమలుపరుస్తుంది. గత మూడు దశాబ్దాల కాలంలో నీటిపారుదల అభివృద్ధి కారణంగా వ్యవసాయం విస్తరించిన ప్రాంతాలలో ఆర్థిక వ్యవస్థ ఎంతగానో మెరుగుపడింది. నీటిపారుదల ప్రాముఖ్యతను దృష్టిలో పెట్టుకొని నీటిపారుదల వసతులను మెరుగుపరుస్తూ గ్రామీణ ఆర్థిక అభివృద్ధికి రాష్ట్రంలో వరసగా వచ్చిన ప్రభుత్వాలు సౌకర్యాలను కల్పిస్తున్నాయి. దీని ఫలితంగా తెలంగాణ రాష్ట్రంలో నీటిపారుదల సామర్థ్యం ఆహార భద్రత వ్యవసాయం వలన ఆదాయం బాగా పెరిగింది.

తెలంగాణలో నీటిపారుదల ప్రాజెక్టులు: నీటిపారుదల ప్రాజెక్టులను ఆయా ప్రాజెక్టుల కింద ఉండే ఆయకట్టు ప్రాంతాల పరిమాణం ఆధారంగా వర్గీకరిస్తారు. భారీ మధ్య తరహా ప్రాజెక్టులు మధ్యతరహా ప్రాజెక్టులు చిన్నతరహా ప్రాజెక్టులు అనే మూడు రకాలుగా వర్గీకరించారు.

తెలంగాణ రైతుల జీవన రేఖ శ్రీరామ్ సాగర్ ప్రాజెక్ట్: తెలంగాణ రైతులకు జీవన రేఖగా వర్ణించే ముఖ్యమైన ప్రాజెక్టు శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టు. ఈ ప్రాజెక్టు గోదావరి నదిపై 1963 వ సంవత్సరంలో నిజామాబాద్ జిల్లాలోని పోచంపాడు వద్ద నిర్మించారు. ఈ ప్రాజెక్టుకు అప్పటి ప్రధాని జవహర్లాల్ నెహ్రూ 1963 వ సంవత్సరంలో శంకుస్థాపన చేయగా అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి మర్రి చెన్నా రెడ్డి గారు 1977వ సంవత్సరంలో ప్రారంభించారు. ఇది తెలంగాణ రాష్ట్రంలోని మొట్టమొదటి బహుళార్థక సాధక ప్రాజెక్టు. దీనిని తెలంగాణ రైతుల జీవన రేఖగా అభివర్ణిస్తారు. ఈ ప్రాజెక్టు ద్వారా నిజామాబాద్ ఉమ్మడి ఆదిలాబాద్ కరీంనగర్ వరంగల్ జిల్లాలలోని తొమ్మిది లక్షల 68,840 ఎకరాల ఆయకట్టుకు నీరు అందించేలా రూపొందించారు. ఈ ప్రాజెక్టుపై ఉన్న కాకతీయ సరస్వతి లక్ష్మీ అనే మూడు ప్రధాన కాలువల ద్వారా త్రాగు సాగునీరు అవసరాలను తీరుస్తుంది. వీటిలో కాకతీయ కాలువ 284 కిలోమీటర్ల పొడుగుతో తెలంగాణలోని అతి పొడవైన కాలువగా గుర్తింపు పొందింది. దీన్నే ఎస్సారెస్పీ రెండవ దశలోని 346 కిలోమీటర్ల పెంచారు. ఈ భారీ తరహా ప్రాజెక్టుల వలన తెలంగాణ రాష్ట్రంలో నీటిపారుదల వ్యవస్థ మెరుగుపడి త్రాగునీరు సాగునీరు పుష్కలంగా లభిస్తుంది.


శ్రీరామ్ సాగర్ స్టేజి 2: ఈ పథకాన్ని కాకతీయ కాలువ 284 కిలోమీటర్ల నుండి 346 కిలోమీటర్ల మేరకు పెంచడం కోసం రూపొందించారు. ఈ పథకంద్వారా వరంగల్ ఖమ్మం మహబూబ్నగర్ మరియు నల్గొండ జిల్లాలోని కరువు పీడిత ప్రాంతాల్లో సుమారు 4,40,000 ఎకరాలకు త్రాగు సాగు నీరు అందిస్తారు. ఈ పథకంలో భాగంగా మైలారం రిజర్వాయర్ మరియు బయ్యన్న వాగు రిజర్వాయర్లను నిర్మిస్తున్నారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో 37 మధ్యతరహా నీటిపారుదల ప్రాజెక్టులు ఉండగా అందులో తొమ్మిది ప్రాజెక్టులు నిర్మాణ దశలో ఉన్నాయి. ఈ విధంగా తెలంగాణ రైతులకు జీవన రేఖగా శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టు నిలుస్తుంది అనడంలో సందేహం లేదు.

**పందిరి శ్రీనివాసులు. ఎం ఏ (జాగ్రఫీ), బిఈడి, ఎంసీజే (జర్నలిజం), పిజిడిసిజే ( జర్నలిజం) ఉస్మానియా యూనివర్సిటీ**

# అజారామరాలు...ఉషశ్రీ పురాణ వ్యాఖ్యానాలు

## సెప్టెంబర్ 7... ఉషశ్రీ వర్ధంతి

తెలుగు వారికి పరిచయం అక్కర్లేని పేరు ఉషశ్రీ. తెలుగునాట ప్రఖ్యాతి గాంచిన రేడియో వ్యాఖ్యాతగా, సాహిత్య రచయితగా, తమ రామాయణ భారత ప్రవచనాల ద్వారా తెలుగుసీమలో ఉషశ్రీ అందరికీ సుపరిచితులు. అప్పట్లో ఆయన గొంతుని, మాట సరళిని గుర్తు పట్టలేని తెలుగు శ్రోతలు లేరంటే అది అతిశయోక్తి కానేకాదు. ధర్మ సందేహాలు అనే పదబంధం వినబడితే ఉషశ్రీ గుర్తుకు రాక మానరు. ఆకాశవాణి ద్వారా ఆ కార్యక్రమాన్ని అంతగా ప్రాచుర్యం గావించారు ఉషశ్రీ.



పురాణ ప్రవచనంలోనే కాక ప్రత్యక్ష వ్యాఖ్యానాల లోనూ తెలుగు శ్రోతలపై చెరగని ముద్ర వేసిన 'గళగంధర్వుడు' ఉషశ్రీ. తెలుగు దేశంలో రేడియో స్వర్ణయుగ వైభవాన్ని శిఖరస్థాయికి చేర్చిన దిగ్గంతులలో అగ్ర తాంబూలం ఆయనదే అనడం అతిశయోక్తికాదు.

ఉషశ్రీ (మార్చి 16, 1928 – సెప్టెంబరు 7, 1990) అసలు పేరు పురాణపండ సూర్యప్రకాశ దీక్షితులు. ఈయన పశ్చిమ గోదావరి జిల్లా కాకరపర్రు అగ్రహారంలో 1928 (ప్రభవ తెలుగు సంవత్సరం) సంవత్సరం మార్చి 16 (ఫాల్గుణ బహుళ త్రయోదశి) న జన్మించారు. తండ్రి ఆయుర్వేద వైద్యులు పురాణపండ రామూర్తి, తల్లి కాశీ అన్నపూర్ణ. వారికి నలుగురు సంతానం. డాక్టర్ గాయత్రి, పద్మావతి, వైజయంతి, కళ్యాణి.

జాతీయోద్యమ సమయంలో కాకినాడలో కాంగ్రెస్ పార్టీకి ప్రతినిధిగా పని చేశారు. ఉభయ గోదావరి జిల్లాల్లో అనేక వేదికల ద్వారా రామాయణం, మహాభారతం మహాభాగవతం ప్రవచనం చేశారు.

ఆకాశవాణిలో పని చేస్తున్నప్పుడు భారత, రామాయణ, భాగవతాలను ప్రతి వారం సీరియల్‌గా చెపుతూ, అశేష తెలుగు శ్రోతలను ఉర్రూత లూగించారు. పురాణాలను పుక్కిట పట్టిన సాహితీ ద్రష్ట.

రామాయణ భారతాలు పనికిమాలిన గ్రంథాలు అని నిరసించే హేతు వాదులనూ, అవి పరమ పవిత్రమయిన మత గ్రంథాలు అని గుడ్డిగా ఆరాధించే చాందసులను ఇద్దరినీ సమానంగా నిందించి, ఈ రామాయణ భారతాలు మానవజాతి సర్వకాలాల లోనూ సుఖశాంతులతో మనుగడ సాధించడానికి అవసరమయిన విశేషాలను అందించే గ్రంథాలు మాత్రమే అనీ, అందుచేతనే ఇవి ఇన్నివేల సంవత్సరాలు జీవించ గలిగాయనీ ఉషశ్రీ స్పష్టం చేశారు.

రేడియోలో ఉషశ్రీగా పేరొందక ముందు కవిత్వం, గేయాలు, యక్షగానాలు, ఎన్నో కథలు, నవలికలు రాసారు. ఎమెస్కో వారు కూడా ఎన్నో ప్రచురించారు. రేడియోలో వార్తలు కూడా చెప్పేవారు. రేడియో నాటకాలు రాసేవారు. రేడియో నాటకాల్లో పాల్గొనేవారు.

1973 లో రేడియోలో భారత ప్రవచనం ప్రారంభించాడు. ఉషశ్రీ పురాణ ప్రవచనాలు వారానికి ఒకసారి ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు వచ్చేది. అప్పట్లో, దూరదర్శన్ లేదు. ఉషశ్రీ పురాణ ప్రవచనాలు వారానికి ఒకసారి ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు వచ్చేది. ఆయన ఉచ్చారణ ఎంత గంభీరమో, రచనా శైలి కూడా అంతటి నారికేళపాకంగా ఉండేది. శ్రోతలు రేడియోల ముందు నుండి కదలక ఉండేవారు. భగవద్గీతను, సుందరాకాండను పండిత పామరులను అలరించేలా, అందరికీ అర్థమయ్యేలా చేశారాయన. ధర్మసందేహాల కార్యక్రమం రేడియోలో వస్తూంటే పండిత పామరులనే బేధాల్లేకుండా రేడియోకి అతుక్కుని పోయేవారు. అయన కార్యక్రమం ప్రారంభం అయినంటే, రిక్షా కార్మికులు మొదలుకొని, రోడ్లపై నడిపేవారు కూడా ఆగి, రేడియో ఉన్న షాపు వద్ద విని వెళ్ళేవారు. రోడ్లపై జనసంచారం ఉండేది కాదు. నేటి క్రికెట్ మాచ్ కి మించిన ప్రజాదరణ పొందిన కార్యక్రమం అది. మొదట శనివారం నాడు పది నిమిషాల కార్యక్రమంగా మొదలై తరువాత శ్రోతల కోరికపై అరగంట, ఆ తర్వాత ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు మార్చక తప్పలేదు.

ఉషశ్రీ వాణి, ప్రత్యేకమైన బాణీ శ్రోతల్ని యెంతగా ఉర్రూత లూగించేవంటే వ్యాసపీఠం ప్రసారాల్ని నిలిపి వేసినప్పుడు రెడియో స్టషన్ యెదుట ధర్నాలు కూడా జరిగేవి. ఉషశ్రీ స్వరానికి వున్న పాపులారిటీకి అది మచ్చు తునక. దీన్ని బట్టి ఆయన కార్యక్రమాలు శ్రోతలను ఎంతగా ప్రభావితం చేశాయో స్పష్టం అవుతున్నది.

1979 లో పి.వి.ఆర్.కె ప్రసాద్ తిరుమల తిరుపతి దేవస్థానం కార్యనిర్వహణాధికారిగా ఉన్నపుడు ఉషశ్రీ చేత భాగవతం రాయించి పాతికవేల ప్రతులు ముద్రింప జేసి అతి తక్కువ ధరలో భక్తులకు అందించారు. అయితే ఆయన రెండున్నర రూపాయలకు విక్రయించే చర్యలు గైకొనగా, తర్వాత వచ్చిన అధికారులు తొమ్మిది రూపాయలకు పెంచారు. భారతం, రామాయణాలు కూడా పదివేల ప్రతులు ముద్రించి కృష్ణా పుష్కరాల సమయంలో విడుదల చేశారు.

దైవభక్తి, దేవుడిమీద అచంచల విశ్వాసం, జాలి, దయ, కరుణ, సున్నితత్వం, సేవా దృక్పథం, ఆపదలో ఉన్నవారికి సాయం చేయడం ఆయన స్వభావం. ఆయన తనకు మాత్రమే తెల్సి ఇంకెవ్వరికీ చెప్పకుండా చేసిన సాయాలు, దానాలెన్నో. మానవ విలువలు, సంబంధాలకు ఎంతో విలువ నిచ్చేవారు. 1986–90ల మధ్య ఆంధ్రజ్యోతి, స్వాతి వారపత్రికలలో ఉషశ్రీ పాఠకుల ధర్మసందేహాలకు సమాధానాలు కార్యక్రమం నిర్వహించారు.

వీరకాకాని అంతిమ యాత్ర, భారత మాజీ రాష్ట్రపతి ఫక్రుద్దీన్ అలీ అహ్మద్ ప్రారంభించిన రాజమండ్రి – కొవ్వూరు మధ్య గోదావరి నదిపై నిర్మించిన రోడ్ – కమ్ రైలు వంతెన ప్రారంభోత్సవం, భద్రాద్రి రామయ్య కల్యాణం, కృష్ణా పుష్కరాల సందర్భంగా తొలి ప్రత్యక్ష వ్యాఖ్యానం లాల్ బహదూర్ శాస్త్రి హైదరాబాద్ పర్యటన సందర్భంగా చేసిన ప్రత్యక్ష వ్యాఖ్యానం, తదితరాలు ఆయన వాగ్ధాటి, సమయస్ఫూర్తి, విషయ పరిజ్ఞానం, సమయోచిత సందర్భానుసార పద ప్రయోగ ప్రతిభకు నిదర్శనంగా నిలిచాయి. రాజాజీ ప్రసంగాలను అనువదించారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...**
**9440595494**

# తెలుగు ప్రేక్షకుల ఆదరణ తరగని "లవకుశ"

## సెప్టెంబర్ 7...లవ ( కుశ) నాగరాజు వర్ధంతి సందర్భంగా





తెలుగు చిత్ర సీమలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ సినిమాగా అలాగే చరిత్రలో నిలిచిన తొలి కలర్ సినిమా లవకుశ. ఇందులో రాముడిగా ఎన్టీఆర్.. సీతాదేవిగా అంజలి దేవి నటించగా, బాల నటులు సుబ్రహ్మణ్యం, నాగరాజులు లవకుశులుగా అమోఘంగా నటించి, తెలుగు వారి హృదయాలలో చిరస్థాయిగా నిలిచి పోయారు. ఇందులో కుశుడిగా నటించిన అనపర్తి నాగరాజు 2020 సంవత్సరం సెప్టెంబర్ 7న, 71 సంవత్సరాల వయసులో కన్ను మూశారు. 13 ఏళ్ల వయసులో తెలుగు సినిమా కోసం ముఖానికి రంగులు వేసుకున్న నాగరాజు, తర్వాత తెలుగు, తమిళ భాషల్లో 340కు పైగా చిత్రాల్లో నటించారు. ముఖ్యంగా ఎన్టీఆర్ హీరోగా నటించిన దాదాపు 22 పౌరాణిక చిత్రాల్లో వివిధ పాత్రల్లో నటించారు నాగరాజు. ఆయనకు భార్య, ముగ్గురు కుమార్తెలు.

లవకుశ సినిమా తెలుగు సినిమాల పైనే కాక తెలుగువారి పైనా తన ప్రభావాన్ని చూపించింది. తెలుగు గ్రామాల్లోని రామాలయాల్లో ఈ సినిమా పాటలు మారుమోగి తెలుగు నాట లవకుశ పాటలు వినిపించని గ్రామమే లేదన్నంత స్థాయి ప్రాచుర్యాన్ని తీసుకు వచ్చాయి. తెలుగు రాష్ట్రాలలో గ్రామాల్లో శ్రీరామ నవమి సహా ఏ ఉత్సవం చేసిన టూరింగ్ టాకీసులు లేదా ఊరిలో బాక్సు తీసుకువచ్చి లవకుశ సినిమాను వేయడమన్నది రివాజుగా మారింది. సి.పుల్లయ్య, ఆయన కుమారుడు సి.ఎస్.రావు దర్శకులుగా, లలితా శివజ్యోతి పిక్చర్స్ పతాకంపై శంకరరెడ్డి నిర్మించగా, ఎన్.టి.రామారావు, అంజలీదేవి, మాస్టర్ నాగరాజు, మాస్టర్ సుబ్రహ్మణ్యం, కాంతారావు, చిత్తూరు నాగయ్య ప్రధాన పాత్రధారులుగా 1963లో విడుదలైన తెలుగు పౌరాణిక చలనచిత్రం. లవకుశ సినిమాను ఉత్తర రామాయణం ఆధారంగా తీశారు. సీతారాములు పట్టాభిషిక్తులు అయ్యాక చాకలి తిప్పడు నిందవేశాడని రాముడు గర్భవతి యైన సీతాదేవిని అడవుల్లో వదలి వేయడంతో ప్రారంభయ్యే ఈ కథలో లవకుశుల జననం, వారు రామాయణ గానం చేయడం, రామ అశ్వమేథయాగం, అశ్వాన్ని లవకుశులు బంధించి ఏకంగా రామునితోనే యుద్ధం చేయడం వంటి సన్నివేశాలు ఉన్నాయి. 1934లో బ్లాక్ అండ్ వైట్లో లవకుశను దర్శకత్వం వహించిన సి.పుల్లయ్యకే మళ్ళీ ఈ సినిమాకు దర్శకత్వం వహించే అవకాశం దక్కింది.1958 లో ప్రారంభమైన ఈ సినిమా పూర్తిగా కలర్లో చిత్రీకరణ జరుపుకున్న తొలి తెలుగు చిత్రంగా నిలిచింది. ఆర్థిక కారణాలతో సినిమా చిత్రీకరణ 5 సంవత్సరాల పాటు కొనసాగింది. సినిమా ప్రారంభించినప్పుడు దర్శకత్వం వహించిన సి.పుల్లయ్య అనారోగ్యం పాలు కావడంతో ఆయన కుమారుడు సి.ఎస్.రావు పున:ప్రారంభం తర్వాత దర్శకత్వ బాధ్యతలు స్వీకరించారు.లవకుశ సినిమా సంగీత దర్శకునిగా ఘంటసాల వెంకటేశ్వరరావు వ్యవహరించారు. సినిమాలోని పలు పాటలను కొసరాజు రాఘవయ్య చౌదరి, సముద్రాల రాఘవాచార్య, సదాశివబ్రహ్మం రాశారు. 30కి పైగా పద్యాలతో తెరకెక్కిన ఈ సినిమాలో పద్యాలను కూడా సదాశివ బ్రహ్మం, సముద్రాల రాఘవాచార్యులు రచించగా, కవికోకిలగా పేరొందిన దువ్వూరి రామిరెడ్డి రచించిన ఓ పద్యాన్ని మాత్రం తీసుకుని ఉపయోగించు కున్నారు.

మొత్తానికి సినిమా చిత్రీకరణ పూర్తిచేసుకుని 1963లో 26 కేంద్రాల్లో విడుదలైంది. సినిమా అపూర్వమైన వాణిజ్య పరమైన విజయాన్ని సాధించింది. విడుదలైన అన్నికేంద్రాల్లో 150 రోజులు జరుపు కోవడంతో ప్రారంభించి 500 రోజులు ఆడిన తొలి తెలుగు చిత్రంగా చరిత్ర కెక్కింది. పావలా, రూపాయి టిక్కెట్లు ఉన్న రోజుల్లో సినిమా రూ.కోటి వసూళ్ళు పొందింది. 60లక్షల జనాభా ఉన్న వంద కేంద్రాల్లో 1.98 కోట్ల టిక్కెట్లు అమ్మి చరిత్ర సృష్టించింది. సినిమా తమిళ వెర్షన్ 40 వారాలు ఆడగా, హిందీ వెర్షన్ సిల్వర్ జూబ్లీ జరుపుకుంది. రిపీట్ రన్స్ లోనూ కేంద్రాల సంఖ్య, ఆడిన రోజుల్లో రికార్డ్ సాధించింది. సినిమా ఘన విజయాన్ని సాధించడంతో పాటుగా క్లాసిక్ స్థాయిని అందుకుంది. గ్రామాలలో ప్రజలు లవ కుశ సినిమా చూస్తూ, హారతులు పట్టేవారు. ఇప్పటికీ సినిమా టీవిలో ప్రదర్శిత మైనప్పుడు ప్రేక్షకులు ఇప్పటికీ ఆదరిస్తునే ఉన్నారు.

మాస్టర్ నాగరాజు (లవుడు);
మాస్టర్ సుబ్రహ్మణ్యం (కుశుడు); ఎన్.టి.ఆర్ (రాముడు); అంజలీ దేవి (సీత); చిత్తూరు నాగయ్య (వాల్మీకి); కాంతారావు (లక్ష్మణుడు); సత్యనారాయణ (భరతుడు); శోభన్ బాబు (శత్రుఘ్నుడు); శాండో కృష్ణ (హనుమంతుడు); కన్నాంబ (కౌసల్య); ఎస్. వరలక్ష్మి (భూదేవి); రేలంగి (చాకలి); గిరిజ (చాకలి భార్య): శివ రామ కృష్ణయ్య (చాకలి మామ); రమణారెడ్డి (వాల్మీకి అనుచరుడు); సూర్య కాంతం, ధూళిపాళ; ఎల్.విజయలక్ష్మి, రీటా, సూర్య కుమారి...నాట్య కారిణులు తెరపై దర్శనమిస్తారు.

**రామ కృష్ణయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...**
**9440595494**

సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
సోమవారం
07-9-2026

## ఆటో కార్మికులకు సంఘీభావంగా బీఆర్ఎస్ నేతల నిరసన



**జమ్మికుంట, సెప్టెంబర్ 5 (సింగిడి) :** కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలన లో ప్రజలకు ఒరిగింది ఏమీ లేదని ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని టిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పిలుపుమేరకు నియోజకవర్గం లోని ఇల్లందకుంట వీణవంక మండల కేంద్రాలలో ఆటో డ్రైవర్లకు మద్దతుగా టిఆర్ఎస్ నేతలు సంఘీభావం తెలుపుతూ నిరసన వ్యక్తం చేశారు. వీణవంక మండల కేంద్రంలో మాజీ ఎంపీపీ ముసిపట్ల రేణుక తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో టిఆర్ఎస్ నేతలు భారీ ఎత్తున నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తిరుపతి రెడ్డి మాట్లాడుతూ, వెయ్యి రోజుల పాలన ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని ఆటో డ్రైవర్లకు ప్రభుత్వం అన్యాయం చేసిందని వారి సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందని ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ వారు నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రాయిశెట్టి లతా శ్రీనివాస్ తో పాటు పలువురు బిఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.

**ఇల్లందకుంటలో.....**

ఇల్లంతకుంట మండల కేంద్రంలో మాజీ ఎంపీపీ సరిగోమ్ముల పావని వెంకటేష్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై ఆటో కార్మికులకు మద్దతుగా ప్రభుత్వంపై వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ వారికి సంఘీభావం పలికారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ వెంకటేష్ మాట్లాడుతూ, కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని 420 హామీలతో రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కాంగ్రెస్ అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని మండిపడ్డారు. విద్యార్థులకు ఫీజు రియాబర్స్మెంట్ ఇవ్వలేదని ఆటో కార్మికులకు జీవనోపాధి లేకుండా చేసిందని వారి సమస్యలను పరిష్కారంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో పలువురు బి ఆర్ ఎస్ నేతలు తదితరులు పాల్గొన్నారు.

## ఆటో కార్మికుల జీవితం దుర్భరం...

### వెయ్యి రోజుల పాలనలో ప్రజలకు ఒరిగింది ఏమీ లేదు

### మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్

### బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ



**జమ్మికుంట, సెప్టెంబర్ 6 (సింగిడి):** కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ఆటో కార్మికుల జీవితాలు దుర్భరంగా మారాయని మున్సిపల్ చైర్మన్ ములుగు ప్రశాంత్ కుమార్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ 1,000 రోజుల వైఫల్య పాలనను నిరసిస్తూ, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకత్వం ఇచ్చిన పిలుపు మేరకు తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హుజురాబాద్ నియోజకవర్గ శాసనసభ్యులు పాడి కౌశిక్ రెడ్డి ఆదేశాలతో జమ్మికుంట పట్టణంలో ఆటో కార్మికులకు మద్దతుగా నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ ఆటో కార్మికుల జీవన పరిస్థితులు రోజురోజుకూ దయనీయంగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రోజువారీ సంపాదనతో కుటుంబాలను పోషించుకుంటున్న ఆటో కార్మికులకు ఆదాయం తగ్గిపోవడంతో ఆటో కిస్తీలు, ఇంటి అద్దెలు, పిల్లల చదువుల ఖర్చులు, వైద్య ఖర్చులు భరించలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వం హామీ ఇచ్చిన రూ. 12,000 ఆర్థిక సహాయాన్ని వెంటనే అమలు చేయాలని, ఆటో కార్మికులకు సబ్సిడీ రుణాలు అందించాలని, ఆధునిక ఎలక్ట్రిక్ ఆటోలు అందించి వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించాలని కోరారు. ఆటో కార్మికుల న్యాయమైన డిమాండ్ల కోసం బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని మొలుగు ప్రశాంత్ కుమార్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ ముంతాజ్ అలీ జావేద్ , ప్రాథమిక సహకార సంఘం చైర్మన్ పోనగంటి సంపత్,పొడేటి రామస్వామి, పోల్నేనీ సత్యనారాణ రావు, కేడీసీసీ వైస్ చైర్మన్ పింగళి రమేష్,బీఆర్ఎస్ నాయకులు,ఆటో యూనియన్ నాయకులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అమ్మాయి మొగుడు అత్తకు యముడు

### అధికారులతో కుమ్ముక్కై అక్రమంగా భూమి రిజిస్ట్రేషన్



**వికారాబాద్ ప్రతినిధి, సెప్టెంబర్ 6(సింగిడి):** నమ్మి నాన బోస్తే పుచ్చి బుర్రలైయ్యాయయి అనేది నానుడు. ఈ నన్నుడిని అక్షరాల నిజం చేసిన అల్లుడి ఉదాంతం వెలుగు చూసింది. వికారాబాద్ జిల్లా పరిధిలోని నస్కల్ గ్రామానికి చెందిన బోయ చంద్రమ్మ కు నస్కల్ రెవిన్యూ పరిధిలో అధిక మొత్తం విలువ చేసే పట్టా భూమి 6.33 ఎకరాలు ఉంది. ఆమెకు కూతురు లక్ష్మీ, పెంపుడు కుమారుడు గణేష్ లు ఉన్నారు. ఈ నేపథ్యంలో పెంపుడు కుమారుడు గణేష్ కు 1.24 ఎకరాల భూమిని రిజిస్ట్రేషన్ చేసింది. కూతురు లక్ష్మీని కూడా గ్రామానికి చెందిన మల్లేష్తో వివాహం చేసింది. అందుకు కూతురు కు 2.06 ఎకరాల భూమిని రిజిస్ట్రేషన్ చేయాలని నిర్ణయించుకుని సంబంధిత తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రారంభించారు. అయితే చంద్రమ్మ కూతురు కు ఇవ్వాలనుకున్న భూమి 2.06 విస్తీర్ణం కాగా అల్లుడు మల్లేష్, రిజిస్ట్రేషన్ కార్యాలయం కంప్యూటర్ ఆపరేటర్ కుమ్మకై అదనంగా 1.20 ఎకరాలను రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఈ నేపథ్యంలో విషయం బయటకు రావడంతో ఆందోళనకు గురైన చంద్రమ్మ అల్లుడు, కంప్యూటర్ ఆపరేటర్ చేసిన మోసంపై పోలీసులకు, సంబంధించిన అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో అమ్మాయి మొగుడు అత్తకు యముడిలా వ్యవహారించాడని గ్రామస్తులు ఎద్దేవాచేశారు. లక్షలాది రూపాయల విలువైన భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకోవడం అందుకు ఆపరేటర్ సహకరించడం పై చర్యలు తీసుకోవాలని పలువురు కోరారు.

# పడకేసిన పారిశుధ్యం

### గ్రామపంచాయతీలో నిధులు లేవు?

### రోడ్లపై శ్రమదానం చేసి, బ్లీచింగ్ చల్లి బీఆర్ఎస్ నిరసన

**ములుగు ప్రతినిధి, సెప్టెంబర్ 6 (సింగిడి):** కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో గ్రామాల్లో పారిశుధ్య వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమైందని బీఆర్ఎస్ నాయకులు మండిపడ్డారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన పారిశుధ్య సమస్యలపై నిరసన కార్యక్రమంలో భాగంగా మంగపేట మండలం కొత్తమల్లూరు(బెస్తగూడెం) లో శనివారం బీఆర్ఎస్ శ్రేణులు వినూత్న నిరసనకు దిగారు. గ్రామంలో వారాలుగా పారిశుధ్య పనులు జరగకపోవడంతో మురుగునీరు రోడ్లపైకి వచ్చి, చెత్తకుప్పలు పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోందని ఆరోపించారు. దీనికి నిరసనగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు స్వయంగా చీపుర్లు పట్టి రోడ్లపై శ్రమదానం చేశారు. అనంతరం దోమల నివారణకు బ్లీచింగ్ పౌడర్ చల్లి తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాల్సిన గ్రామపంచాయతీ, ప్రభుత్వ యంత్రాంగం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక గ్రామాల్లో పారిశుధ్యం గాలికొదిలేశారని, పారిశుధ్యం పై ప్రశ్నిస్తే నిధులు లేవంటూ గ్రామ అధికారులు దాటవేస్తున్నారని వారు ఆరోపించారు.





గ్రామ పంచాయతీకి చెందిన చెత్త ట్రాక్టర్ సరిగా తిరగడం లేదని, ఇంటింటి నుండి చెత్త సేకరణ నిలిచిపోయిందని ఆరోపించారు. దీంతో ఎక్కడ చూసినా చెత్తకుప్పలే దర్శనమిస్తున్నాయని, దోమల బెడదతో ప్రజలు జ్వరాల బారిన పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే అధికారులు స్పందించి కొత్తమల్లూరు గ్రామంలో ఫాగింగ్ నిర్వహించాలని, చెత్త సేకరణను క్రమబద్ధీకరించాలని, పారిశుధ్య పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కొత్తమల్లూరు బీఆర్ఎస్ మాజీ అధ్యక్షుడు మునిగేలా సాంబులు, నాయకులు గుండారపు రమేష్, బట్ట నరసింహారావు, పొనగంటి గోవర్ధన్, గుమ్మాల కృష్ణవేణి, గుండారపు నాగలక్ష్మి, బట్ట నర్సింహులు, గుండారపు పూర్ణ, బట్ట ఆంజనేయులు, పొనగంటి రాంబాబు, కొంకతి గోవర్ధన్ పాల్గొన్నారు.

## కమనీయం.. రమణీయం.. స్వామివారి రథోత్సవం

### గీతా మందిర్‌లో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

**జమ్మికుంట, సెప్టెంబర్ 6 (సింగిడి):** రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి రథోత్సవం కమనీయం రమణీయంగా జరిగింది. జమ్మికుంట పట్టణంలోని భగవద్గీత జ్ఞాన మందిరంలో శ్రీ కృష్ణాష్టమి సందర్భంగా మూడు రోజులపాటు వేడుకలను ఆలయ నిర్వాహకులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేడుకలలో భాగంగా స్వామివారికి శ్రీకృష్ణ భవనం వాసుదేవ భవనం లక్ష్మీనరసింహ మనం తోపాటు లక్ష పుష్పార్చనను వేద పండితుల మంత్ర చరణల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామివారికి 108 కళాశాలచే అభిషేకం చేసి తులాభారం నిర్వహించారు. కృష్ణాష్టమి సందర్భంగా రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామిని పట్టు వస్త్రాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి రథం పై అధిరోహించారు. పట్టణ పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహిస్తూ ప్రముఖ నృత్యకారిణి శ్వేతా ఆధ్వర్యంలో చిన్నారులు భరతనాట్యాలు, కోలాటాలు చేస్తూ సందడి



చేశారు. పట్టణంలోని మహిళలు రథం పై ఉన్న స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో భగవద్గీత ఆలయ కమిటీ చైర్మన్ పురం వైకుంఠం, సభ్యులు పత్తి జనార్దన్ రెడ్డి ,చిదురాల శ్రీనివాస్, వ్యాంసాని రాజశేఖర్, మురికి కొండయ్య తోపాటు తదితరులు పాల్గొన్నారు.

## ఆటో కార్మికుల హామీల అమలులో ప్రభుత్వం విఫలం

### వెయ్యి రోజుల పాలనపై ఐదో రోజు బీఆర్ఎస్ నిరసన, ఆటోలతో భారీ ర్యాలీ

### మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్

**కరీంనగర్, సెప్టెంబర్6(సింగిడి):** కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసనలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా ఐదో రోజు కరీంనగర్‌లో ఆటోలతో భారీ ర్యాలీ నిర్వహించారు. తెలంగాణ చౌక్‌లో మాజీ



మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించడంతో పాటు స్వయంగా ఆటో నడిపారు.

ర్యాలీ ప్రారంభానికి ముందు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రంతో రూపొందించిన వినూత్న ఫ్లెక్సీని ప్రదర్శిస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కాంగ్రెస్, టీడీపీ కండువాలతో పాటు 'ఓటుకు నోటుకు దొంగ' అనే సందేశంతో రూపొందించిన ఫ్లెక్సీ ఆకట్టుకుంది. 'నిన్న ఒక జెండా.. నేడు మరో కండువా.. ఎటు లాభం ఉంటే అటు జంప్' అనే భావాన్ని వ్యక్తం చేసేలా రూపొందించిన ఫ్లెక్సీ రాజకీయంగా చర్చనీయాంశమైంది.రేపటి నుంచి ప్రారంభమయ్యే శాసనసభ సమావేశాల్లో ఆటో కార్మికుల సమస్యలపై తమ పార్టీ తరఫున గళం వినిపిస్తామని గంగుల కమలాకర్ తెలిపారు. ఈ కార్యక్రమం లో నగర అధ్యక్షులు చల్ల హరి శంకర్, ఎడ్ల అశోక్, గుగ్గిళ్ల జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ సహకరించాలి

### ఆసరా ఫౌండేషన్ ద్వితీయ వార్షికోత్సవంలో నగర మేయర్ శ్రీనివాస్ పిలుపు

**కరీంనగర్, సెప్టెంబర్6(సింగిడి):** మట్టి వినాయక విగ్రహాలను పూజించి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ పిలుపునిచ్చారు. కరీంనగర్‌కు చెందిన ఆసరా ఫౌండేషన్ (ఆపదలో సహాయానికి రా) ద్వితీయ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మేయర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా గత రెండేళ్లుగా ఫౌండేషన్ చేపడుతున్న సేవా కార్యక్రమాలను మేయర్ అభినందించారు. మొక్కలు నాటడం, పచ్చదనం--పరిశుభ్రతపై అవగాహన, ఓటరు మరియు ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు, యువతకు మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై చైతన్యం కల్పించడం, ఆపదలో ఉన్న వారికి రక్తదానం ద్వారా సహాయం అందించడం వంటి సేవలను ప్రశంసించారు.



భవిష్యత్తులోనూ ఇదే స్ఫూర్తితో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు. వినాయక చవితిని పురస్కరించుకుని పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఫౌండేషన్ రూపొందించిన "మట్టి వినాయకుడిని పూజిద్దాం-- పర్యావరణాన్ని పరిరక్షిద్దాం" గోడపత్రికను మేయర్ ఆవిష్కరించారు. మట్టి విగ్రహాలు నీటిలో సులభంగా కలిసిపోతాయని, ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలతో పోలిస్తే పర్యావరణానికి తక్కువ హాని కలిగిస్తాయని తెలిపారు. వీలైనంత వరకు ఇంటివద్దనే మట్టి విగ్రహాలను నిమజ్జనం చేసి, ఆ మట్టిని మొక్కల పెంపకానికి వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆసరా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు, జాతీయ సేవా పథకం జాతీయ అవార్డు గ్రహీత డాక్టర్ ఆర్. గోపి కృష్ణ, సభ్యులు కె. ప్రవీణ్, జి. తిరుపతి, ఎం. రవిచందర్, వి. అద్వైత్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

## సమరభేరి' విజయంతో బీజేపీ నేతల్లో గుబులు

- మేయర్ వ్యాఖ్యలకు మాజీ మేయర్ ఘాటు కౌంటర్
- కరీంనగర్ అభివృద్ధిపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్
- మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్

**కరీంనగర్, సెప్టెంబర్6(సింగిడి):** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'విద్యార్థి, యువ సమరభేరి' సభ విజయవంతమైందని, దీంతో బీజేపీ నాయకుల్లో భయం మొదలైందని మాజీ మేయర్, రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ మాజీ చైర్మన్ సర్దార్ రవీందర్ సింగ్ అన్నారు. సభ అట్టర్ ఫ్లాప్ అయిందంటూ నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ చేసిన వ్యాఖ్యలకు ఆయన ఘాటుగా స్పందించారు. యువత, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్న సభను విఫలమైందని చెప్పడం బీజేపీ నేతల అసహనానికి నిదర్శనమన్నారు. కేటీఆర్ యువత, విద్యార్థుల సమస్యలు, ఉద్యోగాలు, భవిష్యత్తుపై మాట్లాడి వారికి భరోసా కల్పించారని తెలిపారు. సభ విఫలమైతే మేయర్ ఇంతగా స్పందించాల్సిన అవసరం ఏముందని



ప్రశ్నించారు. కేంద్ర మంత్రి బండి సంజయ్‌పై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను విమర్శించే ముందు, ఆయన ఎంపీగా కరీంనగర్ నగరానికి, జిల్లాకు తీసుకొచ్చిన నిధులు, చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలను ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు. శాతవాహన విశ్వవిద్యాలయానికి 12బీ హోదా, ఎస్ఆర్ఆర్ కళాశాలకు స్వయం ప్రతిపత్తి హోదా వంటి అంశాలను తమ ఖాతాలో వేసుకునే ప్రయత్నం చేయవద్దన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులకు ప్రస్తుతం బీజేపీ నాయకులు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేస్తూ వాటిని తమ ఘనతగా చెప్పుకుంటున్నారని విమర్శించారు. కరీంనగర్ నగరంలో పారిశుధ్య పరిస్థితులు సరిగా లేవని, అవసరమైన సౌకర్యాలు, సామగ్రి లేక ప్రజలు, కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. నగరపాలక సంస్థ సమావేశాల్లో బీజేపీ కార్పొరేటర్లే పారిశుధ్య సమస్యలను ప్రస్తావిస్తున్నారని, సమస్యలను ప్రశ్నించిన తమ పార్టీ కార్పొరేటర్లపై కేసులు పెట్టడం సరికాదన్నారు. నగర పాలన, అభివృద్ధి పనులు, నిధుల వినియోగంపై బహిరంగ చర్చకు తాను సిద్ధమని సర్దార్ రవీందర్ సింగ్ ప్రకటించారు. కరీంనగర్ అభివృద్ధిపై శ్వేతపత్రం విడుదల చేయాలని మేయర్‌కు సవాల్ విసిరారు. కేటీఆర్ సిరిసిల్ల అభివృద్ధిపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేసే ముందు, బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కరీంనగర్‌కు చేసిన అభివృద్ధిపై వివరాలు వెల్లడించాలని కోరారు. కరీంనగర్ ప్రజలను తక్కువ అంచనా వేయవద్దని, ప్రజలు అన్ని విషయాలను గమనిస్తున్నారని అన్నారు. ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తూనే ఉంటామని, ఆధారాలతో సమాధానం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నామని సర్దార్ రవీందర్ సింగ్ స్పష్టం చేశారు.

## పోలింగ్ కేంద్రాలను సందర్శించిన ఆర్డిఓ



**జమ్మికుంట, సెప్టెంబర్ 6 (సింగిడి) :** జమ్మికుంట పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రభుత్వ బాలికల పాఠశాలలో ఏర్పాటుచేసిన సర్ ప్రత్యేక కేంద్రాన్ని హుజురాబాద్ ఆర్డీవో జల కుమారి ఆది వారం సందర్శించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఆర్డీవో బిఎల్ఓ లకు తగు సూచనలు సలహాలు అందించారు. సర్ కార్యక్రమాన్ని ఎలాంటి అవకతవకలు లేకుండా పూర్తి చేయాలని సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట తహసిల్దార్ జి సుధాకర్ డిప్యూటీ తహసిల్దార్ శంకర్ గిర్దవార్ సత్యనారాయణ జిపిఓ లు 7 రాజకీయం హరీష్ వివేక్ బి ఎల్ ఓ అనూష తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా శివపార్వతుల కళ్యాణం



**వికారాబాధ్, సెప్టెంబర్ 6(సింగిడి):** వికారాబాద్ పట్టణంలోని శ్రీ అన్నపూర్ణ సహిత కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో అత్యంత వైభవంగా శివపార్వతుల కళ్యాణ మహోత్సవాన్ని ఆదివారం వికారాబాద్ లో జరిపించారు. మున్సిపల్ వైస్ చైర్మన్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు టి ఎం జే యు అధ్యక్షులు. ఆలయ ధర్మకర్త అర్ధ సుధాకర్‌రెడ్డి, ప్రభావతి దంపతులు భక్తి శ్రద్ధలతో, ఆధ్యాత్మికతతో నిర్వహించారు. పార్వతీ పరమేశ్వరుల దివ్య ఆశీస్సులు వికారాబాద్ ప్రజలందరిపై, వారి కుటుంబంపై ఎల్లవేళలా ఉండాలని కోరుకున్నారు.

### ఎమ్మెల్యే యాదయ్యపై నిరాధార ఆరోపణలు సరికాదు



**వికారాబాధ్, సెప్టెంబర్ 6(సింగిడి):** చేవెళ్ళ ఎమ్మెల్యే కాలె యాదయ్య పై ఇష్టానుసారంగా విమర్శలు, నిరాధార ఆరోపణలు చేస్తే ఇకపై సహించేది లేదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు రావుగారి వెంకట్ రెడ్డి, సీనియర్ నాయకులు తీవ్రస్థాయిలో హెచ్చరించారు. ఆదివారం జిల్లా పరిధిలోని నవాబుపేట మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నవాబుపేట మండలంలో కొందరు వ్యక్తులు రాజకీయంగా విమర్శలు చేయడానికి హద్దులు ఉంటాయని, వాటినిదాటి వ్యక్తిగత ఆరోపణలు చేస్తే తగిన రీతిలో సమాధానం చెప్పాల్సి వస్తుందని స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయడంలో ఎమ్మెల్యే ముందుంటున్నారని పేర్కొన్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేసిన వారమని కార్యకర్తలుగా నిలబడి పార్టీ బలోపేతానికి కృషి చేశామని వారు గుర్తు చేశారు. పార్టీ కోసం ఎన్నో ఏళ్లుగా పనిచేసిన తమకు రాజకీయ పరిణామాలు కొత్తేమీ కాదని అన్నారు. వ్యక్తిగత విమర్శలకు దిగితే తాము కూడా తగిన రీతిలో సమాధానం చెప్పాల్సి వస్తుందని హెచ్చరించారు.

ప్రభాతవన సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
సోమవారం
07-9-2026

# ప్రజలకు తాగునీరు నిరంతరాయంగా అందాలి

- అందుకు తగిన చర్యలు తీసుకోవాలి
- మిషన్ భగీరథ నీటి శుద్ధీకరణ ప్లాంటును పరిశీలించిన జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్పాయ్



**హన్మకొండ, సెప్టెంబర్ 6 (సింగిడి):** శాయంపేట మండలం జోగంపల్లిలోని మిషన్ భగీరథ నీటి శుద్దీకరణ ప్లాంటును జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్పాయ్ పరిశీలించారు. మండలంలోని గ్రామాలకు తాగునీటి సరఫరాలో ఎక్కడ కూడా సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. నీటి సరఫరా పరిస్థితి ఎలా ఉందని, పంపుల పనితీరు, క్లోరినేషన్, ఇన్‌ట్రా డిస్ట్రిబ్యూషన్ వ్యవస్థ, పంపింగ్ తీరు తదితర అంశాలను సంబంధిత అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. మండలంలోని 26 గ్రామాలకు రోజుకు ప్రస్తుతం సుమారు 5. 35 ఎమ్ఎల్డీ నీటిని సరఫరా చేస్తున్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. నీటి సరఫరా కోసం ఏర్పాటు చేసిన అన్ని పంపులు పని చేసే స్థితిలో ఉన్నాయా, ఏదైనా సాంకేతిక సమస్య తలెత్తినప్పుడు వెంటనే వినియోగించేందుకు స్టాండ్‌బై పంపులు, ప్రత్యామ్నాయ పరికరాలుఅందుబాటులో ఉన్నాయా అని కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు సురక్షితమైన తాగునీరు నిరంతరాయంగా అందేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. నీటి సరఫరా వ్యవస్థలో ఎక్కడైనా సమస్యలు తలెత్తితే వాటిని వెంటనే గుర్తించి ప్రత్యామ్నాయ నీటి వనరులు, అదనంగా పరికరాలను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంచాలని సూచించారు. ప్రజలకు తాగునీటి విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని పేర్కొన్నారు. అదేవిధంగా పరకాల లోని చలి వాగు కు సంబంధించిన చెక్ డ్యామ్ ను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. చెక్ డ్యామ్ ద్వారా వరద నీరు సాఫీగా వెళ్లే విధంగా చేపట్టనున్న మరమ్మతు పనుల గురించిన వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మిషన్ భగీరథ ఇంట్రా ఆర్డబ్ల్యూఎస్ ఈఈ గాయత్రి, వాటర్ గ్రిడ్ ఈఈ సురేందర్, సాగునీటిపారుదల శాఖ ఈఈ సునీత, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులు విద్యార్థుల సృజనాత్మకతను వెలికితీయాలి

**ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి**



**నల్గొండ ప్రతినిధి సెప్టెంబర్ 6 (సింగిడి):** ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైందని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా శాలిగౌరారం మండలంలో 14 మంది ఉపాధ్యాయులు ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయులు విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను గుర్తించి, వారికి తగ్గట్టుగా విద్యాబోధన చేసి వారి బంగారు భవిష్యత్ కు బాటలు వేసేలా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పాదూరి శంకర్ రెడ్డి, తహశీల్దార్ కేతావత్ మాదవరావు, ఎంపీడీవో విజయ్ కుమార్, ఎంఈఓ మందుల సైదులు, పలు ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## భావి భారత పౌరులను తయారు చేసేది ఉపాధ్యాయులే

**ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్**



**మిర్యాలగూడ సెప్టెంబర్ 6 (సింగిడి):** భావిభారత పావురాలను తయారు చేసేది ఉపాధ్యాయులేనని ఎమ్మెల్సీ కేతవత్ శంకర్ నాయక్ అన్నారు, శనివారం మిర్యాలగూడ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన ఉపాధ్యాయ దినోత్సవం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి లో పాల్గొని మాట్లాడుతూ ఉపాధ్యాయ వృతి చాలా గొప్పదని అన్నారు. ఎటువంటి అవినీతి అక్రమాలకి తావు లేకుండా విధి నిర్వహణ చేసేది ఒక్క ఉపాధ్యాయులేనని చెప్పారు. అనంతరం ఉపాధ్యాయుల ను సన్మానించారు. మండల విద్యాధికారి ధర్మ నాయక్, బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయురాలువిజయకుమారి,నిర్మల,రజిని,శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలి

**ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి**



**నల్లగొండ ప్రతినిధి, సెప్టెంబర్ 6 (సింగిడి):** ఫీజు రీయింబర్స్మెంట్ను వెంటనే విడుదల చేయాలని నాగార్జునసాగర్ నియోజకవర్గంహాలియా పట్టణ కేంద్రంలోబిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకుమాజీ ఎమ్మెల్యే నోముల భగత్ కాంగ్రెస్ పార్టీ 1000 రోజుల విఫల పాలనకు నిరసనగా ఫీజు రియంబర్స్మెంట్,యూత్ డిక్లరేషన్, అమలు చేయాలని నిరసిస్తూ... నిర్వహించిన విద్యార్థుల ర్యాలీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైననల్లగొండ జిల్లా శాసనమండలి సభ్యులు యం.సి కోటిరెడ్డి మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని, యూత్ డిక్లరేషన్‌ను అమలు చేయాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో మాజీ ట్రై కార్ చైర్మన్ ఇస్లావత్ రామచంద్రనాయక్, హాలియా మాజీ మార్కెట్ చైర్మన్ ఎక్కలూరు శ్రీనివాస్ రెడ్డి,హాలియా మున్సిపాలిటీ వార్డ్ కౌన్సిలర్ కడమంచి ప్రమీల శ్రీనివాస్,నందికొండ మున్సిపాలిటీ వార్డు కౌన్సిలర్ నకిరేకంటి రమణ సైదులు, మాజీ ఫ్లోర్ లీడర్ వర్ర వెంకటరెడ్డి,మాజీ బిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు వడ్డే సతీష్ రెడ్డి,పార్టీ శ్రేణులు, విద్యార్థులు,నాయకులు, మహిళ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# భూ రీ-సర్వే త్వరగా పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**భూపాలపల్లి ప్రతినిధి,సెప్టెంబర్ 6 (సింగిడి):** భూ రీ-సర్వేను ఖచ్చితత్వంతో, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా, నిర్ణీత గడువులోగా త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. గణపురం మండలం అప్పయ్యపల్లి గ్రామపంచాయతీ శివారులోని తూపురం వద్ద జరుగుతున్న భూ రీ-సర్వే పనులను కలెక్టర క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వే అధికారులు, సిబ్బందితో మాట్లాడిన కలెక్టర్ రీ-సర్వే పనుల పురోగతిని, అనుసరిస్తున్న సర్వే విధానాన్ని పరిశీలించారు. అనం తరం రైతులను సర్వే గురించి అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో రీ సర్వే కోసం ఎంపిక చేసిన 70 గ్రామాలలో సర్వే చేపట్టాల్సి ఉండగా ఇప్పటి వరకు 12 గ్రామాల్లో రీ సర్వే జరుగుతున్నదని, మిగిలిన గ్రామాల్లో కూడా సర్వే చేపట్టాలని తెలిపారు. క్షేత్రస్థాయిలో విధులు నిర్వహిస్తున్న సర్వేయర్ల భద్రతకు అవసరమైన గమ్ షూస్, ఇతర రక్షణ పరికరాలను కొనుగోలు చేయాలని ఆదేశించారు. అలాగే రోవర్ తదితర ఆధునిక సాంకేతిక పరికరాలను సమర్థవంతంగా వినియోగిస్తూ సర్వే పనులను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. గన్ పూర్ మండలంలో 6 గ్రామాలను రీ సర్వే కోసం ఎంపిక చేయగా ప్రస్తుతం 3 గ్రామాల్లో రీ సర్వే జరుగుతుందని తెలిపారు. భూ రీ-సర్వే అనంతరం ప్రతి రైతుకు వారి భూమికి సంబంధించిన స్పష్టమైన భూధార్ సంఖ్య, భూ మ్యాపులు అందుతాయని, దీనివల్ల భూ రికార్డులు మరింత పారదర్శకంగా మారడంతో పాటు భూ వివాదాల పరిష్కారానికి దోహదపడుతుందని కలెక్టర్ తెలిపారు. ఎన్నో సంవత్సరాలు తరువాత భూములు రీ సర్వే జరుగుతున్నదని, రైతులు సర్వే సిబ్బందికి సహకరించాలని తెలిపారు. రీ-సర్వే ప్రక్రియలో రైతులకు పూర్తి అవగాహన కల్పిస్తూ, వారి సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడి కుసుమ కుమారి, ఆర్డీఓ హరికృష్ణ, తహసీల్దార్ రాజేస్వర రావు రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి కాలనీలో మౌలిక వసతులు తప్పనిసరి

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



**హనుమకొండ, సెప్టెంబర్ 6 (సింగిడి):** వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని ప్రతి కాలనీలో మౌలిక వసతులను మెరుగుపరిచి ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు అందించడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. గతంలో సంవత్సరాల తరబడి పరిష్కారానికి నోచుకోని సమస్యలకు ప్రాధాన్యత క్రమంలో పరిష్కారం చూపుతూ, నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని 52వ డివిజన్‌లో పోలీస్ హెడ్‌క్వార్టర్స్ వెనుక ప్రాంతంలో 6వ డివిజన్‌లోని పద్మశాలీవాడలో అంతర్గత రోడ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యేనాయిని రాజేందర్‌రెడ్డి శనివారం శంకుస్థాపన చేశారు. సుమారు రూ. 90 లక్షల వ్యయంతో, 52వ డివిజన్‌లో రూ. 60 లక్షలు, 6వ డివిజన్‌లో రూ. 30 లక్షలతో చేపట్టనున్న రోడ్డు నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని స్థానిక ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, సంబంధిత అధికారులు, డివిజన్ నాయకులు, కాలనీ వాసులతో కలిసి ఆయా ప్రాంతాల్లో పర్యటించారు. స్థానికంగా నెలకొన్న సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. రోడ్ల పరిస్థితి, డ్రైనేజీ, పారిశుద్ధ్యం, మౌలిక వసతులకుసంబంధించిన సమస్యలను పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ, నియోజక వర్గంలోని సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి అక్కడి ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను కల్పించేం దుకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్తున్నామని తెలిపారు. ముఖ్యంగా అంతర్గత రోడ్లు సరిగా లేక ఇబ్బందులు పడుతున్న కాలనీలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని చెప్పారు. గత పదేళ్లలో అనేక ప్రాంతాల్లో అభివృద్ధి పనులు జరగక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అలాంటి ప్రాంతాలను గుర్తించి ఒక్కొక్క సమస్యకు పరిష్కారం చూపుతున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. నియోజకవర్గంలోని ప్రతి కాలనీకి మెరుగైన రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ, తాగునీరు, పారిశుద్ధ్య సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే నాయిని తెలిపారు. అభివృద్ధి అనేది ప్రధాన రహదారులు, కూడళ్లకే పరిమితం కాకుండా ప్రతి కాలనీకి, ప్రతి వీధికి చేరాలని తమ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ప్రజలు ప్రతిరోజూ ఎదుర్కొనే సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పించడమే తమ ప్రాధాన్యత అని చెప్పారు. అంతర్గత రోడ్ల నిర్మాణం పూర్తయితే ఆయా ప్రాంతాల ప్రజలకు రాకపోకల ఇబ్బందులు తొలగడంతో పాటు వర్షాకాలంలో ఎదురయ్యే సమస్యలు కూడా తగ్గుతాయని తెలిపారు. చేపడుతున్న అభివృద్ధి పనులు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. పనులు ప్రారంభించిన తర్వాత నిర్ణీత సమయంలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. పనుల విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని అన్నారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చూపేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం నుంచి అవసరమైన నిధులను తీసుకురావడంతో పాటు స్థానికంగా ఉన్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తా మని స్పష్టం చేశారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు వేగం పెరిగిందని ఎమ్మెల్యే నాయిని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనపై ఉద్రిక్తత

- అంబేద్కర్ కూడలిలో నినాదలతో హైటెన్షన్
- ఇరుపార్టీల శ్రేణులను కట్టడి చేసేందుకు భారీగా పోలీసుల మోహరింపు



**భూపాలపల్లి, సెప్టెంబర్ 6 (సింగిడి):** వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనపై భూపాలపల్లి జిల్లా కేంద్రంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పట్టణంలోని అంబేద్కర్ సెంటర్లో రెండు పార్టీల నాయకులు ఒకేసారి కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రయత్నించడంతో పరిస్థితి ఉధృక్తంగా మారింది. ఇరు వర్గాలను నియంత్రించడం పోలీసులకు సవాల్‌గా మారింది. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్రప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి అయిన సందర్భంగా శనివారం భూపాలపల్లి పట్టణంలో విజయోత్సవ ర్యాలీ కార్యక్రమం నిర్వహించారు. అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బిఆర్ఎస్ పార్టీలు పోటాపోటీ కార్యక్రమాలు నిర్వహించడంతో అంబెద్కర్ కూడలి వద్ద తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇరు పార్టీల శ్రేణులు పెద్ద ఎత్తున తరలి రావడంతో పోలీసులు భారీగా మొహరించి పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నించారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, డిసిసి అధ్యక్షుడు బొట్టు కర్ణాకర్ నేతృత్వంలో హనుమాన్ టెంపుల్ నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు భారీ ర్యాలీ, రోడ్ షో నిర్వహించారు. వెయ్యి రోజుల ప్రజా పాలన విజయయోత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ ఉదయం 10 నుంచి అనుమతి తీసుకుంది. అదే సమయంలో కాంగ్రెస్ పాలనను నిరసిస్తూ వెయ్యి రోజుల దగా పాలన పేరుతో అంబేద్కర్ సెంటర్లో నిరసన చేపట్టేందుకు బి ఆర్ఎస్ ఉదయం 11 గంటలకు అనుమతి తీసుకుంది. అయితే కాంగ్రెస్ కార్యక్రమం నిర్ణీత సమయానికి ప్రారంభం కావకపోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. మధ్యాహ్నం 1.30 గంటలు దాటిన అంబేద్కర్ సెంటర్లో కాంగ్రెస్ సభ కొనసాగు తుండడంతో బిఆర్ఎస్ శ్రేణుల్లో అసహనం పెరిగింది. ఊర్వశి థియేటర్ వద్ద వేచి ఉన్న బిఆర్ఎస్ కార్యకర్తలు ఒక్కసారిగా రోడ్డుపైకి వచ్చి కాంగ్రెస్ కాన్వాయ్ వెనకవైపు చేరుకోవడంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది. పోలీసులు ఇరువర్గాలను నచ్చజెప్పేందుకు ప్రయత్నించినప్పటికీ కాంగ్రెస్, బిఆర్ఎస్ శ్రేణులు పోటాపోటీగా నినాదాలు చేయడంతో అంబేద్కర్ కూడలి దద్దరిల్లింది. ఇరు ఇరు పార్టీల కార్యకర్తలు కరిగిపోయి ఒకరు నినాదాలు చేసుకోవడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కొద్దిసేపు అంబేద్కర్ సెంటర్ పరిసరాల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది కాంగ్రెస్, బిఆర్ఎస్ కార్యక్రమాలకు ఒకే ప్రాంతంలో, దాదాపు ఒకే సమయంలో అనుమతులు ఇవ్వడం, ఒక పార్టీ కార్యక్రమం ఆలస్యం కావడం పరిస్థితిని మరింత సంక్లిష్టంగా మార్చిందనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి.

# స్కాలర్‌షిప్‌లు ఏవీ?.. జాబ్ క్యాలెండర్ ఏదీ?

- ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు వెంటనే విడుదల చేయాలి
- జాబ్ క్యాలెండర్ ప్రకటించాలి.. ఉచిత స్కూటీలు అందించాలి




**కోదాడ, సెప్టెంబర్ 6 (సింగిడి):** విద్యార్థులు, నిరుద్యోగ యువత ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో శనివారం కోదాడ పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. బీఆర్ఎస్వీ పట్టణ అధ్యక్షుడు బొర్రా వంశీ నాని ఆధ్వర్యంలో రంగా థియేటర్ చౌరస్తా నుంచి ర్యాలీ చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులతో కలిసి ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు మాట్లాడుతూ.. నెలల తరబడి పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఫీజులు చెల్లించలేక పేద, మధ్య తరగతి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. విద్యార్థినులకు హామీ ఇచ్చిన ఉచిత స్కూటీలను పంపిణీ చేయాలని కోరారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు వెంటనే జాబ్ క్యాలెండర్ ప్రకటించి ఖాళీల భర్తీ ప్రక్రియ చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం విద్యార్థుల సమస్యలను పరిష్కరించకుండా నిర్లక్ష్యం చేస్తే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ చీమ నరేష్, నాయకులు బత్తుల ఉపేందర్, బీఆర్ఎస్వీ నాయకులు నవీన్, సతీష్, వితేష్, వంశీ, బన్నీ, సాయి తదితరులతో పాటు వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థినీ, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## విద్యార్థులు, యువత సమస్యలను పరిష్కరించాలి



- ఫీజు రీయింబర్స్‌మెంట్, జాబ్ క్యాలెండర్ అమలు చేయాలి
- మాజీ ఎమ్మెల్యే భాస్కర్ రావు

**మిర్యాలగూడ సెప్టెంబర్ 6 (సింగిడి):** విద్యార్థులు యువత సమస్యలు పరిష్కరించాలి, ఫీజు రియంబర్స్మెంట్ వెంటనే విడుదల చేయాలని మాజీ శాసనసభ్యులు నల్లమోతు భాస్కరరావు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ప్రభుత్వ వెయ్యి రోజుల విఫల పాలనకు నిరసనగా పార్టీ విద్యార్థులు, యువత సమస్యలపై నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని నాయకులు విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీ మేరకు జాబ్ క్యాలెండర్‌ను అమలు చేయాలని, యూత్ డిక్లరేషన్‌లో పేర్కొన్న హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పార్టీ కార్యాలయం నుంచి భారీగా బైక్ ర్యాలీగా బయలుదేరి గాంధీ బొమ్మ, బస్టాండ్ మీదుగా రౌండ్ వరకు యువత ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువనాయకులు నల్లమోతు సిద్ధార్థ,ఎండి. యూసుఫ్, ఎడవెల్లి శ్రీనివాస రెడ్డి, అన్నబీమోజు నాగార్జున చారి,ధనావత్ చిట్టిబాబు నాయక్, బైరం సంపత్, ఎండి. ఇలియాస్ ఖాన్,అంగోతు హతిరాం నాయక్, కుందూరు వీరకోటి రెడ్డి, మగ్దుంపాషా,ఎండి. మాజీద్,రాష్ట్ర కార్యదర్శి ఎండి. షోయబ్, యర్రమళ్ళ దినేష్, వీకే ప్రసాద్, పార్టీ నాయకులు, విద్యార్థి నాయకులు, యువజన నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జీవో నెంబర్ 97 వెంటనే రద్దు చేయాలి



**మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి**

**నలగొండ ప్రతినిధి సెప్టెంబర్ 6 (సింగిడి):** జీవో నెంబర్ 97 ను వెంటనే రద్దు చేయాలని నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ వెయ్యి రోజుల విఫల పాలనపై.. నాల్గవ రోజు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో.. సుమారు 5000 మంది విద్యార్థులతో ప్రభుత్వ నాగార్జున డిగ్రీ కళాశాల నుండి గడియారం సెంటర్ వరకు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. జెడ్పి మాజీ చైర్మన్ బండా నరేందర్ రెడ్డి, పట్టభద్రుల నియోజకవర్గ కాంటెస్ట్ క్యాండిడేట్ ఏనుగుల రాకేష్ రెడ్డి విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు వారు మాట్లాడుతూ... వెయ్యి రోజుల కాంగ్రెస్ విఫల పాలనలో... విద్యార్థులు నిరుద్యోగుల పట్ల అమానుషంగా ప్రవర్తిస్తుందని.. ఫ్లీజ్ రియంబర్స్మెంట్ పూర్తిగా విఫ్లమైందని విమర్శించారు. కటికం సత్తయ్య గౌడ్ ఏఎంసీ మాజీ చైర్మన్ చీరా పంకజ్ యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షులు రేగట్టె మల్లికార్జున రెడ్డి, నల్గొండ మున్సిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి, బక్క పిచ్చయ్య,మైనం శ్రీనివాస్, నగర పార్టీ అధ్యక్షులు భువనగిరి దేవేందర్, నల్గొండ మండల పార్టీ అధ్యక్షులు దేప వెంకటరెడ్డి, కార్పొరేటర్లు మారగోని భవాని గణేష్ పెరిక యాదయ్య పేర్ల మల్లీశ్వరి అశోక్ రత్నగిరి తారకమ్మ శ్రీనివాస్ కొండూరు దీపికా ప్రవీణ్ రెడ్డి బాణావత్ దీప్లా దొడ్డి రమేష్ స్వాతి రాజశేఖర్, మాజీ కౌన్సిలర్, మిర్యాల యాదగిరి, రావుల శ్రీనివాస్ రెడ్డి, కొండూరు సత్యనారాయణ, పెరిక కరణ్ జయరాజ్, దండంపెల్లి సత్తయ్య, గుండెబోయిన జంగయ్య కందుల లక్ష్మయ్య బడ్డుల శంకర్ కోట్ల జయపాల్ రెడ్డి తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దాలి



**సూర్యాపేట ప్రతినిధి సెప్టెంబర్ 6 (సింగిడి):** ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దాలని శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వి. వెంకటేశులు అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని జ్యోతి ప్రజల్వన చేసి సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ రాధాకృష్ణన్ జీవితాన్ని ప్రతి విద్యార్థి ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. డాక్టర్ రాధాకృష్ణన్ అంతర్జాతీయ ఖ్యాతి గడించిన మేధావి ప్రసిద్ధ రచయిత దార్శనికుడు అయినప్పటికీ అన్నిటికంటే తన ఉపాధ్యాయ పాత్ర గొప్పదని రాధాకృష్ణన్ భావించేవారని గుర్తు చేశారు. జాతి నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని భవిష్యత్తు తరాలలో విద్యార్థులను తీర్చి దిద్దే బాధ్యత గురువులందరిపై ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎన్ఎస్ఆర్ శాస్త్రి ఎగ్జామినేషన్ కోఆర్డినేటర్ శ్రీమతి కవిత ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ సింగ్ మధు ఎన్ సి సి కోఆర్డినేటర్ నాగు నాయక్ అధ్యాపకులు సుఖేష్ మధు చక్రవర్తి అశోక్ నరేష్ ఉపేందర్ నళిని మాధవి దివ్య ఇతరులు పాల్గొన్నారు.

## కుడా చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించిన గుండు సుదారాణి



**హన్మకొండ, సెప్టెంబర్ 6 (సింగిడి):** కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) చైర్‌పర్సన్‌గా గుండు సుధారాణి హనుమకొండలోని కుడా కార్యాలయంలో పదవీ బాధ్యతలు చేపట్టారు. కార్యక్రమానికి వరంగల్ పశ్చిమ, స్టేషన్ ఘన్ పూర్, పరకాల ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కడియం శ్రీహరి, రేవూరి ప్రకాష్ రెడ్డి, కుడా వైస్ చైర్మన్ హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, తదితరులు హాజరయ్యారు. బాధ్యతలు స్వీకరించిన గుండు సుధారాణి కి ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్ పుష్పగుచ్ఛాలు, పూల మొక్కలను అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. కుడా చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం గుండు సుదారాణి మాట్లాడుతూ తనకు ఈ బాధ్యతలు అప్పగించినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి,మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులకు ఆమె కృతజ్ఞతలు తెలియజేశారు. కుడా పరిధిలో పట్టణాభివృద్ధి, మౌలిక వసతుల కల్పన, ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించడంపై ప్రత్యేక దృష్టి సారిస్తామని ఆమె స్పష్టం చేశారు. ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి కోసం ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కుడా డీసీపీ అజిత్ రెడ్డి, ఈఈ భీమ్ రావు సుధారాణికి అభినందనలు తెలియజేశారు..



## రాత్రుళ్లు నిద్రపట్టక

# ఇబ్బంది పడుతున్నారా..?

**నేటి ఆధునిక జీవనశైలిలో పని ఒత్తిడి, మానసిక ఆందోళనల వల్ల రాత్రివేళల్లో సరైన నిద్ర లేక బాధపడేవారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. మంచంపై పడుకున్నప్పటికీ గంటల తరబడి నిద్రపట్టక కళ్లు మూసుకుని అటుఇటూ దొర్లుతుంటారు. మీరు కూడా ఇలాంటి సమస్యతోనే బాధపడుతున్నారా? అయితే మీకు మిలిటరీ స్లీప్ మెథడ్ ఎంతో సహాయపడుతుంది. కేవలం 120 సెకన్లలో అంటే 2 నిమిషాల్లో ప్రశాంతమైన, గాఢమైన నిద్రలోకి జారుకోవడానికి ఈ విధానం ఎంతగానో తోడ్పడుతుంది. అసలు ఏమిటి మిలిటరీ స్లీప్ మెథడ్..?**

**మిలిటరీ స్లీప్ మెథడ్ అంటే ఏమిటి..?**

అమెరికన్ ట్రాక్ అండ్ ఫీల్డ్ కోచ్ లాయిడ్ బడ్ వింటర్ రాసిన రిలాక్స్ అండ్ విన్: ఛాంపియన్‌షిప్ పెర్ఫార్మెన్స్ పుస్తకంలో ఈ సాంకేతికత గురించి ప్రస్తావించారు. రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో ప్రతికూల పరిస్థితుల్లో కూడా అమెరికన్ నేవీ పైలట్లు త్వరగా నిద్రపోయి, చురుగ్గా పనిచేసేందుకు ఈ విధానాన్ని రూపొందించారు. 6 వారాల పాటు క్రమం తప్పకుండా సాధన చేయడం ద్వారా 96శాతం మందిలో ఇది విజయవంతమైన ఫలితాలను ఇచ్చింది.

**ఈ పద్ధతిని ఎలా పాటించాలి?**

కళ్లు మూసుకుని, ముఖం, కళ్లు, గడ్డం, దవడలు, నోటి కండరాలలోని ఒత్తిడిని పూర్తిగా వదిలేయండి. భుజాలను సాధ్యమైనంత కిందకు దించి, చేతులను శరీరం ఇరువైపులా ప్రశాంతంగా ఉంచండి. ఇప్పుడు నెమ్మదిగా ఊపిరి పీల్చుకుంటూ, ఛాతీ భాగం ప్రశాంతంగా మారేలా గాలిని బయటకు వదలండి. కాళ్లను విశ్రాంతిగా ఉంచండి అంటే.. తొడలు, పిక్కలు, పాదాల వరకు ప్రశాంతంగా ఉంచి, ఒత్తిడి లేకుండా చూడండి.

చివరిగా 10 సెకన్ల పాటు మీ మనస్సులో ఎటువంటి ఆలోచనలు లేకుండా ప్రశాంతమైన వాతావరణాన్ని పచ్చని కొండలు, ప్రశాంతమైన సముద్ర తీరం వంటివి ఊహించుకోండి. ముఖం, భుజాలు, చేతులు, కాళ్లలోని కండరాలను క్రమపద్ధతిలో సడలించి ప్రశాంతంగా ఉంచాలి. నెమ్మదిగా, దీర్ఘంగా శ్వాస తీసుకుంటూ శరీరంలోని ఒత్తిడిని పూర్తిగా బయటకు పంపాలి. 10 సెకన్ల పాటు మనస్సులో ఎటువంటి ప్రతికూల ఆలోచనలు లేకుండా ప్రశాంతమైన ప్రకృతి దృశ్యాలను ఊహించుకోవాలి.

ముఖ్యమైన విషయం ఏంటంటే.. ఈ పద్ధతి వెంటనే ఒకే రోజులో ఫలితాన్ని ఇవ్వకపోవచ్చు. కనీసం 6 వారాల పాటు సాధన చేస్తేనే మెదడు, శరీరం దీనికి అలవాటు పడతాయి. అలాగే నిద్రపోయే సమయానికి కనీసం అర్ధగంట ముందు మొబైల్, ల్యాప్‌టాప్‌లకు దూరంగా ఉండటం మంచిది.

# 29 నుంచి మణిపాల్ హెల్త్ రూ.9275 కోట్ల ఐపీఓ

**దిల్లీ: ప్రముఖ హాస్పిటల్ చైన్ మణిపాల్ హెల్త్ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ తొలి పబ్లిక్ ఇష్యూకు సిద్ధమైంది. మార్కెట్ నుంచి రూ. 9,275 కోట్లు సమీకరించే లక్ష్యంతో జులై 29 నుంచి సబ్‌స్క్రిప్షన్ ప్రారంభం కానుంది. ఒక్కో షేరు ధరల శ్రేణిని రూ. 560–590గా నిర్ణయించింది. రూ. 77,600 కోట్ల మార్కెట్ విలువతో ఐపీఓకు వస్తోంది. ఫ్రెష్ ఇష్యూ, ఆఫర్ ఫర్ సేల్ రూపంలో నిధుల సమీకరణ చేపట్టనుంది.**




ఫ్రెష్ ఇష్యూ ద్వారా రూ. 8000 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లను కంపెనీ జారీ చేయనుంది. ఆఫర్ ఫర్ సేల్ రూపంలో 2.16 కోట్ల ఈక్విటీ షేర్లను ప్రస్తుత వాటాదారులు విక్రయించనున్నారు. ప్రమోటర్లు అయిన ఇంపీరియస్ హెల్త్‌కేర్ ఇన్వెస్ట్‌మెంట్స్, మణిపాల్ ఎడ్యుకేషన్ అండ్ మెడికల్ గ్రూప్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌తో పాటు టీపీజీ ఎస్‌జీ మ్యాగజైన్, సెవెంటీ సెకండ్ ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీ, అమ్మర్ ఎస్‌డీఎన్ బీహెచ్‌డీ, నోవో హోల్డింగ్స్ ఇన్వెస్ట్ ఆసియా, ఫోనిక్స్ బేర్ ఇన్వెస్ట్‌మెంట్స్ తమ వాటాలు విక్రయించనున్నాయి.

**ఐపీఓ నిధులు వీటికే**

ఫ్రెష్ ఇష్యూ ద్వారా సమీకరించిన నిధుల్లో రూ. 5,378 కోట్లను అనుబంధ సంస్థ మణిపాల్ హాస్పిటల్స్ ప్రైవేట్ లిమిటెడ్ రుణాలు తిరిగి/ముందస్తు చెల్లింపులకు వినియోగించనున్నారు. మరో అనుబంధ సంస్థ సహ్యాద్రి హాస్పిటల్స్‌లో మైనారిటీ వాటాల కొనుగోలుకు రూ. 574 కోట్లు వెచ్చించనున్నారు. మిగిలిన మొత్తాన్ని సాధారణ కార్పొరేట్ అవసరాలకు వినియోగించనున్నారు. జులై 28న యాంకర్ ఇన్వెస్టర్లకు బిడ్డింగ్ తెరుచుకోనుంది. జులై 31న సబ్‌స్క్రిప్షన్ ముగియనుంది. క్యూఐబీలకు 75 శాతం, నాన్‌ఇన్‌స్టిట్యూషనల్ ఇన్వెస్టర్లకు 15 శాతం, రిటైల్ ఇన్వెస్టర్లకు 10 శాతం షేర్లను రిజర్వ్ చేశారు. ఉద్యోగులకు రూ. 15 కోట్ల విలువైన షేర్లను కేటాయించారు. ఒక్కో షేరుపై రూ. 56 డిస్కౌంట్ అందిస్తున్నారు. ఇన్వెస్టర్లు కనీసం 25 ఈక్విటీ షేర్లకు బిడ్లు దాఖలు చేయాలి.


**దేశవ్యాప్తంగా హాస్పిటల్స్**

మణిపాల్ హెల్త్ సంస్థకు దేశవ్యాప్తంగా మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్ ఉన్నాయి. 2025 సెప్టెంబర్ 30 నాటికి దేశవ్యాప్తంగా 38 హాస్పిటల్స్ (ప్రొఫార్మా బేసిస్‌లో 48) కలిగి ఉంది. 10,761 లైసెన్స్‌డ్ బెడ్లు నిర్వహిస్తోంది. 14 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో సేవలందిస్తోంది. 2025 నవంబర్‌లో 49వ హాస్పిటల్‌ను బెంగళూరులో ప్రారంభించింది. 2025 సెప్టెంబర్ 30 నాటికి తొలి ఆరు నెలల్లో రూ. 4,713 కోట్ల ఆదాయాన్ని, రూ. 571.8 కోట్ల లాభాన్ని నమోదు చేసింది. ఆగస్టు 5న బీఎస్ఈ, ఎన్ఎస్ఈలో షేర్లు లిస్ట్ కానున్నాయి. ప్రస్తుతం గ్రే మార్కెట్‌లో 4 శాతం ప్రీమియం పలుకుతోంది.




విమానయాన సేవల్లోకి అదానీ గ్రూప్..

## స్పష్టతనిచ్చిన సంస్థ




**దిల్లీ:** గౌతమ్ అదానీ నేతృత్వంలోని అదానీ గ్రూప్ కొత్తగా విమానయాన సేవల్లోకి ప్రవేశించేందుకు సన్నాహాలు చేస్తోందని వార్తలు వస్తున్నాయి. వీటిపై ఆ సంస్థ క్లారిటీ ఇచ్చింది. ఆ కథనాలు, మార్కెట్ ఊహాగానాలు నిరాధారమైనవని, అవాస్తమని అదానీ గ్రూప్ ప్రకటించింది. విమానయాన రంగంలోకి ప్రవేశించడానికి అదానీ ఎంటర్‌ప్రైజెస్ ఏ ప్రతిపాదననూ పరిశీలించడం లేదని స్పష్టతనిచ్చింది.



ముంబయి, దిల్లీ వంటి అత్యధిక రద్దీ ఉండే విమానాశ్రయాలను నిర్వహిస్తున్న కంపెనీలు, షెడ్యూల్డ్ విమానయాన సంస్థలో 10 శాతానికి పైగా వాటా కలిగి ఉండకూడదనే నిబంధనను సవరించాలని ప్రభుత్వాన్ని 'అదానీ గ్రూప్' కోరిందని జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. మరోవైపు ఆత్మనిర్భర్ భారత్ కార్యక్రమానికి మద్దతుగా భారత వైమానిక దళం (ఐఏఎఫ్) కోసం.. తదుపరి తరం ఏరియల్ ఎర్లీ వార్నింగ్ అండ్ కంట్రోల్ (AEW&C-MKII) వ్యవస్థను అభివృద్ధి చేయడానికి కేంద్రం చర్యలు తీసుకుంటోంది. ఇందుకోసం అదానీ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్.. డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (DRDO)ఓ ఒప్పందంపై సంతకం చేశాయి. ఈ నేపథ్యంలోనే అదానీ గ్రూప్ విమానయాన రంగంలోకి ఎంట్రీ ఇవ్వనున్నట్లు ఊహాగానాలు వచ్చాయి

# వృద్ధి భయాలు.. ఐదో రోజూ నష్టాల్లో సూచీలు



**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీల నష్టాల పరంపర కొనసాగుతోంది. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలతో పెరిగిన చమురు ధరల కారణంగా ద్రవ్యోల్బణం భయాలు నెలకొన్నాయి. వృద్ధికి విఘాతం కలుగుతుందన్న ఆందోళనలు దీనికి తోడయ్యాయి. దీంతో వరుసగా ఐదో రోజూ సూచీలు నష్టాలు చవిచూశాయి. ముఖ్యంగా నిఫ్టీ ఆటో, రియాల్టీ, ఫార్మా స్టాక్స్ అమ్మకాల ఒత్తిడి ఎదుర్కొన్నాయి. నిఫ్టీ 23,800 దిగువకు చేరింది.

సెన్సెక్స్ ఉదయం 75,708.19 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 76,391.39) వద్ద నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా నష్టాల్లోనే కొనసాగింది. ఇంట్రాడేలో 75,474.43 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 331.62 పాయింట్ల నష్టంతో 76,059.77 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 102.15 పాయింట్ల నష్టంతో 23,767.45 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 96.57గా ఉంది.

సెన్సెక్స్ 30 సూచీలో ఎటర్నల్, మహీంద్రా అండ్ మహీంద్రా, బజాజ్ ఫైనాన్స్, భారతీ ఎయిర్‌టెల్, ఏషియన్ పెయింట్స్ షేర్లు ప్రధానంగా నష్టాలు చవిచూశాయి. హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఐటీసీ, యాక్సిస్ బ్యాంక్, టీసీఎస్, ట్రెంట్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 97.68 డాలర్ల వద్ద ఉండగా.. బంగారం ఔన్సు 4059 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

# మారెళ్లపాడు ఎత్తిపోతల నుంచి
# తుమ్మలచెరువుకు నీరు

### ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ట్రయల్ రన్ ప్రారంభం
### ఎడమ కాలువ ద్వారా తుమ్మలచెరువుకు నీటి ప్రవాహం
### ఇంకా ప్రారంభం కాని రైట్ కెనాల్ పనులు.. పూర్తయితే మరింత ఆయకట్టుకు సాగునీరు



**అశ్వాపురం, (సింగిడి):** అశ్వాపురం మండల రైతులకు సాగునీటి భరోసా కల్పించే దిశగా మారెళ్లపాడు ఎత్తిపోతల పథకంలో కీలక ముందడుగు పడింది. మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం ద్వారా లిలితుమ్మలచెరువుకు నీటిని విడుదల చేసి ట్రయల్ రన్‌ను పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రారంభించారు. దీంతో సీతారామ ప్రాజెక్టు జలాలు మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం ద్వారా తుమ్మలచెరువుకు చేరాయి. నీటి ప్రవాహాన్ని అధికారులు, ఇంజనీరింగ్ సిబ్బంది పరిశీలించారు.

**సీతారామ ప్రాజెక్టుతో అనుసంధానం**

మారెళ్లపాడు ఎత్తిపోతల పథకాన్ని సీతారామ ప్రాజెక్టు ప్రధాన కాలువకు అనుసంధానంగా నిర్మించారు. సీతారామ ప్రాజెక్టు నుంచి వచ్చే నీటిని మారెళ్లపాడు వద్ద పంపింగ్ చేసి ఎత్తైన ప్రాంతాలకు తరలించి, అక్కడి నుంచి కాలువల ద్వారా చెరువులు, ఆయకట్టులకు నీటిని అందించే విధంగా పథకాన్ని రూపొందించారు. మారెళ్లపాడు వద్ద ఏర్పాటు చేసిన పంప్‌హౌస్ ద్వారా సీతారామ ప్రాజెక్టు మెయిన్ కెనాల్ నుంచి నీటిని ఎత్తిపోసి డెలివరీ సిస్టర్న్‌కు తరలించి, అక్కడి నుంచి కాలువల వ్యవస్థ ద్వారా సాగునీటిని అందించేలా ఏర్పాట్లు చేశారు.

**2023లో శంకుస్థాపన**

మారెళ్లపాడు ఎత్తిపోతల పథకానికి 2023 జనవరి 29న శంకుస్థాపనలిలి జరిగింది. అశ్వాపురం మండలంలోని సాగుభూములకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో ఈ పథకాన్ని చేపట్టారు. పథకం నిర్మాణానికి తొలుత సుమారు రూ. 300 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదనలు రూపొందించారు. పలు కారణాలతో పనులు కొంతకాలం మందకొడిగా సాగాయి. భూసేకరణ, కాలువల నిర్మాణం, పంప్‌హౌస్, పైపులైన్లు, విద్యుత్, ఇతర సాంకేతిక పనులను దశలవారీగా చేపట్టారు. ప్రస్తుతం తుమ్మలచెరువుకు నీటిని తరలించే స్థాయికి పథకం చేరుకుంది.

**ఎడమ కాలువ ద్వారా తుమ్మలచెరువుకు నీరు**

మారెళ్లపాడు ఎత్తిపోతల పథకంలోని లిలిఎడమ కాలువ ద్వారా తుమ్మలచెరువుకు నీటిని తరలించేలాలిలి ఏర్పాట్లు చేశారు. తాజాగా నీటిని విడుదల చేసి ట్రయల్ రన్ నిర్వహించారు. తుమ్మలచెరువుకు నీరు చేరడంతో చెరువు కింద ఉన్న ఆయకట్టు రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. చెరువులో నీటి నిల్వ పెరగడంతో సాగునీటితో పాటు భూగర్భ జలాలు కూడా మెరుగుపడే అవకాశం ఉందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

**రైట్ కెనాల్ పనులు ఎప్పుడు?**

మారెళ్లపాడు ఎత్తిపోతల పథకంలో రైట్ కెనాల్ కూడా కీలకమైన భాగం. అయితే రైట్ కెనాల్ పనులు ఇంకా ప్రారంభం కాలేదు. దీంతో ఆ కాలువ పరిధిలోని ఆయకట్టుకు ప్రస్తుతం ఈ పథకం ద్వారా సాగునీరు అందే పరిస్థితి లేదు. రైట్ కెనాల్ పనులను త్వరగా ప్రారంభించి పూర్తిచేస్తే దాని పరిధిలోని మరిన్ని గ్రామాలు, చెరువులు, ఆయకట్టుకు సాగునీరు అందే అవకాశం ఉంటుంది. దీంతో మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం పూర్తి స్థాయిలో రైతులకు అందుబాటులోకి రావాలంటే రైట్ కెనాల్ పనులు కూడా చేపట్టాల్సిన అవసరం ఉంది.



**రైతుల సంక్షేమమే లక్ష్యంగా..**

రైతుల సంక్షేమం, సాగునీటి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు. తుమ్మలచెరువుకు నీటిని విడుదల చేయడం ద్వారా ఎన్నాళ్లుగానో ఎదురుచూస్తున్న సాగునీటి సమస్యకు పరిష్కారం లభించే దిశగా అడుగు పడిందని రైతులు పేర్కొన్నారు. మారెళ్లపాడు ఎత్తిపోతల పథకాన్ని పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకువచ్చి, మిగిలిన కాలువల పనులను పూర్తి చేస్తే మండలంలో



సాగు విస్తీర్ణం పెరగడంతో పాటు రైతుల ఆర్థిక పరిస్థితి మెరుగుపడే అవకాశం ఉందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

**అధికారుల పర్యవేక్షణలో ట్రయల్ రన్**

ట్రయల్ రన్ సందర్భంగా ఇరిగేషన్ శాఖ అధికారులు, ఇంజనీరింగ్ సిబ్బంది నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. పథకంలోని సాంకేతిక అంశాలు, నీటి సరఫరా విధానం, కాలువల ద్వారా నీటి ప్రవాహాన్ని అధికారులు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఎస్ఈ మహేశ్వరరావు, ఈఈ వెంకటేశ్వరరావు, డీఈ శ్రీనివాసరావు, మెగా కంపెనీ ఇంజనీర్లు, ఆపరేషన్ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఓరుగంటి రమేష్‌బాబు, సీనియర్ నాయకులు గాదె కేశవరెడ్డి, ఊసా అనిల్‌కుమార్, వేములపల్లి రమేష్, బరాజు సంపత్, తుక్కాని మధుసూదన్‌రెడ్డి, సర్పంచ్‌లు సబ్కా పిచ్చయ్య, మచ్చా నరసింహారావు, కుంజా జాను, ఎట్టి నరేష్, ఉప సర్పంచ్‌లు శీలం సంజీవరెడ్డి, హర్షా నాయక్ పాల్గొన్నారు. నాయకులు కాకా రాములు, మట్టా వీరభద్రారెడ్డి, సోడే వెంకటేశ్వర్లు, బేతం రామకృష్ణ, కందిమల్ల రామిరెడ్డి, రణబోతుల రామిరెడ్డి, తెల్లం వీరభద్రం, తెల్లం నాగరాజు, సామకూరి వెంకన్న, బొబ్బాల నగేష్, దారపు శ్రీను, రావులపల్లి నరసింహారావు, గొల్లపల్లి నరేష్, వేముల విజయ్, వంగూరి మధు, కమ్మాల వెంకన్న, ఆవుల వెంకన్న, రావులపల్లి చిన్న నరసింహారావులిలి తదితరులు పాల్గొన్నారు.

---

## మడివేలు మాచయ్య సీతాలమ్మ, ఈదమ్మలకు
## భక్తిశ్రద్ధలతో బోనం సమర్పించిన రజకులు



**మునుగోడు, (సింగిడి):** తెలంగాణ సంస్కృతికి ప్రతీక గా నిలిచి బోనాల ఉత్సవాలలో భాగంగా, రజక సంఘాల ఆధ్వర్యంలో మడివేలు మాచయ్య సీతలమ్మ, ఈదమ్మ బోనాల పండుగ అత్యంత వైభవంగా భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారు. ఈ సందర్భంగా, ఆదివారం మునుగోడు నియోజకవర్గం, మర్రిగూడ మండలం, దామెర భీమనపల్లి గ్రామంలో, రజక సంఘం ఆధ్వర్యంలో, రజకుల కుల దైవమైన మడివేలు మాచయ్య సీతాలమ్మ, ఈదమ్మ బోనాల పండుగ ఘనంగా, అంగరంగ వైభవంగా నిర్వహించారు. మడివేలు మాచయ్య (రజక కుల ఆరాధ్య దైవం. శివ భక్తుడు) గ్రామ దేవతలైన సీతాలమ్మ, ఈదమ్మలకు రజకులు ఉదయం నుంచే ప్రత్యేక అభిషేకాలు పూజలు నిర్వహించారు. మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి, పసుపు కుంకుమ, వేపాకులతో అలంకరించిన కొత్త కుండలో (బోనం) అన్నం, పాలు, బెల్లంతో, వండిన నైవేద్యాలను డప్పు సప్పులతో ఊరేగింపు గా తీసుకెళ్లి అమ్మవార్లకు బోనం నైవేద్యంగా సమర్పించారు. భక్తుల సందడితో ఊరిలో పండుగ వాతావరణం ఏర్పడింది. రజకులంతా భక్తిశ్రద్ధలతో అమ్మవారిని పూజించి వర్షాలు సకాలంలో పడాలని పాడిపంటలు సమృద్ధిగా పండాలని, పిల్ల జెల్లా సంతోషంగా ఉండాలని, ప్రతి కుటుంబం సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు. రజక కుల సంఘం పెద్దలు మాట్లాడుతూ, మన కులదైవమైన మడివేలు మాచయ్య సీతాలమ్మ, ఈదమ్మ చల్లని చూపులు మన గ్రామం పై ఉండాలని, గ్రామాన్ని అన్ని విధాలుగా అందుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో, రజక కుల పెద్దలు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

---

## ఘనంగా రేగళ్ల కృష్ణ ప్రసాద్-అలేఖ్య నిశ్చితార్థం
### ఆశీర్వదించిన నామ, పువ్వాడ, వద్దిరాజు



**తల్లాడ, (సింగిడి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సుజాతనగర్‌లోని శ్రీ దుర్గా కన్వెన్షన్‌లో బీఆర్ఎస్ యువజన నాయకుడు, ఎలైట్ ఎస్ 2 ఫార్మా మేనేజింగ్ డైరెక్టర్ రేగళ్ల కృష్ణప్రసాద్--అలేఖ్య నిశ్చితార్థ వేడుక ఆదివారం ఘనంగా జరిగింది. ఈ వేడుకకు బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, రాజ్యసభ సభ్యుడు, బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నాయకుడు వద్దిరాజు రవిచంద్ర హాజరై కాబోయే వధూవరులను ఆశీర్వదించారు. నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలియజేసి వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు.

---

## రాగం సత్యం మృతికి బీఆర్ఎస్ నాయకుల శ్రద్ధాంజలి



**అశ్వాపురం, (సింగిడి):** అశ్వాపురం మండలం మల్లెలమడుగు గ్రామపంచాయతీకి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు రాగం సత్యం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న అశ్వాపురం మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఆయన స్వగృహానికి వెళ్లి పార్థివదేహానికి బీఆర్ఎస్ పార్టీ జెండా కప్పి, పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించా రు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. రాగం సత్యం అంతిమయాత్రలో మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కోడి అమరేందర్ యాదవ్, సీనియర్ నాయకుడు కాసరబాధ శ్రీను పాల్గొని పాడె మోసి రాగం సత్యానికి తుది నివాళులర్పించారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటని నాయకులు పేర్కొన్నారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మర్రి మల్లారెడ్డి, సీనియర్ నాయకులు మాజీ ఎంపీపీ కొల్లు మల్లారెడ్డి, జాలె రామకృష్ణారెడ్డి, సూదిరెడ్డి గోపిరెడ్డి, ఉప సర్పంచ్‌లు గాడిద మహేష్, దేవనబోయిన మహేష్, మాజీ ఉప సర్పంచ్‌లు చావ వీరరాఘవులు, కమటం ఎల్లయ్య, మామిడి శ్రీనివాస్, తూము వీరరాఘవులు, కోడి గంగన్న, గుంపెన శ్రీనివాస్, కాదరబాధ రాములు, వార్డు సభ్యులు పడితం పూజిత, ఉడతల నాగమణి, కత్రం కీర్తి, కడారి సుజాత, మంగళగిరి రామకృష్ణ, మందా హుస్సేన్, పున్నారావు తదితరులు పాల్గొని రాగం సత్యానికి శ్రద్ధాంజలి ఘటించారు.

---

## ట్రైబల్ వర్కింగ్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ జిల్లా నూతన కమిటీ ఎన్నిక
### అధ్యక్షుడిగా మాళోత్ అశోక్, ప్రధాన కార్యదర్శిగా భూక్య రాము ఏకగ్రీవ ఎన్నిక

**చుంచుపల్లి, (సింగిడి):** తెలంగాణ ట్రైబల్ వర్కింగ్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నూతన కమిటీని ఆదివారం కొత్తగూడెం విద్యానగర్ కాలనీలోని శ్రీరామ ఫంక్షన్ హాల్‌లో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు బానోత్ వీరు నాయక్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, వైరా ఎమ్మెల్యే మాళోత్ రాందాస్ నాయక్, కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్‌పాషా, మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ లాల్‌సింగ్, టీయూడబ్ల్యూజే ట్రేడ్ యూనియన్--143 రాష్ట్ర ట్రెజరర్ యోగినంద, టీటీడబ్ల్యూజేఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవినాయక్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా మాళోత్ అశోక్, ప్రధాన కార్యదర్శిగా భూక్య రాము, ట్రెజరర్‌గా బానోత్ రాందాస్, వైస్ ప్రెసిడెంట్‌గా బదావత్ దశరథ్ ఎన్నికయ్యారు. గౌరవ సలహాదారులుగా హాలావత్ రామారావు, కార్యదర్శులుగా అజ్మీరా సురేష్, బాదావత్ కోటేష్, ధరావత్ వెంకట్, బానోత్ రాము, కొర్రా శివరాం, సభ్యులుగా కృష్ణ, రంజిత్, నాగేశ్వరరావు, సైదులు, రఘురాం, బి.సురేష్, బి.రాంచందర్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమం కోసం తన వంతు కృషి చేస్తానన్నారు. తాను కూడా గతంలో జర్నలిస్టుగా పనిచేసినందున జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలపై పూర్తి అవగాహన ఉందన్నారు. జిల్లా కేంద్రంలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇప్పించేందుకు ప్రభుత్వంతో చర్చిస్తున్నట్లు తెలిపారు. వైరా ఎమ్మెల్యే మాళోత్ రాందాస్ నాయక్ మాట్లాడుతూ జర్నలిస్టులు ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధులుగా పనిచేస్తున్నారని అన్నారు. ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడంలో మీడియా కీలక పాత్ర పోషిస్తోందని, జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మేయర్ మూడ్ గణేష్ మాట్లాడుతూ జర్నలిస్టులు తమ హక్కుల సాధన కోసం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. క్లిష్ట పరిస్థితుల్లోనూ జర్నలిస్టులు వృత్తి నిబద్ధతతో విధులు నిర్వహిస్తున్నారని కొనియాడారు. జర్నలిస్టులకు తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్‌పాషా మాట్లాడుతూ గిరిజనుల హక్కుల సాధనలో గిరిజన జర్నలిస్టులు కీలక పాత్ర పోషించాలని అన్నారు. గిరిజన ప్రాంతాల్లో ఉన్న సమస్యలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు వారికి దక్కాల్సిన హక్కుల కోసం కృషి చేయాలని సూచించారు. గిరిజనుల పోరాటాలకు సీపీఐ సంపూర్ణ మద్దతు ఇస్తుందని తెలిపారు. మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ లాల్‌సింగ్ మాట్లాడుతూ సమాజ అభివృద్ధిలో జర్నలిస్టుల



పాత్ర ఎంతో కీలకమన్నారు. జర్నలిస్టుల ద్వారా అనేక ప్రజా సమస్యలు వెలుగులోకి వచ్చి పరిష్కారమయ్యాయని తెలిపారు. మారుతున్న మీడియా పరిస్థితుల్లో జర్నలిస్టులకు తగిన గుర్తింపు, గౌరవం లభించాల్సిన అవసరం ఉందన్నారు. టీయూడబ్ల్యూజే ట్రేడ్ యూనియన్--143 రాష్ట్ర ట్రెజరర్ యోగినంద, టీటీడబ్ల్యూజేఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవినాయక్ మాట్లాడుతూ జర్నలిస్టులు తమ హక్కుల సాధన కోసం ఐక్యంగా పోరాటాలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. నూతన కమిటీకి అభినందనలు తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమం, ఇళ్ల స్థలాలు, హెల్త్ కార్డుల జారీ, ప్రత్యేక సంక్షేమ నిధి వంటి అంశాలపై ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. ఐజేయూ జిల్లా అధ్యక్షుడు బి.వెంకటరత్నం మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమమే తమ ప్రధాన లక్ష్యమన్నారు. జర్నలిస్టుల గౌరవానికి భంగం కలిగితే ఐక్య ఉద్యమాలు చేపడతామని తెలిపారు. టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు కల్లోజి శ్రీనివాస్ మాట్లాడుతూ జర్నలిస్టుల మహాబలం ఐకమత్యమేనని అన్నారు. యూనియన్లకు అతీతంగా జర్నలిస్టుల సంక్షేమం కోసం పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. జర్నలిజం సమాజానికి నాలుగో స్థంభమని, ఆ స్థంభాన్ని బలోపేతం చేయడానికి ప్రతి జర్నలిస్టు బాధ్యతగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో టీటీడబ్ల్యూజేఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చందు, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ తేజావత్ వినోద్, మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు మనోహర్, కార్పొరేషన్ 6వ డివిజన్ కార్పొరేటర్ డాక్టర్ బి.ఎస్.రావు, టీజీటీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్, బంజారా సంఘాల జేఏసీ గౌరవాధ్యక్షుడు రమేష్ రాథోడ్, వైస్ చైర్మన్ ధరావత్ కాన్షీరామ్, యంగ్ ఇండియన్ బ్లడ్ డోనర్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు జె.బి.బాలు, సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు ధరావత్ సురేష్, కాంగ్రెస్ నాయకులు అర్జున్‌రావు, గుగులోత్ కృష్ణతో పాటు పలువురు జర్నలిస్టులు, నాయకులు పాల్గొన్నారు.

---




## సిరిపురం మేజర్‌కు తక్షణమే నీరందించాలి
### అధికారులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాలు

**తల్లాడ, (సింగిడి):** సిరిపురం మేజర్‌కు తక్షణమే సాగునీరు అందిం చాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. ఆదివారం తల్లాడ మండలం అంజనాపురం గ్రామంలో ఓ ప్రైవేట్ కార్యక్రమానికి మంత్రి హాజరయ్యారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావును పలు గ్రామాలకు చెందిన రైతులు కలిసి తమ సాగునీటి సమస్యను వివరించారు. సిరిపురం మేజర్‌కు నీరు అందక పంటలు ఎండిపోతున్నాయని, వెంటనే సాగునీరు విడుదల చేసి పంటలను కాపాడాలని రైతులు మంత్రిని కోరారు. రైతుల సమస్యపై మంత్రి తక్షణమే స్పందించారు. అక్కడి నుంచే సంబంధిత అధికారులకు ఫోన్ చేసి సిరిపురం మేజర్‌కు ఎక్కడెక్కడ నీరు అందడం లేదో క్షేత్రస్థాయిలో పరిశీలించి, వెంటనే సాగునీరు విడుదల చేయాలని ఆదేశించారు. రైతులకు ఇబ్బందులు కలిగేలా నిర్లక్ష్యం చేస్తే బాధ్యులపై చర్యలు తప్పవని అధికారులను మంత్రి హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ మండల నాయకులు జక్కంపూడి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

---

## రైతుల చిరకాల కల సాకారం..
### పాయం వెంకటేశ్వర్లుకు ప్రత్యేక అభినందనలు



**అశ్వాపురం, (సింగిడి):** మారేళ్లపాడు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ట్రయల్ రన్ విజయవంతం చేసి గోదావరి జలాలను తుమ్మల చెరువుకు విడుదల చేయడంపై అశ్వాపురం మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు లిలితూము వీర రాఘవులు హర్షం వ్యక్తం చేశా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ.. ఎమ్మెల్యే పాయం వెంకటే శ్వర్లు కృషి, పట్టుదలతో తుమ్మలచెరువు రైతుల ఎన్నో ఏళ్ల కల నెరవేరిందన్నారు. గోదావరి జలాలతో తుమ్మలచెరువును నింపడం ద్వారా రైతులకు మూడు పంటలు పండించే అవకాశం కలిగిందని పేర్కొన్నారు. ఐదు గ్రామ పంచాయతీల రైతాంగం తరఫున ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు, అభినందనలు తెలిపారు.

---

## విద్యానగర్‌లో పారిశుధ్య పనులకు శ్రీకారం
### కలుపు మొక్కల నివారణకు మందు పిచికారీ.. పరిశుభ్రతపై పంచాయతీ ప్రత్యేక దృష్టి

**చుంచుపల్లి, (సింగిడి):** విద్యా నగర్ కాలనీ గ్రామపంచాయతీ పరిధిలో పారి శుధ్యాన్ని మెరుగుపరిచేందుకు గ్రామపంచా యతీ ఆధ్వర్యంలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రామంలోని పలు ప్రాంతాల్లో పెరిగిన కలుపు మొక్కలు, పిచ్చి మొక్కలను తొలగించడంతో పాటు వాటి నివారణకు కలుపు మందును పిచికారీ చేయించారు. గ్రామపంచాయతీ పరిధిలో పరిశుభ్రతను కాపాడటం, ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించడం లక్ష్యంగా పారిశుధ్య కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు పంచాయతీ ప్రతినిధులు తెలిపారు. రోడ్ల పక్కన, ఖాళీ ప్రదేశాల్లో, పంచాయతీ పరిసరాల్లో పెరిగిన కలుపు మొక్కల కారణంగా అపరిశుభ్ర వాతావరణం ఏర్పడకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా సిబ్బందితో కలుపు మొక్కల నివారణకు మందు పిచికారీ చేయించారు. గ్రామంలో ఎక్కడైనా చెత్త పేరుకుపోయినా, మురుగు నీరు నిలిచినా, కలుపు మొక్కలు అధికంగా పెరిగినా వెంటనే పంచాయతీ సిబ్బంది దృష్టికి తీసుకురావాలని ప్రజలకు సూచించారు. పారిశుధ్య నిర్వహణలో ప్రజలు కూడా పంచాయతీకి సహకరించాలని కోరారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా దోమలు, ఇతర కీటకాల వ్యాప్తిని నివారించడంతో పాటు ప్రజారోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ సర్పంచ్ శాంతిశ్రీ ప్రసాద్ మాట్లాడుతూ.. గ్రామ పరిశుభ్రతకు పంచాయతీ ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన పారిశుధ్య చర్యలను నిరంతరం చేపడతామని తెలిపారు. గ్రామంలోని ప్రధాన రహదారులు, కాలనీ పరిసరాలు, ఖాళీ ప్రదేశాలను పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు కొనసాగిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వార్డు మెంబర్ నాగమణి, ఈఓ వెంకటేశ్వర్లు పాల్గొని పారిశుధ్య పనులను పరిశీలించారు. పంచాయతీ సిబ్బందికి పలు సూచనలు చేస్తూ గ్రామంలో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. గ్రామంలో పరిశుభ్రమైన వాతావరణం ఉండేలా అవసరమైన చర్యలను నిరంతరం కొనసాగిస్తామని వారు పేర్కొన్నారు.

---

## భూ వివాదంలో మహిళపై దాడి
### పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు



**చుంచుపల్లి, (సింగిడి):** చుంచుపల్లి తండాలో భూ వివాదం నేపథ్యంలో తనపై, తన భర్తపై దాడి జరిగిందంటూ మాలోత్ మౌనిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. తనను కొట్టి, కొరికడంతో గాయాలయ్యా యని, భర్తపై కూడా దాడి చేసి బెదిరిం చినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదుపై ఎస్సై ఇరువర్గాల వాదనలు విన్న అనంతరం మహిళపై జరిగిన దాడి ఆరోపణలపై విచారణ చేపట్టి, వర్తించే చట్టపరమైన సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేసి న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్లు బాధితులు తెలిపారు. ఘటనకు సంబంధించిన సీసీ కెమెరా దృశ్యాలను పరిశీలించి వాస్తవాలను నిర్ధారించాలని వారు కోరారు. కాగా, ఫిర్యాదులోని ఆరోపణలు దర్యాప్తులో నిర్ధారణ కావాల్సి ఉంది.

---



## జవ్వాజి లక్ష్మీనారాయణకు ఘన నివాళి

**గుండాల, (సింగిడి):** ఆదివాసీ హక్కుల కోసం జీవితాంతం పోరాడిన జవ్వాజి లక్ష్మీనారాయణ 8వ వర్ధంతి కార్యక్రమాన్ని ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ ఆధ్వర్యంలో గుండాల మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన తుడుందెబ్బ జాతీయ ప్రధాన కార్యదర్శి రమణాల లక్ష్మయ్య మాట్లాడుతూ, ఆదివాసీ హక్కులు, పరిరక్షణ కోసం జవ్వాజి లక్ష్మీనారాయణ ఎన్నో ఉద్యమాలు నిర్వహించారని గుర్తుచేశారు. 1/70 చట్టం, అటవీ హక్కుల చట్టం (ఎఫ్ఆర్ఏ) అమలుతో పాటు ఆదివాసీ రైతులు, ఉద్యోగులు, విద్యార్థులు, మహిళల హక్కుల కోసం ఆయన నిరంతరం పోరాడారని తెలిపారు. జవ్వాజి లక్ష్మీనారాయణ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు నిజమైన నివాళి అని, ఆదివాసీ హక్కుల పరిరక్షణ కోసం తుడుందెబ్బ ఉద్యమాన్ని మరింత బలోపేతం చేస్తుందని రమణాల లక్ష్మయ్య అన్నారు. కార్యక్రమంలో తుడుందెబ్బ రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



# ఎంఈఎఫ్ రాష్ట్ర పగ్గాలు ప్రభాకర్ మాదిగకు..

## రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియామకం.. 33 జిల్లాల్లో సమాఖ్య బలోపేతానికి కృషి..

**నాగర్ కర్నూల్, (సింగిడి)::** తెలంగాణ మాదిగ ఉద్యోగుల సమాఖ్య (MEF) రాష్ట్ర ప్రధాన కార్య దర్శిగా దేవరపాగ ప్రభాకర్ మాదిగను నియమించారు. M-RPS జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు, మందకృష్ణ మాదిగ, వీజుఖీ జాతీయ నాయకత్వం కలిసి దేవరపాగ ప్రభాకర్ మాదిగకు ఈ బాధ్యతలు అప్పగించింది.
వీ-ఙాా అవిర్భావం నుంచి కార్యకర్తగా..దేవరపాగ ప్రభాకర్ మాదిగ MRPS ఆవిర్భావం నుంచి ఒక వీ-ఙాా కార్యకర్తగా పనిచేస్తున్నారు. ఉద్యోగం వచ్చిన తర్వాత నాగర్ కర్నూల్ జిల్లా నుంచి ఐదు పర్యాయాలు వీజుఖీ జిల్లా అధ్యక్షునిగా సమర్థవంతంగా కొనసాగుతూ జాతి ప్రయోజనాల కోసం మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు బాధ్యతగా పనిచేశారు. MEFను జిల్లాలో బలోపేతం చేయడంతో పాటు మాదిగ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఆయన చేసిన కృషిని గుర్తించిన జాతీయ నాయకత్వం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాధ్యతలను అప్పగించింది.



**నియామకంపై జిల్లా నాయకుల హర్షం...**
దేవరపాగ ప్రభాకర్ మాదిగ నియామకం పట్ల నాగర్ కర్నూల్ జిల్లా MEFనాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. నాగర్ కర్నూల్‌లో MEFను బలోపేతం చేయడంలో, కొత్తగా ఉద్యోగాలు పొందిన జాతి బిడ్డలను గౌరవించడంలో ప్రభాకర్ మాదిగ చేసిన సేవలను వారు కొనియాడారు. రాష్ట్ర స్థాయిలో ఆయనకు మరింత బాధ్యతలు అప్పగించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.
**ఇది పదవి కాదు.. బాధ్యత మరింత పెరిగింది..**
తన నియామకంపై దేవరపాగ ప్రభాకర్ మాదిగ మాట్లాడుతూ.. "ఇది నాకు పదవి కాదు, నాపై బాధ్యత మరింత పెరిగింది. నాపై అపారమైన నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించిన మందకృష్ణ మాదిగ అన్న గారికి, వీజుఖీ జాతీయ నాయకత్వానికి శిరస్సు వంచి కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను" అని అన్నారు. మరింత ఉత్సాహంతో రాష్ట్రంలోని 33 జిల్లాల్లో మాదిగ ఉద్యోగుల సమస్యలు, సర్వీస్ సమస్యలు, ప్రమోషన్లు, రిజర్వేషన్ అమలుపై ప్రభుత్వానికి మెమోరాండం ఇచ్చి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. అలాగే ఖాళీ పోస్టుల భర్తీ కోసం, మాదిగల ఆత్మగౌరవ పోరాటం కోసం నిరంతరం పనిచేస్తానని స్పష్టం చేశారు.నాపై పెట్టిన నమ్మకాన్ని నిలబెడతాను. అన్న ఇచ్చిన ఏ టాస్క్ అయినా ప్రాణం పెట్టి చేస్తాను. జాతి కోసం చివరి శ్వాస వరకు పనిచేస్తానుఅని దేవరపాగ ప్రభాకర్ మాదిగ తెలిపారు.

# జర్మనీ టెక్నాలజీ తో ప్రజలకు స్వచ్ఛమైన తాగు నీరు

**కల్వకుర్తి(సింగిడి):**వెల్దండ మండలం లోనీ గుండాల గ్రామంలో తాగునీటి నిల్వ ట్యాంకులను శాస్త్రీయ పద్ధతిలో పరిశుభ్రపరిచి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన, నాణ్యమైన తాగునీరు అందించాలనే ఉద్దేశంతో ఈ ప్రత్యేక పరిశుభ్రత కార్యక్రమాన్ని చేపట్టారు. సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి సహకారంతో అందుబాటులోకి తీసుకువచ్చిన జర్మన్ సాంకేతికతతో కూడిన ప్రత్యేక యంత్రాల సహాయంతో గ్రామాల్లోని తాగునీటి నిల్వ ట్యాంకులను శాస్త్రీయ పద్ధతిలో శుభ్రపరుస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.ట్యాంకుల్లో కొంతకాలంగా పేరుకుపోయిన మురికి, వ్యర్థాలు, ఇతర అవశేషాలను ప్రత్యేక యంత్రాల ద్వారా తొలగించి ట్యాంకులను పరిశుభ్రంగా




మార్చారు. అనంతరం ప్రజలకు తాగు నీరు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టారు. తాగు నీటి నిల్వ ట్యాంకుల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వడం వల్ల నీటి నాణ్యత మెరుగుపడటంతో పాటు ప్రజల ఆరోగ్యానికి కూడా మేలు జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. గ్రామాల్లో తాగునీటి ట్యాంకు లను క్రమం తప్పకుండా శుభ్రపరచడం ద్వారా నీటి కాలుష్యాన్ని నివారించవచ్చుని, ప్రజలకు పరిశుభ్రమైన తాగునీటిని అందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని వారు పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో సర్పంచ్ శిరీష వెంకటయ్య, ఉప సర్పంచ్ , కృష్ణ,మరియు వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు చేపట్టిన ఈ కార్యక్రమంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. తాగునీటి ట్యాంకుల పరిశుభ్రతను నిరంతరం కొనసాగించాలని గ్రామస్తులు కోరారు.

# మానవ హక్కుల పరిరక్షణే లక్ష్యం

ఘనంగా హెచ్ఆర్‌సీసీఐ
9వ వసంత వేడుకలు
రోగులకు కేక్, పండ్ల పంపిణీ..
సేవలను అభినందించిన ప్రముఖ
న్యూరో వైద్యనిపుణులు డా. మురళీకృష్ణ





**కొత్తగూడెం,(సింగిడి):** మానవ హక్కుల పరిరక్షణతో పాటు నిరుపేదలు, బాధితులకు అండగా నిలుస్తూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న మానవ హక్కుల పరిరక్షణ సంస్థ (హెచ్ఆర్‌సీసీఐ) ఎనిమిదేళ్ల ప్రస్థానాన్ని పూర్తి చేసుకుని తొమ్మిదో వసంతంలోకి అడుగుపెట్టింది. ఈ సందర్భంగా మేరీ రోజ్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో కొత్తగూడెంలో వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. హెచ్ఆర్‌సీసీఐ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు సింగమాల వెంకట రమణయ్య ఆదేశాల మేరకు, రాష్ట్ర చైర్మన్ డాక్టర్ కిషోర్ కుమార్ సూచనలతో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ మోట పోతుల బాబురావు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పర్య టించారు. ఈ సందర్భంగా మేరీ రోజ్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్, హెచ్ఆర్‌సీసీఐ జిల్లా నూతన కార్యదర్శి బూర్గుల కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో కొత్తగూడెం పట్టణంలోని ప్రముఖ మురళీకృష్ణ న్యూరో స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యనిపుణులు డాక్టర్ మురళీకృష్ణ ఆసుపత్రిలో 9వ వసంత వేడుకలు నిర్వహించారు. డాక్టర్ మురళీకృష్ణ చేతుల మీదుగా కేక్ కట్ చేసి సంస్థ సభ్యులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు.
**రోగులకు పండ్లు, కేక్ పంపిణీ**
వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు కేక్, పండ్లను పంపిణీ చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా హెచ్ఆర్‌సీసీఐ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మైసా గోవర్ధన్, మైనార్టీ విభాగం సభ్యులు, హెచ్ఆర్‌సీసీఐ బాధ్యులు పాషా తదితరులు ఈ సేవా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ మురళీకృష్ణ మాట్లాడుతూ మేరీ రోజ్ చారిటబుల్ ట్రస్టు, హెచ్ఆర్‌సీసీఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను అభినందించారు. మానవతా దృక్పథంతో సమాజంలోని బాధితులు, నిరుపేదలకు అండగా నిలవడం అభినందనీయమన్నారు. భవిష్యత్తు లోనూ సంస్థ మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు చేరువ కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఆర్‌సీసీఐ బాధ్యులు, సభ్యులు, మేరీ రోజ్ చారిటబుల్ ట్రస్టు ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

నేడు సిపిఐ కార్యాలయంలో

## రౌండ్ టేబుల్ సమావేశం

గిరిజన యువతీ శిరీష హత్యోదంపై కార్యాచరణ
రాజకీయ, ప్రజా, సామాజిక సంఘాల ఆధ్వర్యంలో సమావేశం
సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా



**కొత్తగూడెం, (సింగిడి):** ములకలపల్లి మండలం, చౌటిగూడెం గ్రామానికి చెందిన గిరిజన యువతీ హత్యా, అత్యాచారం ఘటనపై రాజకీయ, ప్రజా, సామాజిక సంఘాల ఆధ్వర్యం లో సోమవారం ఉదయం 11.30గంటలకు సిపిఐ జిల్లా కార్యాలయం 'శేషగిరి భవన్'లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా తెలిపారు. ఆదివారం అయన మాట్లాడుతూ ఉన్నత చదువులు చదివి ఉద్యోగం చేస్తూ కుటుంబానికి అండగా నిలుస్తున్న ఆదివాసీ బిడ్డను అత్యంత కిరాతకంగా హతమార్చడం హేయమైన చర్య అని, మానవ సమాజానికే మచ్చ అని, ఇలాంటి దారుణాలపై ప్రతి ఒక్కరు స్పందించాలన్నారు. రౌండ్ టేబుల్ సమావేశంలో కార్యాచరణ రూపొందించి బాధితురాలి కుటుంబానికి న్యాయం జరిగేవరకు ఉద్యమాలు చేపడతామని స్పష్టం చేశారు. రాజకీయపక్షాలు, ప్రజా, సామాజిక సంఘాలు అధికసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సాబీర్ పాషా కోరారు.

## గత పది సంవత్సరాలలో బిఆర్ఎస్ ప్రభుత్వం చేసింది శూన్యం

వెంకటాపూర్ ఉపసర్పంచ్ నంబూ ఇస్తారి



**కల్వకుర్తి(సింగిడి):** కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను విస్మరించి ప్రతిపక్ష పార్టీగా ఉన్న బిఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పాలనపై విమర్శలు చేస్తూ ర్యాలీలు, నిరసనలు చేపట్టడం హాస్యాస్పదంగా ఉందని కాంగ్రెస్ పార్టీ నాయకుడు, వెంకటాపూర్ గ్రామ ఉపసర్పంచ్ నంబూ ఇస్తారి విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందని ఆయన తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు రైతు భరోసా, రైతులకు క్వింటాల్‌కు రూ. 500 బోనస్, ఇందిరమ్మ ఇండ్ల వంటి పలు సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను మరిచి బిఆర్ఎస్ నాయకులు రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని ఇస్తారి మండిపడ్డారు. బిఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు పాలనలో ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయకపోవడంతోనే ప్రజలు ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పారని అన్నారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని, ప్రభుత్వంపై నిరాధార ఆరోపణలు చేయడం మానుకోవాలని ఆయన బిఆర్ఎస్ నాయకులకు హెచ్చరించారు.

## కెసిఆర్ రాజీనామా చేయాల్సిందే


డిసిసి అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్



**మహబూబ్‌నగర్ బ్యూరో (సింగిడి):** అసెంబ్లీ రాకుండా ప్రజలను మోసం చేస్తూ గెస్ట్ హౌస్ కి పరిమితమైన మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాల్సిందే అని మహబూబ్ నగర్ డిసిసి అధ్యక్షులు డిమాండ్ చేశారు. కెసిఆర్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద నిర్వహించిన భారీ మహా ధర్నా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ మహా ధర్నాలో ఆయనతోపాటు డీసీసీ అధ్యక్షులు శివసేన రెడ్డి , రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏపీ మిథున్ రెడ్డి ,డీసీసీ ప్రధాన కార్యదర్శి సత్తూర్ చంద్రకుమార్ గౌడ్ ,టీపీసీసీ అధికార ప్రతినిధి జహీర్ అక్తర్ పాల్గొని కాంగ్రెస్ శ్రేణులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంజీవ్ ముదిరాజ్ మాట్లాడుతూ, వెయ్యి రోజులుగా ఎమ్మెల్యేగా కొనసాగుతూ జీతం తీసుకుంటున్నప్పటికీ ప్రతిపక్ష నేతగా ప్రజల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించకుండా, అసెంబ్లీ సమావేశాలకు హాజరు కాకుండా ఉన్న కేసీఆర్ తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రజలకు జవాబుదారీతనం ఎంతో ముఖ్యమని, ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధులు అసెంబ్లీకి హాజరై ప్రజల సమస్యలపై పోరాడాల్సిన బాధ్యత ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ మహా ధర్నాలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజా ప్రతినిధులు, డీసీసీ నాయకులు, వివిధ విభాగాల అధ్యక్షులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ నిరసనను వ్యక్తం చేశారు.

## మృతురాలి కుటుంబానికి అండగా

బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు జూపల్లి భాస్కర్‌రావు



**కల్వకుర్తి (సింగిడి):** చారకొండ మండలంలోని గోకారం గ్రామపంచాయతీకి చెందిన పంజుగుల రాములమ్మ ఇటీవల ఆకస్మికంగా మృతి చెందడంతో ఆమె కుటుంబాన్ని బీఆర్ఎస్ నేత, సింగిల్ విండో చైర్మన్ బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు జూపల్లి భాస్కర్ రావు పరామర్శించారు. రాములమ్మ మృతి విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సింగిల్ విండో ఛైర్మన్ జూపల్లి భాస్కర్ రావు మృతురాలి కుటుంబానికి సానుభూతి తెలుపుతూ 5,000 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పంజుగుల పరుశరాములు, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు కొండల్ రషీద్, గజ్జె శ్రీను, వెంకటయ్య, శ్రీను, రవి, అల్లాజీ, మహేష్, కరుణాకర్, వెంకటరెడ్డి, లక్ష్మారెడ్డి, సాదిక్ అలీ, మల్లయ్య తదితర బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే జూపల్లి భాస్కర్ రావు యువసేన అధ్యక్షుడు ఎండీ సిరాజ్, యువసేన సభ్యులు ప్రశాంత్ తదితరులు పాల్గొని కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

ఫీజు బకాయిలు విడుదల కోసం

## చలో ఇందిరా పార్క్ ధర్నా విజయవంతం చేయాలి

బీజేపీ జిల్లా అధ్యక్షులు దినేష్ పటేల్ కులాచారి

**నిజామాబాద్ ప్రతినిధి,(సింగిడి)::**విద్యార్థుల పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం నిర్వహించనున్న చలో ఇందిరా పార్క్ ధర్నా కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షులు దినేష్ పటేల్ కులాచారి పిలుపు నిచ్చారు. ఆదివారం బీజేపీ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు దినేష్ పటేల్ కులాచారి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యా ర్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం బీజేపీ నిరంతరం పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో వేలాది మంది విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల కోసం ఎదురుచూస్తున్నారని, బకాయిలు చెల్లించకపోవడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పెండింగ్‌లో ఉన్న మొత్తం ఫీజు బకాయిలను విడుదల చేయాలని



డిమాండ్ చేశారు. విద్యార్థుల హక్కుల కోసం బీజేపీ ఎప్పటికీ పోరాటం చేస్తుందని, ప్రభుత్వం సమస్యను పరిష్కరించే వరకు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని దినేష్ కులాచారి హెచ్చరించారు. ధర్నాకు బీజేపీ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, తల్లిదండ్రులు అధిక సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. అలాగేనిజాంసాగర్ కింది భాగంలోని చివరి ఆయకట్టు వరకు సాగునీరు విడుదల చేయాలని బీజేపీ రైతుల తరపున డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ సమస్యపై జిల్లా ఇంచార్జి కలెక్టర్‌ను కలిసి రైతుల సమస్యను వివరించడం జరిగిందన్నారు. అదే విధంగా మంత్రి ఉత్తమ్ కుమార్ కి కూడా లేఖ రాయడం జరిగిందన్నారు. బీజేపీ విజ్ఞప్తికి స్పందించి నీరు విడుదల చేసినందుకు జిల్లా ఇంచార్జి కలెక్టర్‌కు ధన్యవాదాలు తెలిపారు. కొంత మంది ఒక్క లెటర్ రాయకున్నా మేము చేశామని గొప్పలు చెప్పుకుంటున్నారని అది వారి విజ్ఞతకే వదిలేస్తున్నామని అన్నారు. ప్రస్తుతం నిజాంసాగర్ కింది భాగానికి నీరు విడుదల చేసినందున రేపు చేపట్టాల్సిన నిరాహార దీక్షను వాయిదా వేసుకుంటున్నామని తెలిపారు. భవిష్యత్తులో మళ్లీ రైతులకు సాగునీటి విషయంలో ఇబ్బందులు ఎదురైతే రైతుల పక్షాన బీజేపీ పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర బీజేవైఎం కో కోశాధికారి అమంద్ విజయ్ కృష్ణ మాట్లాడుతూ? విద్యార్థుల భవిష్యత్తు కోసం చేపడుతున్న రేపటి చలో ఇందిరా పార్క్ ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదల కోసం నిర్వహిస్తున్న ఈ పోరాటానికి జిల్లా నుంచి బీజేవైఎం నాయకులు, యువకులు, విద్యార్థులు అధిక సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. విద్యార్థుల హక్కుల కోసం యువమోర్చా ముందుండి పోరాడుతుందని, ప్రభుత్వం వెంటనే స్పందించి పెండింగ్ ఫీజు బకాయిలను విడుదల చేయాలని అమంద్ విజయ్ కృష్ణ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో జిల్లా ప్రధాన కార్యదర్శి పోతనకార్ లక్ష్మి నారాయణ, నాగోల్ల లక్ష్మి నారాయణ,మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు బిలోజి నాయక్, మోర్చా అధ్యక్షులు పురుషోత్తం, బీసీ మోర్చా అధ్యక్షులు బొబ్బిలి వేణు గోపాల్, కిసాన్ మోర్చా అధ్యక్షులు తిరుపతి రెడ్డి, కార్పొరేటర్లు బెల్లల్ శశాంక్, గిరిబాబు, అర్జున్ రెడ్డి, రాకేష్, రాజ్ గణేష్, ఆనంద్, ఆనంద్ రావు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కి వ్యతిరేకంగా

## అన్ని గ్రామాల్లో నిరసనలు





**కల్వకుర్తి (సింగిడి):** తలకొండ పల్లి మండలంలోని అన్ని గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ ఆధ్వర్యంలో మండలంలోని అన్ని గ్రామంలో కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల పాలనకు నిరసనగా బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మిషన్ భగీరథ రాష్ట్ర మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడంలో విఫలమైందని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ పార్టీకి శుద్ధ శుద్ధి ఉంటే ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని ఆయన అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో 420 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని రంగాల్లో విఫలమైందని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ తిరిగి అధికారంలోకి వస్తుందని, కల్వకుర్తి నియోజకవర్గంలో బీఆర్ఎస్ జెండా ఎగురుతుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రజల కోసం, ప్రజల పక్షాన బీఆర్ఎస్ పార్టీ పోరాటం నిరంతరం కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో,గ్రామాల సర్పంచులు ఉపసర్పంచ్ లు,వార్డు సభ్యులు బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు, యువకులు, గ్రామస్థులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# హామీలు ఘనం.. వార్డుల్లో వసతులు శూన్యం!

వార్డుల్లో చెత్త కుప్పలు..
కాంగ్రెస్ పాలనలో పారిశుద్ధ్యం గల్లంతు
వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలన..
వార్డుల్లో సమస్యల తిష్ట:
మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్
కాపు సీతాలక్ష్మి ధ్వజం
15వ డివిజన్‌లో బీఆర్ఎస్ నాయకులు,
కార్యకర్తలతో కలిసి పర్యటన..
బ్లీచింగ్ పౌడర్ కూడా
చల్లకపోవడంపై ఆగ్రహం

**కొత్తగూడెం, (సింగిడి):** కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలో పారిశుద్ధ్య పరిస్థితులు అధ్వానంగా మారాయని, వార్డుల్లో కనీస మౌలిక వసతులు కూడా కల్పించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్, బీఆర్ఎస్ నాయకురాలు కాపు సీతాలక్ష్మి ధ్వజమెత్తారు. వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనలో ప్రజా సమస్యలు పరిష్కారానికి నోచుకోకపోగా, వర్షాకాలం లో సీజనల్ వ్యాధుల నియంత్రణకు కూడా సరైన చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు.
**15వ డివిజన్‌లో క్షేత్రస్థాయి పరిశీలన**
ఆదివారం 15వ డివిజన్‌లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి కాపు సీతాలక్ష్మి పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులను కలిసి వార్డులో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పలు ప్రాంతాల్లో పేరుకుపోయిన చెత్త, పారిశుద్ధ్య లోపాలను పరిశీలించారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అధికారులు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వార్డుల్లో పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోయి దుర్వాసన వస్తోందని సీతాలక్ష్మి ఆరోపించారు. వర్షాలు కురుస్తున్న సమయంలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. దీంతో దోమలు, ఈగలు పెరిగి ప్రజలు అనారోగ్యానికి గురయ్యే పరిస్థితులు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు



చర్యలు చేపట్టాల్సిన సమయంలో కనీసం బ్లీచింగ్ పౌడర్ కూడా చల్లడం లేదని కాపు సీతాలక్ష్మి ఆగ్రహం వ్యక్తం చేశారు. పారిశుద్ధ్య పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ, ప్రజారోగ్య పరిరక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పారిశుద్ధ్య నిర్వహణ కోసం స్వచ్ఛ ట్రాలీలను ఏర్పాటు చేసి, ప్రతి ఇంటికీ డస్ట్‌బిన్లు పంపిణీ చేశామని ఆమె గుర్తుచేశారు. ప్రస్తుతం వాటిని సక్రమంగా వినియోగించకపోవడంతో చెత్త సేకరణ, పారిశుద్ధ్య నిర్వహణలో లోపాలు కనిపిస్తున్నాయని ఆరోపించారు. ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.
**ఆరు గ్యారంటీలు.. 420 హామీలు ఏమయ్యాయి?**
కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఆరు గ్యారంటీలు, 420 హామీలు ఇచ్చి ప్రజల మద్దతు పొందిందని, అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత వాటి అమలులో నిర్లక్ష్యం చూపుతోందని సీతాలక్ష్మి విమర్శించారు. మహిళలకు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని, ప్రతి మహిళకు రూ. 2,500 ఇస్తామన్న హామీ కూడా నెరవేర్చలేదని ఆరోపించారు. పెన్షన్ల పెంపుపై కూడా ప్రభుత్వం స్పష్టమైన చర్యలు తీసుకోలేదని అన్నారు. వార్డుల్లో పారిశుద్ధ్య పనులను వేగవంతం చేయడంతో పాటు తాగునీటి సమస్యను పరిష్కరించాలని, అవసరమైన ప్రాంతాల్లో వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కాపు సీతాలక్ష్మి డిమాండ్ చేశారు. వర్షాకాలం దృష్ట్యా మురుగు కాలువలను శుభ్రం చేసి, దోమల నివారణ చర్యలు చేపట్టాలని కోరారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని అధికారులు తక్షణమే స్పందించాలని అన్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు సమాన ప్రాధాన్యత ఇచ్చామని కాపు సీతాలక్ష్మి పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించి, వార్డుల్లో మౌలిక వసతులను మెరుగుపరచాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

అశ్వాపురం రైల్వే స్టేషన్ పరిధిలో

## ఘనంగా మెగా ప్లాంటేషన్

మొక్కల సంరక్షణకు గ్రామపంచాయతీ సహకారం



**అశ్వాపురం,(సింగిడి):**అశ్వాపురం రైల్వే స్టేషన్ పరిధిలో గ్రీన్ ప్లాంట్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రైల్వే ఉద్యోగులు కలిసి మెగా ప్లాంటేషన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 1,000 మొక్కలను నాటారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అశ్వాపురం గ్రామ సర్పంచ్ బానోత్ సదర్ లాల్, ఉప సర్పంచ్ తుల్లూరి ప్రకాశ్ రావు హాజరై మొక్కలు నాటారు. మొక్కలకు నీటి సౌకర్యం కల్పించేందుకు అశ్వాపురం గ్రామపంచాయతీ తరఫున 5,000 లీటర్ల సామర్థ్యం కలిగిన నీటి ట్యాంకర్‌ను అందించారు. నాటిన మొక్కలను సంరక్షించేందుకు గ్రామపంచాయతీ తరఫున సహకారం కొనసాగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ బానోత్ సదర్ లాల్ మాట్లాడుతూ.. రైల్వే ఉద్యోగులు గ్రీన్ ప్లాంట్ స్వచ్ఛంద సంస్థగా ఏర్పడి పర్యావరణ పరిరక్షణ కోసం చేపడుతున్న కార్యక్రమం అభినందనీయమన్నారు. మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఉప సర్పంచ్ తుల్లూరి ప్రకాశ్ రావు మాట్లాడుతూ.. అశ్వాపురం ప్రాంతంలో పచ్చదనం పెంపొందించేందుకు రైల్వే ఉద్యోగులు చేస్తున్న కృషిని అభినందించారు. ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఓ రాజేంద్రబాబు, ఏఐ పాషా, టీఐ రమ బ్లాక్, గ్రీన్ ప్లాంట్ సభ్యులు రమేష్, వేణు, రామ్మూర్తి, వారి కుటుంబ సభ్యులు, అశ్వాపురం రైల్వే స్టేషన్ మాస్టర్ గౌతమ్, మనీష్, గ్రామపంచాయతీ సిబ్బంది, రైల్వే ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# రేవంత్ రెడ్డి ప్రభుత్వం హామీల అమలులో విఫలం

మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాల
ఆధ్వర్యంలో భారీ ఆటో ర్యాలీ

**నిజామాబాద్ ప్రతినిధి (సింగిడి):** కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక పాలన, నెరవేర్చని హామీలకు నిరసనగా బిఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ పిలుపు మేరకు చేపట్టిన వారం రోజుల నిరసన కార్యక్రమాల్లో భాగంగా నిజామాబాద్ నగరంలో మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాల ఆధ్వర్యంలో భారీ ఆటో ర్యాలీ నిర్వహించారు. ఆదివారం నగరంలోని ప్రధాన వీధుల మీదుగా ఆటో కార్మికులతో కలిసి ఈ నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాల మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పాలన పూర్తిగా కుప్పకూలిందని, ప్రజా సమస్యలు తీవ్ర రూపం దాల్చాయని విమర్శించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇచ్చిన 6 గ్యారెంటీలు, 420



హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన నిర్ణయాల వల్ల ఆటో కార్మికుల ఉపాధి దెబ్బతిని, వారి పొట్ట కొట్టే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. సరైన ఆదాయం లేక నిత్యం తిండికి కూడా ఇబ్బందులు పడుతూ, పలువురు ఆటో కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడే దుస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఆటో సోదరులకు అండగా నిలవాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలు, నగరంలో పారిశుధ్య లోపాలపై బిఆర్ఎస్ నిరంతరం పోరాడుతోంద న్నారు. హైమది బజార్ లో నిర్మించిన నూతన మార్కెట్ దుర్గంధం తో అక్కడికి వెళ్లలేని పరిస్థితి నెలకొందన్నారు. ఇందులో భాగంగానే ఇప్పటికే మహిళల సమస్యలపై ధర్నా, బైక్ ర్యాలీలు నిర్వహించామని, నేడు ఆటో కార్మికులకు మద్దతుగా నేడు ర్యాలీ చేపట్టినట్లు తెలిపారు. నూతన ప్రభుత్వానికి ప్రజలు కొంత సమయం ఇవ్వాలనే ఉద్దేశంతోనే కేసీఆర్ వేచి చూశారని, కానీ 1000 రోజుల సమయం ఇచ్చినా కాంగ్రెస్ పాలనలో ఎలాంటి పురోగతి లేదన్నారు. తెలంగాణ ప్రజలకు న్యాయం చేసే నిజమైన తెలంగాణవాది కేసీఆర్ మాత్రమేనని, రాబోయే రోజుల్లో మళ్లీ బిఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయమని సర్వేలు కూడా స్పష్టం చేస్తున్నాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాల తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఆటో కార్మికులకు ఏడాదికి రూ. 12,000 ఇస్తామని హామీ ఇచ్చిందని, ఇప్పటివరకు ఆ డబ్బులు చెల్లించకపోవడంతో ఒక్కో ఆటో డ్రైవర్ కు రూ. 36,000 బాకీ పడిందని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే ఈ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే దిగివచ్చి ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చి వారిని ఆదుకోవాలని ఈ సందర్భంగా వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ దండు నీతు కిరణ్ శేఖర్, నగర అధ్యక్షులు సిర్ప రాజు, మాజీ నుడా చైర్మెన్ ప్రభాకర్ రెడ్డి, నాయకులు సుజిత్ సింగ్, నవీద్ ఇక్బాల్, చింతకాయల రాజు తదితరులు పాల్గొన్నారు.

# కొండగట్టులో మాస్టర్‌ప్లాన్ రూపకల్పనకు ప్రక్రియ కొనసాగుతున్నది



## చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

**మల్యాల,(సింగిడి):**కొండగట్టు దేవస్థాన అభి వృద్ధికి సంబంధించిన మాస్టర్ ప్లాన్ రూపకల్పనకు సర్వేలు ఇతర సాంకేతిక పరిపాలన ప్రక్రియ కొనసాగుతున్నాయని మాస్టర్ ప్లాన్ కు సంబంధించిన పనులను త్వరిత గతిన పూర్తి చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి త్వరగా అమల్లోకి వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని స్థానిక చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తెలిపారు. ఆదివారం దేవస్థానం పరిధిలో నూతన వాహన పూజ షెడ్డు దాదాపు 50 లక్షల వ్యాయామంతో నిర్మించే షెడ్డు కు ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. అటవీ శాఖ, దేవస్థాన, భూములపై ఎమ్మెల్యే ప్రస్తావిస్తూ అటవీ శాఖకు సంబంధించిన 180 ఎకరాలు భూమి దేవస్థానం కు బదిలీ చేస్తూ దేవస్థానం పరిధి భూమి అటవీ శాఖకు బదిలీ చేయుటకు అవసరమైన ప్రక్రియ జరుగుతుందని. రూ: 35.19 కోట్ల తిరుమల తిరుపతి దేవస్థానం నిధులతో చేపట్టవలసిన అభివృద్ధి పనులకు సంబంధించిన కొన్ని సాంకేతిక సమస్యలు పరిష్కరించి త్వరలోనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభమయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని దేవస్థానం సుందరికరణ పనులు కొనసాగుతున్నాయని రానున్న జయంతికి కొన్ని మార్పులు చేపడుతామని 2028 వరకు పూర్తి స్థాయిలో సుందరి కరణ పనులు చేపడతామన్నారు. అంతేకా కుండా ఎంతోకాలంగా నిర్వహించా లని సంకల్పంతో ఉన్న శ్రీ స్వామివారి చందనోత్సవ మును 15- 11- 2026 నుండి 20 -11 -2026 వరకు 5 రోజులపాటు అత్యంత వైభవంగా సాంప్రదా య పద్ధతిలో నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమానికి చివరి రోజు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆహ్వానిస్తున్నామని తెలిపారు అంజన్న ఆశీస్సులతో నిరంతరం దేవస్థానం అభివృద్ధికి పాటుపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో అంజన రెడ్డి , సూపరిండెంట్ సునీల్, అర్చకులు చిరంజీవి, కపిందర్, స్థానిక సర్పంచ్ దారం ఆదిరెడ్డి, పార్టీ అధ్యక్షుడు బత్తిని శ్రీనివాస్ గౌడ్ ,తదితరులు పాల్గొన్నారు.



# మనీయం.. రమణీయం.. స్వామివారి రథోత్సవం

## గీతా మందిర్‌లో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

**జమ్మికుంట (సింగిడి):**రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి రథోత్సవం కమనీయంగా రమణీయంగా జరిగింది. జమ్మికుంట పట్టణంలోని భగవద్గీత జ్ఞాన మందిరంలో శ్రీ కృష్ణాష్టమి సందర్భంగా మూడు రోజులపాటు వేడుకలను ఆలయ నిర్వాహకులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేడుకలలో భాగంగా స్వామివారికి శ్రీకృష్ణ భవనం వాసుదేవ భవనం లక్ష్మీనరసింహ హవనం తోపాటు లక్ష పుష్పార్చనను వేద పండితుల మంత్ర చరణల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామివారికి 108 కళశాలచే అభిషేకం చేసి తులాభారం నిర్వహించారు. కృష్ణాష్టమి సందర్భంగా రుక్మిణి సత్యభామ సమేత



వేణుగోపాల స్వామిని పట్టు వస్త్రాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి రథం పై అధిరోహించారు. పట్టణ పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహిస్తూ ప్రముఖ నృత్యకారిణి శ్వేతా ఆధ్వర్యంలో చిన్నారులు భరతనా ట్యాలు, కోలాటాలు చేస్తూ సందడి చేశారు. పట్టణంలోని మహిళలు రథం పై ఉన్న స్వామి



వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో భగవద్గీత ఆలయ కమిటీ చైర్మన్ పురం వైకుంఠం, సభ్యులు పత్తి జనార్దన్ రెడ్డి ,చిదురాల శ్రీనివాస్, వ్యాసాని రాజశేఖర్, మురికి కొండయ్య తోపాటు తదితరులు పాల్గొన్నారు.

# ఆటో కార్మికులకు సంఘీభావంగా బీఆర్ఎస్ నేతల నిరసన

## ఇల్లందకుంట వీణవంకలో ఆటో కార్మికులకు అండగా నిలిచిన గులాబీ నేతలు





**జమ్మికుంట, (సింగిడి):** కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలన లో ప్రజలకు ఒరిగింది ఏమీ లేదని ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని టిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పిలుపుమేరకు నియోజకవర్గం లోని ఇల్లందకుంట వీణవంక మండల కేంద్రాలలో ఆటో డ్రైవర్లకు మద్దతుగా టిఆర్ఎస్ నేతలు సంఘీభావం తెలుపుతూ నిరసన వ్యక్తం చేశారు. వీణవంక మండల కేంద్రంలో మాజీ ఎంపీపీ ముసిపట్ల రేణుక తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో టిఆర్ఎస్ నేతలు భారీ ఎత్తున నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తిరుపతి రెడ్డి మాట్లాడుతూ, వెయ్యి రోజుల పాలన ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని ఆటో డ్రైవర్లకు ప్రభుత్వం అన్యాయం చేసిందని వారి సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందని ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ వారు నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రాయిశెట్టి లతా శ్రీనివాస్ తో పాటు పలువురు బిఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.

**ఇల్లందకుంటలో.....**

ఇల్లంతకుంట మండల కేంద్రంలో మాజీ ఎంపీపీ సరిగోమ్ముల పావని వెంకటేష్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ప్రధాన రహదారి పై ఆటో కార్మికులకు మద్దతుగా ప్రభుత్వం పై వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ వారికి సంఘీభావం పలికారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ వెంకటేష్ మాట్లాడుతూ, కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని 420 హామీలతో రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కాంగ్రెస్ అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని మండిపడ్డారు. విద్యార్థులకు ఫీజు రియాబర్స్మెంట్ ఇవ్వలేదని ఆటో కార్మికులకు జీవనోపాధి లేకుండా చేసిందని వారి సమస్యలను పరిష్కారంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో పలువురు బి ఆర్ ఎస్ నేతలు తదితరులు పాల్గొన్నారు.

# సీఎం రేవంత్ రెడ్డిపై విషప్రచారం.బీఆర్ఎస్ నేతలపై కాంగ్రెస్ ఫిర్యాదు

## కరీంనగర్ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన నగర కాంగ్రెస్ అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్

**కరీంనగర్, (సింగిడి):**తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి పై సామాజిక మాధ్యమాల్లో అసత్య, అవమానకర ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ కరీంనగర్ నగర కాంగ్రెస్ అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్ ఆదివారం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ముఖ్యమంత్రి ఫోటోను అవమానకరంగా మార్ఫింగ్ చేసి, ఆయన వ్యక్తిత్వాన్ని కించపరిచేలా ప్రచారం చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇలాంటి చర్యలు ప్రజల్లో తప్పుడు సంకేతాలు పంపడంతోపాటు శాంతిభద్రతలకు విఘాతం



కలిగించే అవకాశం ఉందని అంజన్ కుమార్ అన్నారు. ప్రభుత్వ పాలన పై అసంతృప్తితోనే బీఆర్ఎస్ నాయకులు ముఖ్యమంత్రి పై అసత్య ప్రచారానికి పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు. ఈ ప్రచారానికి పాల్పడిన వారిపై భారతీయ న్యాయ సంహిత నిబంధనల ప్రకారం కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్జీపీఎస్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మడుపు మోహన్, కార్పొరేటర్ వరాల నరసింగం, నగర కాంగ్రెస్ మైనారిటీ సెల్ అధ్యక్షుడు అహ్మద్ అలీతో పాటు షాహిద్, పెంట శేఖర్, మహమ్మద్ ఇమ్రాన్, మహాలక్ష్మి, వసీం, ఫహద్, మాజిద్ అలీ, నెల్లి నరేష్, అరుణ్ విలాసాగర్, ఆసిఫ్, మహేష్, శ్రీనివాస్, ఇమ్రాన్ ఘని తదితరులు పాల్గొన్నారు.

# ఆటో కార్మికుల జీవితం దుర్భరం

**వెయ్యి రోజుల పాలనలో ప్రజలకు ఒరిగింది ఏమీ లేదు**
**మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్**
**బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ**

**జమ్మికుంట, (సింగిడి):**కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ఆటో కార్మికుల జీవితాలు దుర్భరంగా మారాయని మున్సిపల్ చైర్మన్ ములుగు ప్రశాంత్ కుమార్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ 1,000 రోజుల వైఫల్య పాలనను నిరసిస్తూ, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకత్వం ఇచ్చిన పిలుపు మేరకు తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హుజురాబాద్



నియోజకవర్గ శాసనసభ్యులు పాడి కౌశిక్ రెడ్డి ఆదేశాలతో జమ్మికుంట పట్టణంలో ఆటో కార్మికులకు మద్దతుగా నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ ఆటో కార్మికుల జీవన పరిస్థితులు రోజురోజుకూ దయనీయంగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రోజువారీ సంపాదనతో కుటుంబాలను పోషించుకుంటున్న ఆటో కార్మికులకు ఆదాయం తగ్గిపోవడంతో ఆటో కిస్తీలు, ఇంటి అద్దెలు, పిల్లల చదువుల ఖర్చులు, వైద్య ఖర్చులు భరించలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వం హామీ ఇచ్చిన రూ. 12,000 ఆర్థిక సహాయాన్ని వెంటనే అమలు చేయాలని, ఆటో కార్మికులకు సబ్సిడీ రుణాలు అందించాలని, ఆధునిక ఎలక్ట్రిక్ ఆటోలు అందించి వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించాలని కోరారు.

ఆటో కార్మికుల న్యాయమైన డిమాండ్ల కోసం బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని మొలుగు ప్రశాంత్ కుమార్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ ముంతాజ్ అలీ జావేద్ , ప్రాథమిక సహకార సంఘం చైర్మన్ పోనగంటి సంపత్,పొడేటి రామస్వామి, పోల్నేని సత్యనారాణ రావు, కేడీసీసీ వైస్ చైర్మన్ పింగళి రమేష్,బీఆర్ఎస్ నాయకులు,ఆటో యూనియన్ నాయకులు,పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆటో కార్మికుల హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం


## వెయ్యి రోజుల పాలనపై ఐదో రోజు బీఆర్ఎస్ నిరసన,ఆటోలతో భారీ ర్యాలీ

## మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్

**కరీంనగర్, (సింగిడి):** కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసనలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా ఐదో రోజు కరీంనగర్‌లో ఆటోలతో భారీ ర్యాలీ నిర్వహించారు. తెలంగాణ చౌక్‌లో మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించడంతో పాటు స్వయంగా ఆటో నడిపారు. ర్యాలీ ప్రారంభానికి ముందు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రంతో రూపొందించిన వినూత్న ఫ్లెక్సీని ప్రదర్శిస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కాంగ్రెస్, టీడీపీ కండువాలతో పాటు 'ఓటుకు నోటుకు దొంగ' అనే సందేశంతో రూపొందించిన ఫ్లెక్సీ ఆకట్టుకుంది. 'నిన్న ఒక జెండా.. నేడు మరో కండువా.. ఎటు లాభం ఉంటే అటు జంప్' అనే భావాన్ని వ్యక్తం చేసేలా రూపొందించిన ఫ్లెక్సీ రాజకీయంగా చర్చనీయాంశమైంది. రేపటి నుంచి ప్రారంభమయ్యే శాసనసభ సమావేశాల్లో ఆటో కార్మికుల సమస్యలపై తమ పార్టీ తరపున గళం వినిపిస్తామని గంగుల కమలాకర్ తెలిపారు. ఈ కార్యక్రమం లో నగర అధ్యక్షులు చల్ల హరి శంకర్, ఎడ్ల అశోక్, గుగ్గిళ్ల జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.



## ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడిగా దొగ్గల భాస్కర్



**జమ్మికుంట,(సింగిడి):**జమ్మికుంట మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా వెంకటేశ్వర్ల పల్లి గ్రామానికి చెందిన దొగ్గల భాస్కర్ ను నియమిస్తూ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొరివి అరుణ్ లేఖ విడుదల చేశారు. తన నియమానికి కృషి చేసిన రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షుడు,మానకొండూరు శాసనస భ్యులు కవ్వంపల్లి సత్యనారాయణ,హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ బాబు కి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. పార్టీలో నిబద్ధత కలిగిన కార్యకర్తగా నన్ను గుర్తించి నాకు ఈ బాధ్యత అప్పగించారని, వారి ఆశయాలకు అనుగుణంగా పని చేస్తానని తెలిపారు.

## పోలింగ్ కేంద్రాలను సందర్శించిన ఆర్డీఓ జల కుమారి



**జమ్మికుంట,(సింగిడి):** జమ్మికుంట పట్టణం లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రభుత్వ బాలికల పాఠశాలలో ఏర్పాటుచేసిన సర్ ప్రత్యేక కేంద్రాన్ని హుజురాబాద్ ఆర్డీవో జల కుమారి ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఆర్డీవో బిఎల్ఓ లకు తగు సూచనలు సలహాలు అందించారు. సర్ కార్యక్రమాన్ని ఎలాంటి అవకతవ కలు లేకుండా పూర్తి చేయాలని సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట తహసిల్దార్ జి సుధాకర్ డిప్యూటీ తహసిల్దార్ శంకర్ గిర్దవార్ సత్యనారాయణ జిపిఓ లు 7 రాజకీయం హరీష్ వివేక్ బి ఎల్ ఓ అనూష తదితరులు పాల్గొన్నారు.

## వాసవి వారోత్సవాల్లో పాత్రికేయులకు ఘన సన్మానం

### సీనియర్ పాత్రికేయులను సత్కరించిన వాసవి క్లబ్ ఎం.ఆర్. కరీంనగర్ సభ్యులు



**కరీంనగర్, (సింగిడి):**వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ఆదేశాల మేరకు వాసవి క్లబ్ వ్యవస్థాపకుడు స్వర్గీయ మాన్యశ్రీ కె. చంద్రశేఖర్ గుప్తా జయంతిని పురస్కరించుకొని నిర్వహి స్తున్న వాసవి వారోత్సవాల్లో భాగంగా ఆరో రోజు పాత్రికేయుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వాసవి క్లబ్ ఎం.ఆర్. కరీంనగర్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం నిర్వహించిన కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు దేవిశెట్టి నవీన్, వేణు, కాసానగౌట్టు రమణయ్యలను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పాత్రికేయులు సమాజానికి అందిస్తున్న సేవలను క్లబ్ సభ్యులు కొనియాడారు. కార్యక్రమంలో క్లబ్ కేబినెట్ అదనపు కోశాధికారి బొడ్ల సంతోష్, క్లబ్ అధ్యక్షుడు చిట్టిమల్ల సత్యనారాయణ, కోశాధికారి పైడ రవితో పాటు పలువురు క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

### మట్టి వినాయకుడితో పర్యావరణ పరిరక్షణకు

# ప్రతి ఒక్కరూ సహకరించాలి

**ఆసరా ఫౌండేషన్ ద్వితీయ వార్షికోత్సవంలో**
**నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ పిలుపు**



**కరీంనగర్,(సింగిడి):** మట్టి వినాయక విగ్రహాలను పూజించి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ పిలుపునిచ్చారు. కరీంనగర్‌కు చెందిన ఆసరా ఫౌండేషన్ (ఆపదలో సహాయానికి రా) ద్వితీయ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మేయర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా గత రెండేళ్లుగా ఫౌండేషన్ చేపడుతున్న సేవా కార్యక్రమాలను మేయర్ అభినందించారు. మొక్కలు నాటడం, పచ్చదనం-పరిశుభ్రతపై అవగాహన, ఓటరు మరియు ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు, యువతకు మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై చైతన్యం కల్పించడం, ఆపదలో ఉన్న వారికి రక్తదానం ద్వారా సహాయం అందించడం వంటి సేవలను ప్రశంసించారు. భవిష్యత్తులోనూ ఇదే స్ఫూర్తితో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు. వినాయక చవితిని పురస్కరించుకుని పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఫౌండేషన్ రూపొందించిన "మట్టి వినాయ కుడిని పూజిద్దాం--పర్యావరణాన్ని పరిరక్షిద్దాం" గోడపత్రికను మేయర్ ఆవిష్కరించారు. మట్టి విగ్రహాలు నీటిలో సులభంగా కలిసిపోతాయని, ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలతో పోలిస్తే పర్యావరణానికి తక్కువ హాని కలిగిస్తాయని తెలిపారు. వీలైనంత వరకు ఇంటివద్దనే మట్టి విగ్రహాలను నిమజ్జనం చేసి, ఆ మట్టిని మొక్కల పెంపకానికి వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆసరా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు, జాతీయ సేవా పథకం జాతీయ అవార్డు గ్రహీత డాక్టర్ ఆర్. గోపి కృష్ణ, సభ్యులు కె. ప్రవీణ్, జి. తిరుపతి, ఎం. రవిచందర్, వి. అద్వైత్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

## కేటీఆర్ రాజకీయ కుయుక్తులను ప్రజలు నమ్మరు

**యువతకు ముందుగా క్షమాపణ చెప్పాలి**
**సీఎం రేవంత్‌రెడ్డిపై వ్యక్తిగత విమర్శలు చేస్తే ఊరుకోం**
**మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న**



**కరీంనగర్,(సింగిడి):** బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ చేస్తున్న రాజకీయ విమర్శలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని కరీంనగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న అన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో యువతకు జరిగిన అన్యాయాలపై కేటీఆర్ ముందుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఉద్యోగాల భర్తీ, నిరుద్యోగ భృతి, ప్రశ్నపత్రాల లీకేజీలు, 317 జీవో వంటి అంశాలపై యువతకు బీఆర్ఎస్ సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఉందన్నారు. గతంలో ఇచ్చిన హామీలను విస్మరించి ఇప్పుడు యువత సమస్యలపై మాట్లాడటం విడ్డూ రంగా ఉందని విమర్శించారు. గత పాలనపై సమాధానం చెప్పి న తర్వాతే ప్రస్తుత ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై వ్యక్తిగత విమర్శలు చేస్తే కాంగ్రెస్ శ్రేణులు చూస్తూ ఊరుకోవని నరసన్న హెచ్చరించారు. ప్రజా సమస్యలపై శాసనసభలో చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ఉద్యోగుల సమస్యలపై కూడా చర్చ జరుగుతుందని తెలిపారు. అసెంబ్లీ సమావేశా లకు కేటీఆర్ తన తండ్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను తీసుకురావాలని నరసన్న సవాల్ విసిరారు. ప్రజా సమస్యలపై చర్చించాల్సిన బాధ్యత ప్రతిపక్షానిదేనని ఆయన పేర్కొన్నారు.

### యువ సమరభేరి విజయంతో

# బీజేపీ, కాంగ్రెస్‌లో భయం


**నగర సమస్యలపై సోమవారం నిరసన.. కేంద్ర నిధులు తీసుకురావడంలో బండి సంజయ్ విఫలం. నగర బిఆర్ఎస్ అధ్యక్షులు చల్లా హరిశంకర్**



**కరీంనగర్,(సింగిడి):** నగ రంలో బీఆర్ఎస్ నిర్వహించిన విద్యార్థి, యువ సమరభేరి సభ అపూర్వ విజయా న్ని సాధించడంతో బీజేపీ, కాంగ్రెస్ పార్టీల్లో భయం మొదలైందని బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్లా హరిశంకర్ అన్నారు. సభ విజయవంతం కాలేదం టూ మేయర్ కొలగాని శ్రీనివాస్ చేసిన వ్యాఖ్యలు బీజేపీ భయానికి నిదర్శనమని పేర్కొన్నారు. రెండుసార్లు ఎంపీగా గెలిచిన బండి సంజయ్ కరీంనగర్ అభివృద్ధికి చేసిందేమీ లేదని విమర్శించారు. నగరపాలక సంస్థలో బీజేపీ అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడిచినా కేంద్రం నుంచి ఒక్క రూపాయి నిధులు తీసుకురాలేదని, సాధారణ నిధులతోనే ప్రారంభోత్స వాలు చేస్తూ ప్రజలను మభ్యపెడుతున్నారని ఆరోపించారు. ఏళ్లు గడుస్తున్నా రైల్వే వంతెన పూర్తికాకపోవడం ఆయన వైఫల్యానికి నిదర్శనమన్నారు. నగరంలో పారిశుధ్యం పూర్తిగా క్షీణించిందని, మేయర్‌గా కొలగాని శ్రీనివాస్ విఫలమయ్యారని హరిశంకర్ విమర్శించారు. అధికారులపై మేయర్‌కు నియంత్రణ లేదన్నారు. నగర సమస్యలపై సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టి, ప్రజావాణిలో వినతిపత్రం సమర్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు గుగ్గిళ్ల జయశ్రీ-శ్రీనివాస్, షేక్ యూసుఫ్, మాజీ కార్పొరేటర్లు గందె మాధవి-మహేష్, నందెల్లి రమాదేవి, దిండిగాల మహేష్, కంసాల శ్రీనివాస్, ఎడ్ల అశోక్, బోనాల శ్రీకాంత్, నాంపల్లి శ్రీనివాస్, నక్క కృష్ణ, జక్కని ఉమాపతి తదితర బీఆర్ఎస్ నాయకులు, మహిళా నాయకురాళ్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నాడు మోసం.. నేడు మొసలి కన్నీరా?

**బీఆర్ఎస్‌ను ప్రజలు ఎప్పుడో తిరస్కరించారు..**
**కేటీఆర్‌కు కాంగ్రెస్‌ను విమర్శించే నైతిక హక్కు లేదు**
**కాంగ్రెస్ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు**



**కరీంనగర్, (సింగిడి)::** అధికారంలో ఉన్నప్పుడు నిరుద్యోగులు, విద్యార్థుల సమస్యలను పట్టించుకోని బీఆర్ఎస్ నేతలు ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తున్నారని కాంగ్రెస్ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్ రావు విమర్శించారు. కరీంనగర్‌లో బీఆర్ఎస్ నిర్వహించిన యువ సమరభేరి సభ పూర్తిగా విఫలమైందని, యువత ఆ పార్టీని ఎప్పుడో తిరస్కరించిందని అన్నారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని విమర్శించే నైతిక అ-ర్హత బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌కు లేదన్నారు. వారసత్వ రాజకీయాలతో కాకుండా స్వయంకృషి, పట్టుదలతో స్థానిక సంస్థల స్థాయి నుంచి ముఖ్యమంత్రి స్థాయికి రేవంత్‌రెడ్డి ఎదిగారని పేర్కొన్నారు.

**కేసీఆర్‌తో రాజీనామా చేయించగలరా?**

కేటీఆర్‌కు నిజంగా ధైర్యం ఉంటే తన తండ్రి కేసీఆర్‌తో శాసనసభ ప్రతిపక్ష నేత పదవికి రాజీనామా చేయించి, ఆ స్థానాన్ని బీసీ లేదా ఎస్సీ ఎమ్మెల్యేకు ఇవ్వాలని రాజేందర్‌రావు సవాల్ విసిరారు. ప్రజా సమస్యలపై అసెంబ్లీలో చురుగ్గా పోరాడాల్సిన కేసీఆర్ సభకు సక్రమంగా హాజరుకాకుండా ఫామ్‌హౌస్‌కే పరిమితమవుతున్నారని ఆరోపించారు. కేటీఆర్ కేసీఆర్ పేరు, అండతో రాజకీయాల్లోకి వచ్చారని విమర్శించిన ఆయన.. తెలంగాణ ఉద్యమంలో కీలకంగా పనిచేసిన నాయకులను పక్కనపెట్టి కుటుంబ సభ్యులు, అనుచరులకు బీఆర్ఎస్ పెద్దపీట వేసిందన్నారు.

**నిరుద్యోగుల సమస్యలపై కేటీఆర్ సమాధానం చెప్పాలి...**

బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో పేపర్ లీకేజీలు, నిరుద్యోగ భృతి, ఉద్యోగ నియామకాలు, 317 జీవో, స్వయం ఉపాధి పథకాలు తదితర అంశాలపై యువత ఎదుర్కొన్న సమస్యలకు కేటీఆర్ ముందుగా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అప్పటి ప్రభుత్వ వైఫల్యాలపై బాధ్యత వహించాల్సింది పోయి ఇప్పుడు యువత కోసం సభలు నిర్వహించడం హాస్యాస్పదమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సుమారు 70 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసిందని, రాబోయే రోజుల్లో మరిన్ని ఉద్యోగాల భర్తీకి చర్యలు చేపడుతుందని తెలిపారు. ఈ విషయాన్ని కేటీఆర్ గుర్తించాలని అన్నారు. కరీంనగర్‌లో నిర్వహించిన యువ సమరభేరి సభకు యువత నుంచి స్పందన కరువైందని, బీఆర్ఎస్‌పై ప్రజలకు విశ్వాసం లేదని రాజేందర్‌రావు అన్నారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండేలా కేటీఆర్ స్పష్టమైన సందేశం ఇవ్వాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి ఓర్వలేకనే బీఆర్ఎస్ నేతలు విమర్శలు చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

## గురువుల సేవకు గౌరవ వందనం..

**13వ వార్డు కౌన్సిలర్ సిద్ధ తిరుపతి సత్కారం**



**సుల్తానాబాద్, (సింగిడి):** ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని సు ల్తానాబాద్ మండల కేంద్రం లోని ప్రభుత్వ జూని యర్ కళాశాల మైదానంలో శని వారం ఘనంగా సత్కార కార్యక్రమం నిర్వహించారు. 13వ వార్డు కౌన్సిలర్ సిద్ధ తిరుపతి ఆధ్వర్యం లో ఖో ఖో అం తర్జాతీయ క్రీడా కారుడు, కే లో ఇండియా కోచ్ గె ల్లు మధుకర్‌ను శాలువాతో ఘనంగా సత్కరించా రు. ఈ సందర్భంగా కౌన్సిలర్ సిద్ధ తిరుపతి మా ట్లాడుతూ.. సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. విద్యార్థులకు విద్యా బుద్ధులు నేర్పడంతో పాటువారిభ విష్యత్తుకు బలమైనపునాది వేసేదిగురువు లేనని పేర్కొన్నారు. గురువుల సేవకు గౌరవ వందనం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. విద్యార్థులను ఉన్నత లక్ష్యాల వైపు నడిపిస్తూ, వారి ప్రతిభను వెలికితీసి దేశ భవిష్యత్తును తీర్చిదిద్దుతున్నఉపాధ్యాయుల సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఈ సం దర్భంగా గెల్లుమధుకర్‌ను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

## 1000 రోజుల పాలనకు జై కొట్టిన ఆరో వార్డు

**కౌన్సిలర్ బాకం సాయి కిరణ్ పిలుపుతో కదిలిన యువత భారీ బైక్ ర్యాలీ హోరుతో విజయోత్సవం**





**సుల్తానాబాద్, (సింగిడి):** కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలనను పుర స్కరించుకొని సుల్తానాబాద్ మున్సిపాలిటీ 6వ వా ర్డులో విజయోత్సవ ర్యాలీ ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు ఆధ్వర్యంలో నిర్వహించిన విజయోత్సవ కార్య క్రమానికి సంఘీభావంగా 6వ వార్డునుంచి యువకులతోభారీ బైక్‌ర్యాలీ చేపట్టారు. కౌన్సిలర్ బాకం సాయి కిరణ్ ఆధ్వర్యంలో నిర్వహించినఈ ర్యాలీలో యువత పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొని కాంగ్రెస్ విజయోత్సవ సందడి చేశారు. వార్డులో కాంగ్రెస్‌శ్రేణుల ఉత్సాహం, యువత భాగస్వామ్యం కార్యక్ర మానికిప్రత్యేక ఆకర్షణగానిలిచింది. ఈకార్యక్రమంలో న్యాతరి దేవేందర్ కుమార్, దుర్గయ్య, అరెపల్లి కిరణ్, అరెపల్లి హేమన్‌రాజ్, కొండ్రవినయ్, కొండ్ర ప్రణయ్, మామిడిపల్లి శ్రీకాంత్, రాహుల్, మణి, ప్రతాప్, ఓంకార్‌తో పాటు పలువురుయువకులు పాల్గొన్నారు.

## ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం







**కొమురం భీం ఆసిఫాబాద్ ప్రతినిధి,(సింగిడి):** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో శనివారం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. జిల్లాలోని వివిధ పాఠశాలల్లో విద్యార్థులు ఉపాధ్యాయులకు పుష్పగుచ్ఛాలు ఇచ్చి, శాలువలతో ఘనంగా సన్మానించారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి స్వయంపాలక దినోత్సవం నిర్వహించారు. కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలంలోని భారతి విద్యా మందిర్ పాఠశాల ఆవరణలో లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కౌటాల రవీంద్ర నగర్ లైన్స్ క్లబ్ అధ్యక్షుడు ఎంఎల్ మారయ్య, ప్రధాన కార్యదర్శి, ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు దుర్గం గోపాల్, లైన్స్ క్లబ్ సభ్యులు ఉపాధ్యాయులను శాలువలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ కోశాధికారి నారాయణ సర్కార్, తిరుపతి, యాదగిరి, సభ్యులు పాల్గొన్నారు.

## అక్షరాలు నేర్పిన చేతులకు.. ఆత్మీయ సత్కారం

**ట్రస్మ ఆధ్వర్యంలో ఘనంగా ఉపాధ్యాయుల సన్మానం**



**మంచిర్యాల,(సింగిడి):** ఒక విద్యార్థి జీవితంలో తల్లిదం డ్రుల తర్వాత అత్యంత కీలక పాత్ర పోషించేది ఉపాధ్యాయుడిదే. పాఠ్యపుస్తకాల్లోని అక్షరాలను పరిచయం చేయడమే కాదు.. జీవితాన్ని ఎలా ఎదుర్కోవాలో నేర్పే గురువుల సేవలకు వెలకట్టలేం. అలాంటి ఉపాధ్యాయుల కృషిని గుర్తించి, వారికి ఆత్మీయ గౌరవం అందించే కార్యక్రమం నస్పూర్‌లో హృదయపూర్వకంగా సాగింది.

**ట్రస్మ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులను సన్మానం..**

ట్రస్మ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంకు మంచిర్యాల కార్పొరేషన్ మేయర్ మధుకర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఉపాధ్యాయు లను సన్మానించారు. విద్యార్థుల్లో క్రమశిక్షణ, విలువలు, ఆత్మవిశ్వాసం పెంపొందించడంలో ఉపాధ్యాయుల పాత్రను గుర్తుచేశారు. సమాజ నిర్మాణంలో గురువులది అత్యున్నతమైన స్థానమని పేర్కొన్నారు. ఉదయం పాఠశాల గేటు తెరవకముందే తరగతి గదికి చేరుకోవడం.. విద్యార్థుల కోసం పాఠ్యాంశాలను సిద్ధం చేయడం.. ఒక్కో విద్యార్థి సామర్థ్యాన్ని గుర్తించి ప్రోత్సహించడం.. చదువులో వెనుకబడిన వారికి ప్రత్యేక శ్రద్ధ చూపడం.. పరీక్షల సమయంలో ధైర్యం చెప్పడం.. ఇలా ఉపాధ్యాయుడి రోజు మొత్తం విద్యార్థుల చుట్టూనే తిరుగుతుందని విద్యార్థి విజయం సాధించినప్పుడు తన విజయం కంటే ఎక్కువగా ఆనందించే మనసు గురువుదన్నారు. ట్రస్మ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లెత్తుల రాజేంద్రపాణి మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమాజానికి దిశానిర్దేశం చేసే దీపస్తంభాల వంటి వారని అన్నారు. విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దడంలో వారు చేస్తున్న కృషికి అభినందనలు తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కా రానికి, వారి గౌరవాన్ని కాపాడేందుకు ట్రస్మ నిరంతరం కృషి చేస్తుందని పేర్కొన్నారు. ఉపాధ్యాయులకు వైద్య చికిత్సలో రాయితీ ఇవ్వడానికి ముందుకు వచ్చిన మెడిలైఫ్ హాస్పిటల్ యాజమాన్యం ను అభినందిం చారు. ఈ కార్యక్రమంలో ట్రస్మ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ మెడ్ లైఫ్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్, 27వ డివిజన్ కార్పొరేటర్ కొండ్ర రాజేశ్వరి – లింగయ్య ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు

## ఉపాధ్యాయులే దేశ భవిష్యత్‌కు దిక్సూచి

**నరసయ్యపల్లెలో గురువులకు లైన్స్ క్లబ్ ఘన సత్కారం అధ్యక్షుడు, సర్పంచ్ జూపల్లి తిరుమలరావు**




**సుల్తానాబాద్, (సింగిడి):** ఉపాధ్యాయుల సేవలు సమాజ నిర్మాణంలో ఎం తో కీలకమని, దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే శక్తి ఉ పాధ్యాయుల చేతుల్లోనే ఉందని లైన్స్ క్లబ్ సుల్తా నాబాద్ అధ్యక్షుడు, గ్రామ సర్పంచ్ జూపల్లి తిరు మలరావు అన్నారు. శనివారం ఉపాధ్యాయ దినో త్సవాన్ని పురస్కరించుకొని లైన్స్ క్లబ్ సుల్తానా బాద్ ఆధ్వర్యంలో మండలంలోని నరసయ్య పల్లె గ్రామ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యా యులను ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులకు శా లువాలు కప్పి గౌరవం తెలిపారు. ఈ సందర్భంగా జూపల్లి తిరుమలరావు మాట్లాడుతూ.. విద్యార్థులకు పాఠ్య బోధనతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు, సామాజిక బాధ్యత లను నేర్పుతూ ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర అపారమన్నారు. సమాజ ప్రగతికి పునాది వేసే ఉపాధ్యాయులను గౌరవించడం ప్రతి ఒక్కరి బా ధ్యతగా పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తుకు మార్గనిర్దేశం చేస్తూ అంకితభావంతో పనిచేస్తున్న ఉపాధ్యా యుల సేవలను కొనియా డుతూ లైన్స్ క్లబ్ తరపున అభినందనలు తెలిపారు. ఈ కా ర్యక్రమంలో లైన్స్ క్లబ్ సుల్తానాబాద్ కార్యదర్శి ఎ ర్రబెల్లి సుధీర్ రావు, కోశాధికారి తమ్మన వేణి స తీష్ కుమార్ పాఠశాల ఉపాధ్యాయులుతదితరు లు పాల్గొన్నారు.

## ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు




**మంచిర్యాల,(సింగిడి):** చేతిలో చాక్‌పీస్.. ఎదురుగా చిన్నారుల సమూహం.. ప్రతి అక్షరంలో భవిష్యత్తును తీర్చిదిద్దాలనే తపన.. విద్యార్థి విజయాన్ని తమ విజయంగా భావించే నిస్వార్థ సేవ.. ఇదే ఉపాధ్యాయుడి ప్రత్యేకత. పాఠ్యాంశాలను బోధించడమే కాదు.. జీవితాన్ని ఎలా ఎదుర్కోవాలో నేర్పే గురువుల సేవకు కొలమానం లేదు. అలాంటి గురువుల సేవలను గుర్తుచేసుకుంటూ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం మంచిర్యాల జిల్లాలోని పలు పాఠశాలల్లో ఉపాధ్యాయుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాలల్లో విద్యార్థులు తమ ఉపాధ్యాయులకు పుష్పగుచ్ఛాలు అందించి, శాలువాలతో సత్కరించారు. ఉపాధ్యాయుల సేవలను కొనియాడుతూ ప్రసంగాలు చేశారు. కొన్ని పాఠశాలల్లో విద్యార్థులే కార్యక్రమాలను నిర్వహించి గురువులపై తమకున్న అభిమానాన్ని చాటుకున్నారు. పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రసంగాలతో పాఠశాల ఆవరణలు సందడిగా మారాయి. ఉపాధ్యాయుడి చేతిలో రూపుదిద్దుకున్న విద్యార్థి.. భవిష్యత్తులో ఉన్నత స్థానానికి చేరుకున్నప్పుడు ఆ ఆనందం గురువుకు దక్కే అరుదైన గౌరవం. అందుకే ఎన్నో ఏళ్లుగా విద్యార్థుల జీవితాల్లో మార్పు కోసం పనిచేస్తున్న ఉపాధ్యాయులను ఈ సందర్భంగా పలువురు అభినందించారు. ఒక మంచి మాట, ఒక చిన్న ప్రోత్సాహం, ఒకసారి చూపిన మార్గదర్శనం.. విద్యార్థి జీవితాన్నే మార్చగలదని పేర్కొన్నారు. నేటి విద్యావ్యవస్థలో ఉపాధ్యాయుడి బాధ్యత మరింత విస్తరించింది. పాఠ్యాంశాల బోధనతో పాటు విద్యార్థుల్లో క్రమశిక్షణ, విలువలు, సామాజిక బాధ్యత, సృజనాత్మకతను పెంపొందించాల్సిన బాధ్యత వారిపై ఉంది. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా తాము మారుతూ.. విద్యార్థులను ముందుకు నడిపించాల్సిన పరిస్థితి నెలకొంది.

## కలెక్టర్ కుమార్ దీపక్‌కు అరుదైన గౌరవం

**సీఎం చేతులమీదుగా అవార్డు బడుల బలోపేతం.. కలెక్టర్ కు కీర్తి కిరీటం!**



**మంచిర్యాల,(సింగిడి):** విద్యా రంగాన్ని కేవలం పాఠశాలల నిర్వహణకే పరిమితం చేయకుండా.. విద్యార్థుల నమోదు, ప్రభుత్వ పాఠశాలల బలోపేతం, విద్యా ప్రమాణాల పెంపు, ఉపాధ్యాయులకు ప్రోత్సాహం, సంక్షేమ కార్యక్రమాల సమర్థ అమలు వంటి అంశాలకు ప్రాధాన్యమిస్తూ ముందుకు సాగిన మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఐఏఎస్‌కు రాష్ట్రస్థాయి గుర్తింపు లభించింది. విద్యా పరిపాలనలో విశిష్ట ప్రతిభా పురస్కారం--2026ను రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఆయన అందుకున్నారు. జిల్లాలో విద్యా పరిపాలనను క్షేత్రస్థాయికి తీసుకెళ్లడంలో కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరిక పెంచడం, పాఠశాలల్లో మౌలిక వసతుల మెరుగుదల, విద్యార్థులకు అందుతున్న సంక్షేమ పథకాల అమలును పర్యవేక్షించడం వంటి అంశాల్లో అధికార యంత్రాంగాన్ని సమన్వయం చేశారు. విద్యార్థుల సంఖ్యను పెంచడంతో పాటు ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రుల్లో నమ్మకం పెంచేలా చర్యలు చేపట్టడం ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంపునకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టడం.. పాఠశాలల పనితీరును సమీక్షించడం.. ఉపాధ్యాయులతో నిరంతరం సమన్వయం చేయడం వంటి చర్యలు విద్యా పరిపాలనలో భాగమయ్యాయి. పాఠశాల విద్యను ప్రభుత్వ ప్రాధాన్య రంగంగా భావిస్తూ క్షేత్రస్థాయి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇచ్చారు. విద్యార్థులు ఆకలితో తరగతులకు హాజరుకాకుండా పౌష్టికాహారం అందించేందుకు చేపట్టిన కార్యక్రమాల అమలుపైనా యంత్రాంగం దృష్టి సారించింది. పాఠశాల అల్పాహార కార్యక్రమం సమయానికి, నాణ్యతతో అందేలా పర్యవేక్షణకు ప్రాధాన్యం ఇచ్చారు. విద్యార్థి చదువు మాత్రమే కాదు.. ఆరోగ్యం, మానసిక ఉల్లాసం కూడా ముఖ్యమే అన్న దృక్పథంతో చర్యలు కొనసాగాయి.

**క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ**

విద్యా శాఖ అధికారులతో సమీక్షలు నిర్వహిస్తూ లక్ష్యాలను నిర్దేశించడం, వాటి అమలును పర్యవేక్షించడం ద్వారా విద్యా పరిపాలనలో జవాబుదారీతనానికి ప్రాధాన్యం ఇచ్చారు. పాఠశాలల స్థితిగతులను తెలుసుకోవడం, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి పరిష్కరించడం వంటి అంశాలపై దృష్టి సారించారు.

**జిల్లాకు మరోసారి రాష్ట్రస్థాయి గుర్తింపు**

కలెక్టర్ కుమార్ దీపక్‌కు లభించిన ఈ పురస్కారం వ్యక్తిగత గౌరవమే కాకుండా మంచిర్యాల జిల్లా విద్యా శాఖ పనితీరుకు దక్కిన గుర్తింపుగా పలువురు అభివర్ణిస్తున్నారు. విద్యా రంగంలో చేపడుతున్న కార్యక్రమాలకు రాష్ట్రస్థాయిలో గుర్తింపు రావడం ద్వారా అధికారులు, ఉపాధ్యాయుల్లో మరింత బాధ్యత పెరగనుంది. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలన్న లక్ష్యానికి ఈ పురస్కారం మరింత ఊతమివ్వనుంది.

## వెయ్యి రోజుల పాలనకు.. మంచిర్యాలలో భారీ షో

**వెయ్యి బైక్‌ల ర్యాలీ.. కాంగ్రెస్ దూకుడు బైక్ ర్యాలీ లో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్‌రావు**



**మంచిర్యాల,(సింగిడి):** తెలంగాణలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనను విజయ వంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా మంచిర్యాల నియోజకవర్గంలో కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా సంబరాలు నిర్వహించాయి. వెయ్యి బైక్‌లతో నిర్వహించిన భారీ ర్యాలీ పట్టణంలో ఉత్సాహభరిత వాతావరణాన్ని నెలకొల్పింది. పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ శ్రేణులు బైక్‌లపై తరలి రావడంతో ప్రధాన రహదారులు కాంగ్రెస్ జెండాలతో సందడిగా మారాయి.

**ప్రజా సంక్షేమమే లక్ష్యం..**

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజల సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తూ ముందుకు సాగుతోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రజలకు చేరువవుతోందని తెలిపారు. వెయ్యి రోజుల పాలనను పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహిస్తున్న ఈ ర్యాలీ కాంగ్రెస్ కార్యకర్తల ఉత్సాహానికి ప్రతీక. ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా పాలన అందించడమే మా లక్ష్యం. మంచిర్యాల నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం నుంచి అవసరమైన సహకారం తీసుకువచ్చి మరింత ముందుకు తీసుకెళ్తాం అని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే వెన్నెముక అని అన్నారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి ఇంటికీ తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. మంచిర్యాల నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి ప్రజల నుంచి లభిస్తున్న ఆదరణకు ఈ భారీ ర్యాలీ నిదర్శనమని నాయకులు పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో కూడా ప్రజలతో మమేకమై నియోజకవర్గ అభివృద్ధి కోసం సమష్టిగా పనిచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేయర్ ధర్ని మధుకర్, కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, కార్పొరేటర్ తూముల నరేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ రామగిరి బానేష్, వైస్ చైర్మన్ జాలే రాయలింగు, సింగిల్ విండో వైస్ చైర్మన్ శ్రీపతి మల్లేష్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ సల్ల మహేష్, మాజీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూదరి తిరుపతి తదితరులతో పాటు కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, పట్టణ కమిటీ సభ్యులు, మైనారిటీ నాయకులు, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయ కులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అనుమానం.. వేధింపులు.. చివరకు కడతేర్చాడు!

**నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు**



**మంచిర్యాల,(సింగిడి):** అనుమానం అనే మానసిక బలహీనత ఓ కుటుంబాన్ని విషాదంలోకి నెట్టింది. భార్యపై అనుమానంతో కొంతకాలంగా వేధింపులకు పాల్పడుతూ, తరచూ గొడవపడుతున్న భర్త చివరకు ఆమె ప్రాణాలనే తీశాడు. గతంలోనూ హత్యకు ప్రయత్నించినట్లు పోలీసుల దర్యాప్తులో తేలడం ఈ ఘటనలో కుటుంబ హింస ఎంతటి ప్రమాదకర స్థాయికి చేరిందో వెల్లడిస్తోంది. నెన్నెల గ్రామంలో సెప్టెంబరు 2న జరిగిన మహిళ హత్య కేసులో నిందితుడు తోట మల్లేష్‌ను నెన్నెల పోలీసులు అరెస్టు చేశారు. బెల్లంపల్లి రూరల్ సీఐ హనూక్ వివరాలు వెల్లడించారు. మృతురాలు తోట సబిత (38) నిందితుడు మల్లేష్ భార్య. కొంతకాలంగా భార్యపై అనుమానం పెంచుకున్న మల్లేష్ ఆమెను తరచూ వేధిస్తూ, గొడవపడేవాడని పోలీసులు తెలిపారు. కుటుంబంలో తలెత్తిన విభేదాలు క్రమంగా తీవ్ర రూపం దాల్చాయని, గతంలోనూ సబితను హత్య చేసేందుకు ప్రయత్నించినట్లు దర్యాప్తులో వెల్లడైందని తెలిపారు. సెప్టెంబరు 2న మధ్యాహ్నం భార్యాభర్తల మధ్య మరోసారి గొడవ జరిగింది. ఈ క్రమంలో మల్లేష్ సబిత గొంతు నులిమినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం ఇంట్లో లభించిన పదునైన వస్తువుతో ఆమె గొంతుపై దాడి చేసి హత్య చేసినట్లు దర్యాప్తులో తేలిందన్నారు. హత్య అనంతరం నిందితుడు రక్తపు మరకలు ఉన్న దుస్తులను ఇంట్లోనే వదిలి, మరో దుస్తులు మార్చుకుని అక్కడి నుంచి పరారైనట్లు వెల్లడించారు. సమాచారం అందుకున్న నెన్నెల పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడి కోసం గాలింపు చేపట్టారు. వై–జంక్షన్ వద్ద పట్టివేత నిందితుడి కోసం గాలింపు కొనసాగుతుండగా సెప్టెంబరు 4న సాయంత్రం నమ్మదగిన సమాచారం అందడంతో పోలీసులు తాళ్లగురజాల వై–జంక్షన్ వద్ద మల్లేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం అరెస్టు చేసి న్యాయస్థానం ఎదుట హాజరు పరచగా, న్యాయస్థానం రిమాండ్‌కు తరలించింది. కుటుంబంలో అనుమా నాలు, గొడవలు హింసాత్మకంగా మారకుండా ప్రారంభ దశలోనే పరిష్కరించుకోవాల్సిన అవసరాన్ని ఈ ఘటన మరోసారి చాటిచెబుతోంద న్నారు. భార్యాభర్తల మధ్య విభేదాలు ప్రాణాంతక స్థాయికి చేరిన తర్వాత కాకుండా, వేధింపులు ప్రారంభమైన పుడే కుటుంబ సభ్యులు, బంధువులు, సంబంధిత వ్యవస్థలు జోక్యం చేసుకో వాల్సి న అవసరం ఉందన్నారు. నింది తుడి అరెస్టులో కీలకంగా వ్యవహరించిన పోలీసు సిబ్బందిని ఏసీపీ కిరణ్ కుమార్, సీఐ సి. హెచ్. హనూక్ అభినందించారు.

## విద్యార్థుల భవితకు గురువులే మార్గదర్శకులు

**ఆల్ ఫోర్స్ అధినేత నరేందర్ రెడ్డి ఆల్ఫోర్స్‌లో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు**





**సుల్తానాబాద్,(సింగిడి):** విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపా ధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి అన్నారు. డా క్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతిని పురస్కరిం చుకొని శనివారం సుల్తానాబాద్‌లోని ఆల్ఫోర్స్ పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. ఈ సంద ర్భంగా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. సమాజ నిర్మాణంలో ఉపాధ్యా యులది విశిష్టమైన పాత్ర అని, ఇతర వృత్తులకు దక్కని గౌరవం గురువు లకు లభిస్తుందని అన్నారు. విద్యార్థుల్లో క్రమశి క్షణ, కష్టపడే తత్వం, మంచి విలువలు పెంపొం దించి, ఉన్నత శిఖరాలకు చేరేలా తీర్చిదిద్దడమే ఉపాధ్యాయుల బాధ్యత అన్నారు. గురు వుల సేవలను స్మరించుకునే ప్రత్యేక రోజున ప్రతి విద్యా ర్థి ఉపాధ్యాయుల పట్ల గౌరవాన్ని చాటాలని సూ చించారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యా యుల మధ్య స్నేహపూర్వక వాతావర ణాన్ని పెంపొందించేలా పలు కార్యక్రమాలు నిర్వహిం చారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి త రగతులు నిర్వహించడం ప్రత్యేక ఆకర్షణగా ని లిచింది. విద్యార్థుల ప్రసంగాలు, పాటలు, నృత్యాలు అలరించగా, ఉపాధ్యాయులకు శుభా కాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సి పాల్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థినీ విద్యార్థు లు పాల్గొన్నారు.

## వాస్తు విశిష్టతకు పట్టం

**కృష్ణారావుకు వరించిన గోల్డెన్ వరల్డ్ అవార్డు**




**సుల్తానాబాద్,(సింగిడి):** సుల్తానాబాద్ మండ లం కాట్నపల్లి గ్రామానికి చెం దిన ప్రముఖ వాస్తు ప్లానర్ పురం కృష్ణారావుకు అరుదైన గౌరవం దక్కింది. వాస్తురంగంలో ఆయన అందిస్తున్న విశిష్ట సేవలకు గుర్తింపుగా కలం గోల్డె న్ వరల్డ్ అవార్డు లభించింది. తమిళనాడు రాజ ధాని చెన్నైలో శనివారం నిర్వహించిన కార్యక్రమం లో కృష్ణారావు ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ఎన్నో సంవత్సరాలుగా వాస్తు రంగంలో సేవలందిస్తున్న ఆయన.. నిర్మాణ స్థలాల పరిశీలన, వాస్తు ప్ర ణాళికల రూపకల్పనలో తనదైన నైపుణ్యంతో ప్రత్యేక గుర్తింపు పొందారు. తన సేవలకు జాతీ య స్థాయిలో గుర్తింపు లభించడంతో కాట్నపల్లి గ్రామస్థులు, కుటుంబ సభ్యులు, మిత్రులు హర్షం వ్యక్తం చేశారు. ఈ పురస్కారం వాస్తు రంగంలో మరింత నాణ్యమైన సేవలు అందించేందుకు త నకు మరింతప్రోత్సా హాన్నిస్తుందని కృష్ణారావు తె లిపారు

## ఫీజు రీయింబర్స్‌మెంట్.. జాబ్ క్యాలెండర్ ఎక్కడ?




**మంచిర్యాల,(సింగిడి):** విద్యార్థుల భవిష్యత్తు, నిరుద్యోగ యువత ఆశలు, ఉన్నత విద్యను అభ్యసిస్తున్న పేద కుటుంబాల ఆర్థిక భారం వంటి అంశాలపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని బీఆర్ ఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్ డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయి లను విడుదల చేయడంతో పాటు యూత్ డిక్లరేషన్‌ను అమలు చేసి, జాబ్ క్యాలెండ ర్‌ను వెంటనే ప్రకటించాలని ఆయన కోరారు. శనివారం మంచిర్యాల జిల్లా కేంద్రంలో విద్యార్థులతో కలిసి బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. బెల్లం పల్లి చౌరస్తా నుంచి వెంకటేశ్వర చౌరస్తా వరకు సాగిన ర్యాలీలో విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వానికి తమ డిమాండ్లను వినిపించారు. విద్య, ఉపాధి అంశాలను ఎన్నికల హామీలుగా మాత్రమే కాకుండా అమలు చేయాల్సిన బాధ్యతగా ప్రభుత్వం తీసుకోవాలని నాయకులు పేర్కొన్నారు. ఉన్నత విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ కీలకమైన ఆర్థిక సహాయం. బకాయిలు పేరుకుపోతే విద్యార్థులపై, వారి కుటుంబాలపై అదనపు భారం పడుతుందని పేర్కొన్నారు. ఫీజులు చెల్లించలేక విద్యార్థులు ఇబ్బందులు పడే పరిస్థితి రాకుండా ప్రభుత్వం వెంటనే బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఏళ్ల తరబడి సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతలో జాబ్ క్యాలెండర్‌పై స్పష్టత కోసం ఎదురుచూపులు కొనసాగుతున్నాయని నాయ కులు అన్నారు. ఖాళీలను గుర్తించి పరీక్షల తేదీలు, నియామక ప్రక్రియకు సంబంధించిన పూర్తి వివరాలతో జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తే నిరుద్యోగులకు ప్రణాళి కాబద్ధంగా సన్నద్ధమయ్యే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ర్యాలీలో మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, బీఆర్ఎస్‌వై రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నడిపెల్లి విజిత్‌కుమార్ పాల్గొన్నారు. విద్యార్థులు, బీఆర్ ఎస్‌వై నాయకులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, టీజీబీకేఎస్ నాయకులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మిల్కీబ్యూటీ తమన్నా భాటియా ప్రస్తుతం వరుస సినిమాలతో దూసుకెళ్తున్నారు. ప్రధానంగా తన ఫోకస్‌ను హిందీ చిత్ర పరిశ్రమపైనే పెట్టారు. ఐటెం సాంగ్స్‌తో పాటు హీరోయిన్‌గానూ ఆమెకు అవకాశాలు క్యూకడుతున్నాయి. విజయ్ వర్మతో బ్రేకప్

# తమన్నాకి ఆ హీరో ప్రపోజ్ చేసాడా

తర్వాత కెరీర్, వ్యాపారాలపై సరికొత్త ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఇదిలాఉండగా ఓ స్టార్ హీరో వేదిక మీదే తమన్నాకు ప్రపోజ్ చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. లస్ట్ స్టోరీస్ 2 సమయంలో తన సహనటుడు విజయ్ వర్మతో తమన్నాకి ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. ఇద్దరూ కొన్నాళ్లు సీక్రెట్‌గా డేటింగ్ చేశారు. సినిమా ఫంక్షన్లు, ఈవెంట్స్, విహారయాత్రలతో తమన్నా – విజయ్ హల్‌చల్ చేశారు. కానీ ఎక్కడా కూడా తమ బంధాన్ని బయటపెట్టలేదు. ఆ తర్వాత నెమ్మదిగా ఇద్దరూ ఓపెన్ అయ్యారు. రేపో మాపో పెళ్లి అనుకుంటుండగా తమన్నా – విజయ్ వర్మలు అనూహ్యంగా విడిపోయారు. వీరి మధ్య బ్రేకప్‌కు దారి తీసిన కారణాలు ఏంటన్నది మాత్రం తెలియరాలేదు. కెరీర్‌లో నిలదొక్కుకోవాలని విజయ్ వర్మ.. పెళ్లి చేసుకుని జీవితంలో స్థిరపడాలని తమన్నా నిర్ణయించుకోవడమే ఇందుకు ప్రధాన కారణంగా బాలీవుడ్ మీడియా కోడై కూసింది. బ్రేకప్ తర్వాత తమన్నా– విజయ్‌లు వారి జీవితాల్లో బిజీ అయ్యారు. సినిమాలు, షూటింగ్స్, బిజినెస్ ఇతర వ్యవహారాల్లో తలమునకలయ్యారు. ఈ బాధ నుంచి బయటకు రావడానికి సినిమాలను పెంచారు తమన్నా. అలాగే ఇప్పటి వరకు గ్లామరస్ రోల్స్ చేసిన నో కిస్ రూల్‌ను పక్కాగా ఫాలో అయిన ఈ ముద్దుగుమ్మ.. ఈ నిబంధనను కూడా పక్కనపెట్టారు. ఇంటిమేట్ సీన్స్, బెడ్ సీన్స్‌లో నటించేందుకు ఎలాంటి అభ్యంతరం లేదన్నట్లుగా సంకేతాలు ఇచ్చారు. దీనికి తగినట్లుగానే రాగిణి ఎంఎంస్ 3 వంటి బోల్డ్ సినిమాలో నటించేందుకు అగ్రిమెంట్ మీద సంతకం చేసింది. ప్రస్తుతం తమిళంలో పురుషన్, హిందీలో వీవాన్ ఫోర్స్ ఆఫ్ ది ఫారెస్ట్, వీ శాంతారామ్ బయోపిక్, రోహిత్ శెట్టి, జగన్ శక్తిలు తెరకెక్కించనున్న సినిమాలలో తమన్నా నటిస్తున్నారు. ఇవి కాకుండా మరిన్ని ప్రాజెక్ట్‌లు చర్చల దశలో ఉన్నాయి. అన్నింటిలోకి సిద్ధార్థ్ మల్హోత్రా సరసన నటిస్తోన్న వీవాన్ ఫోర్స్ ది ఫారెస్ట్ ముందు రిలీజయ్యే అవకాశం ఉంది. తాజాగా కృష్ణాష్టమిని పురస్కరించుకుని ఈ సినిమాలోని సమఝోనా అనే పాటను విడుదల చేశారు. ఈ సాంగ్ లాంచ్ కార్యక్రమం శుక్రవారం ముంబైలో జరిగింది. ఈ సందర్భంగా సిద్ధార్థ్– తమన్నాల కెమెస్ట్రీ అదిరిపోయింది. సమజోనా పాటను పాడుతూ.. మోకాళ్లపై కూర్చొని తమన్నాకు ప్రపోజ్ చేస్తున్నట్లుగా సిద్ధార్థ్ ఉండగా.. మిల్కీబ్యూటీ చిరునవ్వులు చిందిస్తూ సిగ్గుపడింది. అలాగే షూటింగ్ సమయంలో జరిగిన కొన్ని సంఘటనలను సిద్ధార్థ్ పంచుకున్నారు.


సినిమా సింగిడి
Cinma Singidi

సోమవారం
7-9-2026






## నందమూరి మోక్షజ్ఞ మూవీ ఖరారు.. దర్శకుడు ఎవరంటే..



ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న నందమూరి అభిమానుల కల నెరవేరింది. బాలకృష్ణ తనయుడు నందమూరి మోక్షజ్ఞ తొలి మూవీకి రంగం సిద్ధమైంది. ఈ మేరకు కొత్త సినిమా ప్రకటన వచ్చేసింది. మల్లిడి వశిష్ట దర్శకత్వంలో మోక్షజ్ఞ వెండితెరకు పరిచయం కాబోతున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ ఈ సినిమాను నిర్మించనుంది. ఆదివారం మోక్షజ్ఞ పుట్టినరోజు సందర్భంగా ఈ విషయాన్ని చిత్ర బృందం ప్రకటించింది. 'కూన గుహను వీడింది. సింహంలా అడవిలోకి అడుగు పెట్టింది. హ్యాపీబర్త్‌డే మోక్షజ్ఞ' అని మైత్రీ మూవీ మేకర్స్ ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టింది.

## 'ఎపిక్ -- ఫస్ట్ సెమిస్టర్' ట్రైలర్ రిలీజ్

'బేబీ' మూవీ సక్సెస్ తర్వాత ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య జంటగా రాబోతున్న కొత్త సినిమా 'ఎపిక్ -- ఫస్ట్ సెమిస్టర్'. ఈ యూత్‌ఫుల్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్ కి ఆదిత్య హాసన్ దర్శకత్వం వహిస్తుండగా, ప్రముఖ నిర్మాణ సంస్థలు సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై ఎస్. నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మిస్తున్నారు. సెప్టెంబర్ 11న ఈ మూవీ రిలీజ్ కానున్న నేపథ్యంలో తాజాగా చిత్ర ట్రైలర్ రిలీజ్ చేసి సినిమాపై అంచనాలు పెంచారు.






# 'డెలులు' సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తి

**ప్రస్తుతం యువతలో బాగా ట్రెండ్ అవుతున్న 'డెలులు' అనే పదమే టైటిల్‌గా తెరకెక్కుతున్న చిత్రం 'డెలులు'. క్రియేటివ్ లాంచ్‌ప్యాడ్ బ్యానర్‌పై సంకీర్త్ కొండ నిర్మిస్తున్న ఈ చిత్రానికి ప్రీతం కస్తూరి దర్శకత్వం వహిస్తున్నారు. విజయ్ రాజ్‌కుమార్ కథ, అదనపు సంభాషణలు అందించగా.. రెష్మిత్ ఎస్. కౌశిక స్క్రీన్‌ప్లే, సంభాషణలు రాశారు. టైటిల్ నుంచే విభిన్నంగా అనిపిస్తున్న ఈ సినిమాపై ఇప్పటికే ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది.**

యువతరం నటీనటులతో తెరకెక్కుతున్న 'డెలులు' మూవీ టీజర్‌ను చిత్రబృందం తాజాగా విడుదల చేసింది. ఒక నిమిషం 32 సెకండ్ల నిడివి ఉన్న ఈ టీజర్.. 'బ్రేకప్ దేవా' అనే డైలాగ్‌తో ప్రారంభమవుతుంది. ఆ తర్వాత వచ్చే సన్నివేశాలు, పాత్రల మధ్య జరిగే సరదా సంభాషణలు టీజర్‌కు మంచి ఫన్ టచ్‌ను తీసుకొచ్చాయి. టీజర్‌లోని పలు డైలాగ్స్ ప్రత్యేకంగా ఆకట్టుకుంటున్నాయి. 'ఆడదానివైన నువ్వు.. చీప్‌గా ఓ మగాడి కోసం మారతావా అంటావా.. సెల్ఫ్ రెస్పెక్ట్ లేదా నీకు', 'నువేమైనా ఫాదర్ ఆఫ్ ఇండియానా?', 'నువ్వు అత్తాపూర్‌కు రారా.. నీళ్ల ట్యాంకర్ దగ్గర ఆడోళ్లతో కొట్టిస్తా', 'కుక్కకు పుట్టినవా నువ్వు' వంటి డైలాగ్స్ టీజర్‌లో హైలైట్‌గా నిలిచాయి. ఈ డైలాగ్స్, కామెడీ సన్నివేశాలు సినిమాపై మరింత క్యూరియాసిటీని పెంచుతున్నాయి. ముఖ్యంగా ఓ ఇంటి నేపథ్యంలో చోటుచేసుకునే సరదా సంఘటనలు, పాత్రల మధ్య కెమిస్ట్రీ టీజర్‌లో ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. కామెడీతో పాటు కుటుంబ ప్రేక్షకులను అలరించే అంశాలకు కూడా సినిమాలో ప్రాధాన్యత ఇచ్చినట్లు టీజర్ చూస్తే అర్థమవుతోంది. మొత్తంగా టీజర్ ఆద్యంతం వినోదాత్మకంగా సాగుతూ ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించేలా ఉంది. ఇప్పటికే విడుదలైన పోస్టర్‌కు మంచి స్పందన రాగా.. తాజాగా వచ్చిన టీజర్ సినిమాపై అంచనాలను మరింత పెంచింది. సాంకేతికంగా కూడా 'డెలులు'కు మంచి బృందం పనిచేస్తోంది. జై రాజ్ నాయుడు సినిమాటోగ్రఫీ అందిస్తుండగా.. హరికృష్ణ కురపాటి ఎడిటర్‌గా వ్యవహరిస్తున్నారు. ఆది చెబ్రోలు సంగీతం అందిస్తున్నారు. టీజర్‌లో సంగీతం కూడా సన్నివేశాలకు తగ్గట్టుగా ఆకట్టుకుంటోంది. ఈ చిత్రంలో విజయ్ రాజ్‌కుమార్, వేణి రావు, అఖిల్ జాక్సన్, సాయి ప్రసన్న, శ్రీ రామ మండవ, అభినయ్ తుల తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. యువతను టార్గెట్ చేసే ఫన్, కామెడీ, ఎంటర్‌టైన్‌మెంట్ అంశాలతో 'డెలులు' చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు చిత్రబృందం వెల్లడించింది. టీజర్‌కు వస్తున్న స్పందనతో 'డెలులు' సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తి మరింత పెరిగింది. విభిన్నమైన టైటిల్, కామెడీతో కూడిన కథనం, ఫన్ ఎలిమెంట్స్ సినిమాకు ప్లస్‌గా మారే అవకాశముంది. ఈ సినిమా ప్రమోషన్స్ లో భాగంగా హీరో మాట్లాడుతూ.. నా సినిమాలో దమ్ము లేకుంటే విమ్ముకొని నిలబడ్డా ఎవ్వడూ చూడడు.. కాంట్రవర్సీలతో కాదు కంటెంట్ తో వస్తున్నాం. కేవలం కంటెంట్ బలంతోనే మా సినిమా నిలబడుతుంది కానీ ప్రమోషన్స్ లో ఎలాంటి కాంట్రవర్సీలకు పోయే ప్రసక్తే లేదు అని అన్నారు.


Printed and Published by Mohan Pusala on behalf of Flamingo Media Networks, Printed at Sree Seshasai Enterprises Plot no.98/1, Co-operative Industrial Estate, Gandhi Nagar, Near Balanagar, Medchel Malkajgiri Dist.Hyderabad Telangana 500037.and Published from PLOT NO 74 A/D, KAMAKSHI NILAYAM, ESHWARIPURI COLONY, SAINIKPURI, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500094.
Editor : Pusala mohan, PRGI.REGN.NO. TGTEL/26/A4370. Cell 91 89199 18737